# శారదా విజయం

(సాహితీ రూపకం)

రచన

**సత్యవాడ (ఓగేటి) ఇందిరాదేవి**

# శారదా విజయం

(సాహితీ రూపకం)

రచన

**సత్యవాడ (ఓగేటి) ఇందిరాదేవి**

© ఓగేటి ఇందిరాదేవి

ధాత ఆశ్వయుజము

అక్టోబరు

వెల రూ 25/-

టైపుసెట్టింగ్
**శ్రావణి గ్రాఫిక్స్**
3-4-610/3, నారాయణగూడ,
హైదరాబాద్ - 500 029

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE
Acc No 53645
Date

ముద్రణ
పల్లవి ఆర్ట్ ప్రింటర్స్
పద్మారావ్‌నగర్, సికింద్రాబాద్ - 500 025

ప్రతులకు
వి. ఇందిరాదేవి
3-6-470, పావని సత్యాకాంప్లెక్స్‌హర్డకర్‌బాగ్,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు - 29.

# అంకితం

అఖిలాశ్రితరక్షణ దక్షమైన వెంకటే
శ్వరస్వామివారి శ్రీ పాద యుగళికి

భక్తితో
రచయిత్రి

This Book is Published with the financial
assistance of
TIRUMALA TIRUPATI DEVASTHANAMS
under their Scheme aid to publish
relegious books.

# నా మాట

నాకు ఎప్పట్నించో ఒక ఆలోచన, పురుషులు వందలాదిమంది కవులుగా సుప్రసిద్ధులు. మరి స్త్రీలు? మొల్ల రామాయణమూ, ముద్దు పళని రాధికా సాంత్వనమూ, వెంగమాంబ రాజయోగసారమూ తప్ప మిగిలిన పేర్లు ఎక్కువ వినబడవు. పురుష కవులకంటే రచయితల కంటే కవయిత్రులూ రచయిత్రులూ తక్కువే ఎందుకనీ, అనివెతుక్కుంటూ పోయి వెయ్యేళ్ళ సాహిత్య సముద్రంలో అతి తక్కువ మంది ఆణిముత్యాలను వెలికి తీసుకొచ్చి ఈ రూపకం రాయడం జరిగింది. వీరి గురించి నేనే కాదు శ్రీమతి లక్ష్మీకాంతమ్మ గారి వంటి పండితులూ కొందరు రాశారు. కానీ ఉన్నంతలో ఒక సమగ్రమైన రూపకల్పన చేసి స్త్రీ వాద నేపథ్యంలో ఆలోచించి చమత్కార పూరితంగా శారదా సదస్సు అనే ఈ సాహిత్య రూపకం రచించగలిగాననుకుంటున్నాను. భిన్న రుచిర్హిలోకః. నా ప్రయత్నం ఎట్లా వుందో? తప్పులేవైనా దొర్లి వుంటే క్షమార్హురాలిని మంచివేమన్నా వుంటే వాటికి సహృదయ పాఠక ప్రేక్షకలోకమే ప్రమాణం. ఇల్లు నిర్వహించుకుంటూ కవిత్వం రాసిన స్త్రీలు చాలా తక్కువగా కనపడుతున్నారు విరక్తిగాని అనురక్తిగాని కలిగిన మహిళలు తమకి అవకాశం దొరకటంవల్ల కాబోలు కావ్య నిర్మాణం చేయగలిగారు. ఇల్లాళ్ళు కూడా ఇంకా రాశారేమో చెప్పలేం. ఎవరి కవిత్వమైనా సమగ్రంగా దొరికితే కదా, నిర్ణయించడానికి చాలా మంది కవయిత్రుల కావ్యాల్లో చాలా తక్కువ పద్యాలు మట్టుకే లభిస్తున్నాయి అవన్నీ ఒకచోట చేర్చటానికి ప్రయత్నమే ఈ శారదా సదస్సు కొన్ని చోట్ల వేరే పద్యాలు తీసుకోవాల్సి వచ్చింది లేకపోతే గ్రంథసమగ్రత రాదు జాతీయ సమైక్య భావన పెంపొందించిన ఈ మహిళామణులకు నా ప్రణామాలు.

రచయిత్రి
పత్యావాడ (ఓగేటి) ఇందిరాదేవి
హైదరాబాదు

# అభినందన

తెలుగు సాహిత్య లోకానికి "భువన విజయ" రూపక ప్రదర్శన చిరపరిచితం. ఆ రూపకంలో పాత్రధారులైన కవులు ఏకకాలంలోని వారు కాదని తెలిసినా, ఆ రూపకాన్ని సమగ్రంగా ప్రదర్శించినప్పుడు సాహిత్యాభిమానులు సంతోషిస్తూనే ఉన్నారు. అందుకు కారణం అంతటి మహాకవులు ఒకేకాలంలో ఉంటే ఎంత బాగుండేదో అని.

"భువనవిజయం" కోవలోనే రూపొందించిన రూపకం ఈ "శారదా విజయం". తెలుగు సాహిత్య విద్యార్థినిగా, అధ్యాపకురాలిగా అనుభవం గడించుకున్న "సత్యవాత (ఒగేటి) ఇందిరాదేవిగారు ప్రదర్శన యోగ్యత కలిగిన ఈ రూపకం రచించారు. ఇందులో తెలుగు కవయిత్రులున్నారు. కర్త్రీ మణులున్నారు. అంతటితోనే ఆవిడ రచనా పరిధిని పరిమితం చేసుకోలేదు. సరోజినీనాయుడు, అరావతి, మహాదేవివర్మ లాంటి జాతీయస్థాయి రచయిత్రులను కూడా ఈ రూపకంలో పాత్రలుగా సంతరించారు.

ఆయా రచయిత్రుల పద్యశ్లోకాలను సందర్భోచితంగా తమ రచనలో పొదుగుకుంటూ, పాత్రోచిత రీతిలో చక్కని సంభాషణలను రచించారు. అవసరమైనప్పుడు జానపదగీతాల పంక్తులకు కూడా ఈ రూపకంలో స్థానం కల్పించడం ఇందిరాదేవిగారి సౌహార్ద్రానికి నిదర్శనం.

ప్రాచీనాంధ్ర సాహిత్యంతో ఏమాత్రం పరిచయమున్న సహృదయులకైనా చవులూరించే గ్రంథమిది. ఎందరెందరో రచయిత్రులను గురించి ఒకే వేదికపైన పరిచయం చేసిన ప్రత్యేకత కూడా ఈ కృతికున్నది

తమ కున్న ప్రతిభావైదుష్యాలను తగినపాళ్ళలో శ్రుతిచేసి ఈ కమనీయ రూపకం రచించిన మా పూర్వ విద్యార్థిని ఇందిరాదేవిని హార్దికంగా అభినందిస్తున్నాము.

డా॥ సి. నారాయణరెడ్డి
జ్ఞానపీఠ పురస్కార గ్రహీత
పద్మభూషణ్
అధ్యక్షులు, ఆంధ్రసారస్వతపరిషత్తు

హైదరాబాదు
10-10-95

# అభినందన

ఎవరు ఎంతగింజుకున్నా భువన విజయాలు ఈనాటికే జనాదరణను పొందుతున్నాయి అష్టదిగ్గజకవులూ కృష్ణ దేవరాయలూ తిమ్మరుసు పాత్రలను ధరించి కవిపండితులు కొలువుతీరి సమస్యాపూరణలతో సరసనంభాషణలతో కావ్య ప్రసంగాలతో అప్పుడప్పుడు కొంచెం మితిమీరిన శృంగారంతో ఒక అపూర్వమైన సాహిత్య వాతావరణాన్ని కల్పించి ప్రబంధకాలం నాటి సాహితీ పరిమళాలను పంచి పెట్టడం సారస్వతీ ప్రియులకు నిజంగా పండువుగానే ఉంటోంది. ఈ రకం సాహితీ రూపకానికి సృష్టికర్త జమ్ములమడక మాధవ రామశర్మ గారని పెద్దలు చెప్పగా విన్నాను జమ్ముల మడకవారు సంస్కృత పండితులు తెలుగులో పద్యం చెప్పడం గానీ అల్లడంగానీ చేతనైన వారు కాదు అనర్గళంగా ప్రసంగించగల్గిన గొప్పవక్త అయినా తనకు ఈ రూపకంలో చోటు కల్పించు కోవడం కోసమే తిమ్మరుసు పాత్రను ప్రవేశపెట్టారని కూడా కొందరనగా విన్నాను నిజమే తిమ్మరుసుకీ తెలుగు కవిత్వానికీ సంబంధం లేదు రాయలవారు తీరికవేళల్లో కులాసాగా నడిపే భువనవిజయ సాహిత్య గోష్ఠిలోకి ఆ పరిపాలనాదక్షుడు తలదూర్చి ఉండడు జమాశర్మగారు తన కోసమే ఈ ఏర్పాటు చేసుకుని ఉంటారు అయితేనేమి ఇవ్వాళ తిమ్మరుసు లేని భువనవిజయం (శ్రీ కె వి శివయ్యగారిని మినహాయిస్తే) ఊహించలేం. అంతగా అల్లుకుపోయాడు తిమ్మరుసు రాయలవారిని డమ్మీనిచేసి తానే సభ నడిపిస్తాడు, సమ్మానాలు జరిపిస్తాడు

ఇక్కడో సంగతి చెప్పాలి ఒకసారి భువనవిజయంలో పెద్దన పాత్రధారి డుమ్మా కొట్టారు జమాశర్మగారు అనివార్యంగా పెద్దన కావలసివచ్చింది తిమ్మరుసుకి గుడ్‌బై చెప్పి తాను పెద్దనగా కూచుని సభను నడిపిస్తున్నారు సమస్యాపూరణం రెండు కావస్తోంది తెనాలి రామకృష్ణుడు లేచి "పెద్దన కవీంద్రా! అందరికీ సమస్యలు మీరిచ్చారు మీకు నేనిస్తున్నాను - రాయల వంటిరాజు కనరాడుగదా ధరాతలంబునన్ పూరించండి' అన్నాడు ఆశువు చెప్పడం అలవాటులేని జమాశర్మగారు అద్భుతం చేసారు శాలువా వల్లె వాటుని అటూ ఇటూ మారుస్తూ మూడు మైకుల దగ్గరా మూడుసార్లు అదేపాదాన్ని గంభీరంగా ఉచ్చరించి ముమ్మాటికీ - రాయలవంటి రాజు కనరాడుగదా ధరాతలంబునన్ అంటూ కూర్చున్నారు ఆ సమయ స్ఫూర్తికి కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి ఇలాంటివి భువనవిజయాల అనుభవాలు

చాలా ఉన్నాయి ఎవరైన ఓపిక చేసుకుని అందరి దగ్గరా వీటిని సేకరిస్తే బాగుంటుంది సరే ప్రస్తుతంలోకి వద్దాం

భువన విజయం ఒజ్జబంతిగా కవనవిజయం, ఇంద్రసభ, చంద్రసభ, మయసభ, బ్రహ్మసభ, కైలాససభ, వైకుంఠ సభ శ్రీదేవీ విజయం ఇలా రూపకాలు ఆవిర్భవించాయి. వీటిలో దేని ప్రత్యేకత దానిదయినా కొన్నిటికి కొందరు స్క్రిప్టుకూడా తయారుచేసి పూర్తిస్థాయి నాటకాలు రూపొందించారు ఇదగో ఈ శారదావిజయం ఈ కోవలోది

ఇది కేవలం కవయిత్రుల భువనవిజయమన్నమాట రాయలవారికి బదులుగా సరస్వతి కూచుంటే, తిమ్మరుసుకి బదులుగా కలభాషిణిని నిలబెట్టి సభ నడిపించారు శ్రీమతి ఓగేటి ఇందిరగారు. విభిన్న కాలాలకూ విభిన్న భాషలకూ చెందిన కవయిత్రులంతా ఇందులో పాత్రలు ఇది ఎస్వీ జోగారావు గారు రూపకల్పన చేసిన బ్రహ్మసభ లాంటిది సత్యలోకంలో జరిగేది కనక భాషాకాలభేదాలు పట్టింపులకి రావు బతికున్న కవులనూ కవయిత్రులనూ వదిలేస్తే చాలు ఈ గొప్ప వెసులుబాటుని శ్రీమతి ఇందిరాదేవి గారు అద్భుతంగా ఉపయోగించుకున్నారు గోదాదేవి, గంగా, మహాదేవి, సరోజినీ నాయుడు, మహాదేవి వర్మ - ఇలా అందరినీ కలగలపగలిగారు ఒక్కమాటలో చెప్పాలంటే వీరి ఈ రూపకం సాహితీ జాతీయ సమైక్య సాధకం మనసార అభినందిస్తున్నాను

ఎక్కడెక్కడినో శ్రమపడి సేకరించి - ఆయా కవయిత్రుల అందమైన పద్యాలనూ పాటలనూ శ్లోకాలను సందర్భశుద్ధిగా చెప్పడం, అందమైన సంభాషణలతో కూర్చడం - చాలా బాగున్నాయి మధ్య మధ్యలో మహిళాభ్యుదయం, ఆధునికత, సామాజికత, ఈర్ష్యాసూయలూ, విసుర్లూ అబ్బో చాలా సొగసులు చేర్చారు ఒక అద్భుతమైన సాహిత్య వాతావరణాన్ని సృష్టించగలిగారు ప్రదర్శన యోగ్యంగా ఉంది. సారస్వత కుటుంబం నుంచి వచ్చినవారు గనక శ్రీమతి ఇందిర గారు న్యాయం చెయ్యగలిగారు ఇది తప్పకుండా సాహితీ ప్రియుల్ని ఆనందింపజేస్తుందని నా నమ్మకం ఏమయినా మంచి ప్రయత్నం చేసి సఫలీకృతురాలయ్యారని మరోసారి అభినందిస్తూ - సెలవు

బొమ్మూరు
29-6-95

బేతవోలు రామబ్రహ్మం

# ఇందిరా విజయం

– 'సాహిత్య బ్రహ్మ' డా॥ వి.వి.యల్. నరసింహారావు

'శారదా విజయం' సుప్రసిద్ధ సాహితీ రూపకం సాహితీ రూపక మనగానే మనకు వెంటనే స్ఫురించేది 'భువన విజయం' శ్రీకృష్ణదేవరాయలు అష్టదిగ్గజ కవులతో సాగించే సాహిత్యగోష్ఠి అది తెలుగునాట ఈ శతాబ్దిలో వేనవేల ప్రదర్శనలు జరిగిన సాహిత్య రూపకమది ఆ మార్గంలో 'వైకుంఠ సాహితీ సభ' 'కైలాస సాహితీ సభ' 'ఇంద్రసభ' 'ఇందిరామందిర సభ' మొదలైన ఎన్నో సాహితీ రూపకాలు ప్రదర్శితమై రాష్ట్ర రాష్ట్రేతర విఖ్యాతి నార్జించాయి ప్రస్తుత సాహితీ రూపకం 'శారదా విజయము' కూడా ఈ మార్గంలో సుప్రసిద్ధి నార్జించుకొంది

పైన పేర్కొన్న సర్వసాహితీ రూపకాలకంటే ఈ రూపకం ఒక విశిష్టత నార్జించుకొంది. అదేమంటే - అవన్నీ పురుషపుంగవులు నిర్వహించే సభలు ఇది ప్రత్యేకంగా మహిళామణులు నిర్వహించే సభ సభానాయిక సాక్షాత్తు చదువులతల్లి శారద విద్యావిషయికంగా, కవితా కళా విషయికంగా ఆ తల్లి సాధించే ఘనవిజయమే ఇందులోని వస్తువు కనుక రూపకనామం - శారదా విజయం - సార్థకమౌతున్నది

ఇంతటి సార్థకాఖ్య వహించిన ఈ విశిష్ట రూపకాన్ని రచించి, ప్రదర్శించిన రచయిత్రి శ్రీమతి ఓగేటి ఇందిరాదేవి అన్నపూర్ణాచంద్రమౌళి పుణ్యదంపతులు పుత్రిక. ప్రస్తావనలో పేర్కొన్నట్లు పుట్టినిల్లు పండితవంశం ఇటువంటి విశిష్ట రూపక రచనకు పుట్టింటి శేముషీవాసనా బలం ఎంతగానో ఉపకరించి ఉంటుంది రచయిత్రికి మీదుమిక్కిలి నిత్యవ్యాసంగం సాహిత్యాధ్యాపనం. హైదరాబాదు సిటీ కాలేజీలో ఆంధ్రాశాఖాధిపత్యం కొదవేముంటుంది? అవలీలగా అపురూపమైన ఈ రూపక రచనకు దోహదం కలిగింది.

ఈ ఒక్క రచన మాత్రమే కాదు ఈ రచయిత్రి 'ఆనందధార' వంటి అద్భుత చారిత్రిక నవలలు కూడా రచించారు. కొన్నేళ్ళ క్రిందట ప్రసిద్ధ వారపత్రికలో 'ఆనందధార' ధారావాహికంగా ప్రచురితమై, రసజ్ఞపాఠక లోకాన్ని

వార్షి ప్రసి, ఇటీవలే గ్రంథ రూపంలో ఆవిష్కృతమైంది కాకతీయాంధ్ర నేర్పించిన్ది రుద్రమదేవి వీరగాథ అందులోని ఇతివృత్తం గుండెలు పులకింపజేసే ముగ్ధ శైలిలో రచించబడిన చారిత్రిక నవల.

ప్రస్తుత 'శారదా విజయం' రూపకం ఒకవిధంగా సంకలన రచన అవుతుంది. శారదా దేవి తీర్చిన కవితాసాహితీ సభలో పాల్గొనే వారంతా కవయిత్రులు, రచయిత్రులే. దాదాపు పాతికమంది యావద్భారతంలో వివిధ ప్రాంతాలలో వివిధ భాషలలో సుప్రసిద్ధి నార్జించుకొన్న సాహిత్యమూర్తులు వారు కొందరు నర్తకీ మణులూ ఉన్నారు మొల్ల, తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంకమాంబ, మోహనాంగి రంగాజమ్మ, ముద్దుపళని మొదలైన తెలుగు కవయిత్రులు, మధురవాణి రామభద్రాంబ గంగాదేవి మొదలైన సంస్కృత కవయిత్రులు, గోదాదేవి, అక్కమహాదేవి, మీరాబాయి మొదలైన భాషాతీత దివ్యకవయిత్రులు ఇంకా ఇంకా మహాదేవివర్మ (ఉత్తరప్రదేశ్), త్రివేణి (కన్నడ నవలారచయిత్రి) సుభద్రాకుమారి (మధ్యప్రదేశ్), ఐరావతీకర్వే (మహరాష్ట్ర), లల్లాదేవి (కాశ్మీరు), మనోరమాతంబురాట్టి (కేరళ), సరోజినీదేవి భారతీయ ఆంగ్ల కవయిత్రి మొదలైన అనేక కవయిత్రులను ఏకవేదిక మీదకు సందర్భ శుద్ధితో సమావేశపరిచి సరస్వతీదేవి సన్నిధిలో సారస్వతగోష్ఠి జరిపించగా, అది చూచి ఆనందించే అదృష్టం సామాన్యమైందా?

ఆ అదృష్టాన్ని పంచుకొనే అవకాశం నాకూ కలిగింది ప్రస్తుతాంధ్ర సాహితీ రంగంలో లబ్ధ ప్రతిష్ఠలైన అనేక కవయిత్రులు, రచయిత్రులు, ఉపన్యాసకు రాండ్రు ఈ సాహితీ రూపకంలో వివిధ భూమికల్లో ప్రత్యక్షం కావటం కన్నుల పండుగే కాక వీనులవిందు కూడా అవుతుంది

ఈ సాహితీ రూపక ప్రదర్శన నిర్వహణ బాధ్యత కూడా చేపట్టిన శ్రీమతి సత్యవాద (ఓగేటి వారి బిడ్డ) ఇందిరాదేవి - రంగాజమ్మ, మొల్ల, అక్కమహా దేవి పాత్రలను అతిసమర్థతతో అభినయించ గలుగుతున్నారు డా॥ ఎన్ నిర్మలా దేవి గారి వంటి పండిత పరిశోధకాధ్యాపకురాండ్రు ఈ రూపకంలో పాల్గొని తరువాత తరువాత నిర్వహణ బాధ్యత కూడా స్వీకరించటం - నిర్మలాంతః కరణంతో సాధించే 'శారదా విజయం'గా సంభావనీయం

రూపక వస్తువు ననుసరించి దీనిని జాతీయ సమైక్య దృష్టితో ఇం రూపొందించారని పదపదాన స్పష్టమౌతుంది కనుక దీనిని 'సమైక్య', అని కాని, 'సమాహార భారతి' అని కాని, సంభావించవచ్చు పరమ సంభావ్యమే ఈ అభిప్రాయమును రచయిత్రి కలభాషిణి పాత్రముఖంగా వాచ్యం చేయటం కూడా జరిగింది "సర్వ భారత సమైక్యమును సాధించు సరస్వతీ దేవికి అపురూపమైన అలంకారములు మీరందరూ" అని అంటుంది కలభాషిణి సరోజినిదేవి మొదలైన కయిత్రులతో (పుట 10) ఇది అక్షరసత్యమైన అంశం

ఈ రూపకంలో సాంఘికమైనవీ, కుటుంబసంబంధమైనవీ - కొన్ని సమస్యలకు పరిష్కారసూచన కూడా గోచరిస్తుంది కలభాషిణి తాళ్లపాక తిమ్మక్కతో అంటుంది "అమ్మా, తిమ్మక్కా! ఆడుబిడ్డల మధ్య సవతిసోదరితో కలిసి కష్టసుఖాలనుభవించిన దానివి సమిష్టి కుటుంబాలుంటే సంఘస్వరూపం కొంత ఒబ్బిడిగా ఉంటుందనే మాట ఆధునిక శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకుంటున్నారు కాని ఇంట్లో ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం తక్కువౌతోందని చిన్న చిన్నకుటుంబాలు ఏర్పరచుకుంటున్నారట నవీనులు" (పుట 28)

ఇందిరా దేవి ఎంతో దూరదృష్టితో సంతరించిన సంభాషణ ఇది

స్త్రీ స్వాతంత్ర్య ప్రసక్తి వచ్చింది కనుక ఇక్కడ ఒక్కమాట చెప్పాలి స్వతంత్ర దృష్టితో నేడు నారీలోకమంతా యావత్ప్రపంచంలోను విజృంభిస్తున్న కాలమిది అత్యవసరమైన ఈ దృష్టిని కూడా 'శారదా విజయం' చక్కగా ప్రతిఫలిస్తోంది

ముద్దుపళనితో తిమ్మక్క అంటుంది - "ఇంత ఇల్లూ సమర్థించుకొని, నేను తెమిలి, తాటాకూ గంటమూ చేతపుచ్చుకోవటం గగనమయ్యేది ఏ ముసలమ్మలో పక్కింటివాళ్లో చూశారంటే - 'అవ్వ! సిగ్గులేకుండా తిమ్మక్క మగవాళ్ళకి మల్లే కవిత్వం రాస్తోంది, పిదపకాలం! పిదప బుద్ధులూ' అని విమర్శించేవాళ్ళు" (పుట 35) ఈ మాటకు గంగాదేవి "స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్లు ప్రవర్తిస్తే ఇంక మనం బాగుపడేది ఎప్పుడు?" అంటుంది ఈ మాటలు ఎంతో అంతర్విమర్శతో గూడిన మాటలు ఆత్మ విమర్శతో గూడిన అమృత వాక్కులు

వార్ని ప్రస్తావించి, ఆయనగారి "ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్?" అనే పద్యపాదం జ్ఞప్తికి తెస్తుంది. కాలాన్నిబట్టి ఇక్కడ గోదాదేవి ముందా? చిలకమర్తిముందా? అనే అనుమానం ప్రేక్షకులకు కలుగవచ్చు దానిని నివృత్తి చేసేందుకే గోదాదేవి చేత "ఈ సత్యలోకంలోనే ఉన్న ఆధునిక కవి' అని చిలకమర్తి వార్ని ప్రస్తావింపజేయడం జరిగింది ఇది ఎంతో ఔచితీ భాసురంగా ఉంది 'సత్యశోధన కోసం కవితలు రమణీయంగా సృష్టించిన కవులు కీర్తిశేషులై సత్య లోకంలోకి కాక మరెక్కడికి వెళతారు? అనే ఉదాత్త భావన ఇక్కడ ధ్వనిస్తుంది

అయితే చిలకమర్తి వారి పలుకుల్లో కూడా "నేర్పించినన్ అనేది స్త్రీవాదోద్యమదృష్టితో సమర్థించ తగిందిగా లేదు పురుషుడు నేర్పించక పోయినా స్త్రీ తనంతతాను సర్వవిద్యాలూ నేర్చుకోగలదు ఈ భావం మనసులో ఉంచుకొనే ముద్దుపళని అంటుంది ఎంతోబాధతో - మనం ఎప్పుడూ ఆధారపడి బతికే వాళ్ళమే అవుతున్నాం ఆర్థిక స్వాతంత్ర్యం ఎంత ఉండనీ. సంఘంలో మనది రెండవ స్థానమే పైగా కుటుంబ బాధ్యతలూ పిల్లల్ని కనడం పెంచడం వీటితో సతమతమై పోతుంటిమి కదా!' (పుట 53)

ఇట్లా ఎన్నెన్నో ఆవశ్యక విషయాలను, సమస్యలను స్త్రీ వాదోద్యమ దృష్టితో ఇందిరాదేవి ఈ రూపకంలో సందర్భశుద్ధితో సంఘటించారు

ఇన్ని మహావిషయాలు, రూపకమర్యాదకు భంగం రానీయకుండా ప్రేక్షకలోకానికి పరమోత్కంఠరజనించే రీతిలో సంతరించిన శ్రీమతి సత్యవాడ ఇందిరాదేవి 'శారదా విజయం' అక్షరసత్యంగా భాసిస్తోంది ఒక విధంగా ఇది ఇందిరా విజయమే అందుకే నా ఆత్మీయమైన అభినందనలు

వి.వి.యల్. నరసింహారావు
రిటైర్డ్ డైరెక్టర్, ఆం ప్ర ప్రభుత్వ విద్యాశాఖ
ప్రస్తుతం ప్రాంతీయ సమన్వయాధికారి,
నేషనల్ స్కూల్ భారతప్రభుత్వం

హైదరాబాద్
16-4-95

# కృతజ్ఞతలు

ఈ రూపకాన్ని శారదా పాదపుష్పంగా సరి కూర్చటానికి చాలా మంది విజ్ఞుల సహాయమూ ఆశీర్వచనమూ కూడా లభించాయి.

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారికీ, శ్రీ చాగంటి గోపాలకృష్ణమూర్తి గారికీ, శ్రీ పోతుకూచి సూర్యనారాయణ శాస్త్రి గారికీ శ్రీ ఆర్. ఎల్. కామేశ్వరరావుగారికీ - శ్రీ శిష్టాలక్ష్మీకాంతశాస్త్రి గారికీ, డా॥ మృణాళినికి ప్రోత్సహించిన అనేకులకీ, ప్రై, ప్రేమ కుమారికీ కృతజ్ఞతాపూర్వక వినయాంజలి. ముందుమాటలు వ్రాసిన ప్రముఖులందరికీ అభివందనాలు. శ్రీ వేమరాజు నరసింహారావుగారికి ప్రత్యేక కృతజ్ఞతలు, సహాయ పడిన శిష్యులకీ, ఆశీర్వచనాలు - ముఖ్యంగా చి॥ కాసోజి భూషణ్ సహాయం మర్చిపోలేనిది. టీ వి.లో (సరస్వతీ విజయం) శారదా సదస్సు సంక్షిప్త రూపకాన్ని ప్రదర్శించటానికి అనుమతించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి ధన్యవాదాలు

విదేశాల్లో ప్రదర్శించటానికి అవకాశమిచ్చిన తానా నిర్వాహకులకీ, శాయశక్తులా తప్పులు లేకుండా ప్రచురించిన పల్లవి ఆర్ట్ ప్రింటర్స్ శ్రీ సంపువు రమేష్ గారికి ధన్యవాదాలు

మా శారదా సదస్సు ట్రూపు వారిచే అనేక ప్రదర్శనలిప్పించిన సహృదయులందరికీ ధన్యవాదాలు. సహాయం చేసినవారికీ చెయ్యని తదితరులకీ కూడా ధన్యవాదాలు.

రచయిత్రి

సత్యవాడ (ఓగేటి) ఇందిరాదేవి

హైదరాబాదు

ఈ రూపకాన్ని ఎవరన్నా యథేచ్ఛగా ప్రదర్శించుకోవచ్చును.
రచయిత్రి పేరు చెప్పటం మటుకు సభ్యత - మర్యాద.
ఫలానాచోట వేస్తున్నామని తెలిపితే సంతోషిస్తాను.

# తెరలో శన్నో మిత్రః.... (శాంతి పాఠం)

తరువాత-

**తేనెలొలికెడి** కవనాల మొల్లమాంబ

సంగీత సాహిత్యచటులార్భటిన్ రామభద్రాంబ

చవులూరు ఫణితులన్ తరిగొండ వెంకాంబ

కవితా మహోత్తుంగ తరంగిణి మధురవాణి

మాధుర్య రసఝురీ రాణి గంగాదేవి

మంజరీ ద్విపదల చెన్నారు తిమ్మక్క గారు

ప్రౌఢ కవి తాప్రహేల యౌ ముద్దు పళని

ఇందిరామందిర రుచిర నాట్యలేఖ చంద్రరేఖ

కృష్ణరాయలపుత్రికవయిత్రి మోహనాంగి

కనకాభిషేకంపు రీవులొలయించు రంగాజమ్మ

ఛందో విజ్ఞాన పారమ్య రమ్యకృష్ణజమ్మ

వాక్కులే వేలైన అవ్వ కాశ్మీరలల్ల

జ్ఞానపీఠ గృహీత మహాదేవి వర్మ

వీరనారి చౌహాను సుభద్రా కుమారి

నవలారచనలో మేటి కర్ణాటత్రివేణి

విష్ణు భక్తినుప్పొంగు గోదాదేవి మీరాబాయి

మల్లికార్జున సేవా నిరతి అక్కమహాదేవి

ప్రపంచ విఖ్యాత కవికోకిల సరోజినీదేవి

కరము సంప్రదాయ సాహిత్య సరణిఇరావతి కార్వే
మళయాళమణిప్రవాళమున [illegible]
పాండితీ విభవమండిత బెంగుళూరు నాగరత్నమ్మ
ప్రఖ్యాత రాజనర్తకీమణులు లకుమా మాచల్దేవి
నీ చరణ సేవకై ఏతెంచినారు
విద్యకు నిధానమౌ వినాయాంబురాశి
తెలికళలు వెదజల్లు బంగారు తల్లి
కడకంటి చూపైన మా పైన బరిపి
దీవింపవే మమ్ము అనుదినమ్ము
చెల్లింపవే అమ్మ ! ముద్దుమురిపాలు
శ్రీ శారదాదేవి అభయహస్తాన
పాలించుకో మమ్ము అహరహమ్ము -

# శారదా విజయం

## ప్రస్తావన

*శ్లో॥ శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణమ్ చతుర్భుజమ్*
*ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే ॥*
తెరతీసిన తరువాత . .

తుంబురుడు ప్రవేశించును

తుం స్వస్తి! నేడు సత్యలోకము మిక్కిలి సుందరముగ నున్నది. నవ్వుల కలకలలతో గాజుల గల గలలతో చీర ల రెప రెపలతో కోలాహలముగ నున్నది సంగతి ఏమో కనుగొనెదను గాక

(దిగ్గరగా) - కలభాషిణీ, కచ్ఛపీ, ఇటురందు -

కల (ప్రవేశించి -) ఆర్య! తుంబురులా? తమరాకచే సత్యలోకము సంతోష పూరితమైనది అన్నట్లు కచ్ఛపి వీణయై అమ్మవారి హస్తమలంకరించి నది పిలిచిన విషయమేమో సెలవిండు

తుం అమ్మవారు సరస్వతీదేవి వీణాగానము చేయుచుండెనన్నమాట సరియే. ఆ కిల కిల లేమిటి?

కల నేడు శారదా సదస్సు జరగబోవుచున్నది భూలోకములో భరత ఖండములోని ప్రసిద్ధులయిన కవయిత్రులు కొందరు దేవి సేవకు సమాయత్తమగుచున్నారు

। శారదా విజయం ।

తుం : అటులనా! అయిన ఈ సదస్సులో తప్పక పాల్గొన వలసినదే. సభా నిర్వాహకురాలివి సంధాన కర్త్రివి నీవేనా?

కల : ఆర్యా! అంత పెద్దమాటలనకుడు. ఏదియో వాణిదయ.

తుం : నీ వినయము నేనెరుగనిదా? ఔను ఈ శారదా సదస్సు సరస్వతీ విజయమై సాహితీ రూపకముగా ప్రదర్శింప బడబోవుచున్నది గదా!

కల : అందులకే ఈ సభాభవనము రసజ్ఞులైన ప్రేక్షకులతో క్రిక్కిరిసియున్నది. ఈ నాటకము ప్రదర్శించుటకు నేనెంతయు నువ్విళ్ళూరుచున్నాను.

తుం : సహజమే సాక్షాత్తు చదువుల తల్లి శారదాదేవి సభను తిలకించి మైమరచి పోవుట. సకృత్తుగా గాని సిద్ధించదుగదా. ఇంతకు నీ నాటకమును రచించి ప్రదర్శించుచున్న దెవరు?

కల : రచయిత్రి ఇందిరాదేవి. ఓగేటి చంద్రమౌళి, అన్నపూర్ణలకు జన్మించినది. డాక్టరు సత్యవాద వెంకటేశ్వరరావుగారి కోడలు. హైదరాబాదులోని పిటీ కాలేజిలో ఆంధ్ర శాఖాధిపతి. యథాశక్తిగా తన రచనలతో భాషాయోష నర్చించుచున్నది. పుట్టినిల్లా పండితవంశము చిలుకూరి పాపయ్యశాస్త్రి, దివాకర్ల వేంకటావధాని మొదలైన ప్రముఖ గురువుల శిష్యురాలు. ఆర్య తుంబురుడా! మరి నేను పోయిరానా! ఆహుతుల ఔత్సుక్యము నింక పరీక్షించుట పాడిగాదుగదా!

తుం : అట్లే! నీ వేషధారణమంతయు సిద్ధముగనే యున్నట్లున్నది నేనును ప్రేక్షకులలో నుండి రస రమ్య సాహితీ రూపకమును శారదా విజయమును తిలకించెదను. కల్యాణాయ సతాంభూయాత్.

( కలభాషిణీ తుంబురులు నిష్క్రమింతురు )

★ ★ ★

కల్యాణాయ సతామ్ భూయాత్ దేవో
దన్తావళానన శరణాగత సంకల్ప కల్పావకల్ప పాదపః

(అని చదువుతూ కలభాషిణి శారదాదేవిని తీసుకుని వస్తుంది.)
(ఇద్దరూ కూర్చుంటారు).

శారద · (చిరునవ్వుతో) - కలభాషిణీ కవయిత్రులతో గోష్ఠి ఏర్పాటు చేశానవ్నావు గదా ?

కలభాషిణి తల్లీ! కవయిత్రులు నీ ఆజ్ఞకై వేచివున్నారు - సదస్సుకు వారిని ఆహ్వానించమని సెలవా?

శారద ఆవశ్యము కలభాషిణీ.

కలభాషిణీ - పంపా విరూపాక్షబహుజటా జూటికా రగ్వధ ప్రసర సౌరభ్యములు సుప్రసిద్ధములు. శారదా మాతా! ఈమె గంగాదేవి హంపీ విద్యా నగరమున ధర్మరాజ్య సంస్థాపనము చేసిన హరిహర బుక్కరాయలలో బుక్కరాయ మహీపతి కోడలు. వీరకంపరాయల ప్రియపత్ని. తన భర్త విజయము కథావస్తువుగా గంగాదేవి మధురావిజయము అను సంస్కృత కావ్యమును రచించినది.

గంగా - భారతీదేవి! నమోన్నమః.
మహాకవి ముఖాంభోజ మణిపంజర శారికామ్
చైతన్య జలధి జ్యోత్స్నాం దేవీం వందే సరస్వతీమ్

(అని నమస్కరించి వెళ్ళికూర్చుంటుంది) ·

కల రావమ్మా మొల్లా! దేశకాలతీతమైన రమణీయ రామాయణ కథను కావ్యంగా మలిచి ఆంధ్ర సాహితీ వనంలో మొల్ల మొక్కయై మొలిచి తన పద్య ప్రసూనాలతో ఆశావకాశాలను

సువాసనా భరితంచేసిన వినయ శోభిత, కేననవరపుత్రి మొల్ల నీ సేవామహోత్సవానికై ఏతెంచినది మాతా!

మొల్ల · (చేతులు మోడ్చి -)

మేలిమి మంచుకొండ నుపమింపగ జాలిన యంచనెక్కి వా
హ్యాళినటించివచ్చు చతురాస్యు నెదుర్కొని నవ్వుదేరగా
నాలిక సోగకన్నుల నివాళి యొనర్చి ముదంబు గూర్చు వి
ద్యాలయవాణి శబ్దముల నర్థములన్ సతతంబు మాకిడున్

(అని కూర్చుంటుంది)

కల · శ్రీ వేంకటగిరిపతి బిరుదు గజ్జెల ముప్పిడి కటారమెత్తిన అవతారము సంకీర్తనాచార్యులు తాళ్ళపాక అన్నమాచార్యులు, ఆయన భక్తి గీత తరంగములు పదకవిత్వ భావుకసాగరములలో ఎగసిపడి తెలుగునేలను అపాత మధురము ముంచి తేల్చుచుండును అన్నమాచార్యునిధర్మపత్ని తాళ్ళపాక తిమ్మక్క, సుభద్రాకల్యాణ ద్విపద కావ్యకర్త్రి భువనేశ్వరి! నీ సేవకు సమాయత్తమైనది

తిమ్మక్క (నమస్కరించి)

యాకుందేందు తుషార హారధవళా' యాశుభ్రవస్త్రాన్వితా
యావీణా వరదండమండితకరా యాశ్వేతపద్మాసనా
యా బ్రహ్మార్చిత శంకర ప్రభృతిభిర్దేవై స్సదా పూజితా
సామాంపాతు సరస్వతీ భగవతీ! నిశ్శేష జాడ్యాపహా !

(కూర్చుంటుంది)

కల · వేంకటాచల మహాత్మ్యమును, వేదాంత తత్త్వమును, రాజయోగ సారమును, అనేక పుణ్యాత్మక ద్విపద కథలను కూర్చిన

భవ్యచరిత్రా! తరిగొండ వేంగమాంబా! రావమ్మా! నీ భక్తి రచనలతో వాణినిక్తై సేయవమ్మా! రాజస్థానమున మీరాబాయిఎట్లో తెలుగు వారికి నీ వట్లు ఆణిముత్యము వంటిదానివి దొరికినావు !

వెంక (నమస్కరించి)

సరస్వతీ! నినుస్మరించెదము
కనికరింపుమా కలభాషిణీ!
విరాట్ స్వరూపిణీ విపంచిధారిణీ
విరించి హృత్ సంచారిణీ!
కృపాకరీ నీ అపాంగ వీక్షణ మపారముగ ప్రకటింపు మా
అపాయకరమగు అవిద్యబాపగ
నుపాయమిలజూ పింపుమా ! సరస్వతీ నిను...
ధరాస్థలిని భక్తహృదయ వాసిని -
దయా ప్రసారిణి మేమిటుల్
కరాంజలులు నీకజస్రమిత్తుము
వరంబులీయగ రమ్మిటుల్ - సరస్వతీనిను ..

సరస్వతి (చిరునవ్వుతో) చూశావా కలభాషిణి! వెంగమాంబ ఎంత తెలివైనదో. నిన్ను మంచి చేసుకోవటం ఎంత అవసరమో ఆవిడకి బాగా తెలుసు

కలభా ఏమిటమ్మా! ఇవాళ నీ పరిహాసమునకు నేను పాత్రురాలినైనాను. (చిరునవ్వు, సిగ్గూ కలగలిపి అంటుంది కలభాషిణి)

సర నా అభిప్రాయం గ్రహించావు గదా - ఆఁ! మిగిలిన కవయిత్రులను కూడా పిలువు మరి

కల . ఆదిగో రానే వస్తోంది జననీ! మధురవాణి తంజపురి నాయక రాజమణి దిగంత విశ్రాంతకీర్తి సంగీత సాహిత్య సమరాంగణ

చక్రవర్తి, శారదా ధ్వజనిర్వాహకుడూ అయిన రఘునాథ రాయల కొలువులో అలరిన లలనామణి, గీర్వాణవాణీ ధురంధర సంప్రదాయంలోకి రఘునాథుని రామాయణాన్ని అనువదించి కనకాభిషేక గౌరవాన్ని పొందిన మహిళాశిరోమణి.

మధుర : సింహాసనము చారుసిత పుండరీకంబు
చెలికత్తె చెలువారు పలుకు చిలుక
శృంగార కుసుమంబు చిన్నిచుక్కలరాజు
పసిడి కిన్నెరవీణ పలుకుతోడు
వేదాదివిద్యలు విహరణ స్థలములు
చక్కని రాయంచ యెక్కిరింత
నలువనెమ్మోముఁదమ్మలు కేళిగృహములు
తలుకుటద్దంబు సత్కవుల మనసు
ఎవుడు ఏ దేవికాదేవి ఇందు కుంద
చంద్ర చందన మందార సారవర్ణ
శారదాదేవి మా యెద జాలు గాక !

కల : దేవి అన్నట్లుగా అందరూ నన్ను పట్టించారేమిటిట్లా పలుకు చిలుక.... అంటూ.

మ ఇష్టసఖివి - నీ మాట మరువవచ్చు వా కలభాషిణీ। (అంటూ కూర్చుంటుంది.).

కల (చిరునవ్వుతో)
రఘునాథనాయక ఆస్థానభూషణమా !
రామభద్రాంబా! సాహిత్య సామ్రాజ్య భద్ర పీఠారూఢా! రఘునాథాభ్యుదయాదులు రచించిన ప్రజ్ఞారూపమా! రావమ్మా హంస వాహన పేరోల గానికి- నువ్వూ మధురవాణీ తంజావూరి నగరింటి లక్ష్మీసరస్వతులుకదా.

రామభద్ర : (చేతులు మోడ్చి)

దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటికమణిని భైరక్షమాలాందధానా
హస్తైనై కేన పద్మం సితమ పిచశుకం పుస్తకంచాపరేణ
భాసా కుందేందుశంఖ స్ఫటికమణిని భాభానమానా సమానా
సామేవాగ్దేవతే యం నివసతువదనే సర్వదా సుప్రసన్నా

కలభా శుకమా - సరిసరి

(రామభద్రాంబ నవ్వుతూ వెళ్ళి కూర్చుంటుంది.)

క తంజావూరు నాయకరాజుల కాలం విద్వన్మండలికి
చిత్ర కావ్యాలకీ పదకవిత్వానికీ ప్రతిపద్య వార్తాచను
శృతికీ లలితకళలకీ నిత్యాన్నదాన నిరతకీ వెలవు.
తంజపురి నర్తకీమణులు అప్సరసలను బోలెనర్తింప
నేర్తురు ముద్దు చంద్రరేఖా ! ఇటువచ్చి దేవిని సేవించు
కోవమ్మా

అట్లాగే ప్రతాపరుద్ర మహారాజ ఆస్థాన నర్తకినైన మాచల్దేవి
రెడ్డిరాజుల గృహ రాజసౌధ విభూషణమవయిన లకుమాదేవి
మీరు కూడా వచ్చి వాణిని సేవించుకొందురుగాక

లకుమ, మాచల, చంద్రరేఖ : జయజయహే భగవతి సురభారతి

తవచరణౌ ప్రణమామః
నాదబ్రహ్మమయి జయవాగీశ్వరి
శరణంతేగచ్ఛామః
త్వమసి శరణ్య, త్రిభువన ధన్య
సురముని వందిత చరణా,

నవసరస మధురా కవితా ముఖరా
స్మితరుచిరుచిరా భరణా ॥ జయజయహే ॥
అసీనాళిత మానస హంసే
కుందతుహిన శశి ధవళే
హరజడతాంకురు, బుద్ధి వికాసం
సిత పంకజ తను విమలే ॥ జయజయహే ॥

(నృత్యం అయ్యాక ....)

కల తల్లీ! వాగధీశ్వరీ! తంజపురిలో వెలసిన మరొక రత్నం నిన్ను సేవించుకోవటానికి అరుదెంచింది. ఆమె ఇరువదారు ఛందములలో నేర్పరియని పేరెన్నికగన్న కృష్ణాంబ

కృష్ణాజమ్మ సకలలోక సంసేవ్యమాన దివ్యచరణా! సకల కళాప్రపూర్ణ చంద్రవదనా! పునఃపునః నమోన్నమః

(కృష్ణాజమ్మ కూర్చుంటుంది.)

కలభా మీదు మిక్కిలి తంజపురి మహిళల వైదుష్యము కావ్య నిర్మాణచాతుర్యమును గిరాం దేవివైన నీకు అలంకారములు సరస్వతీ మాతా! రంగాజమ్మను పిలుస్తున్నాను

దక్షిణాంధ్ర నాయకరాజ మఘవుడు విజయరాఘవుడు మన్నించు అంగనామణీ! ఉషాపరిణయాద్యనేక ప్రబంధములను రచించిన ప్రౌఢ పరిజ్ఞానసరణీ ! కనకాభిషేకమును పొందిన తరుణీ! రంగదృఙ్ఖ కదంబా! రంగాజమ్మా! సలువరాజని సేవించుకొందువుగాని రావమ్మా!

రంగా ముద్దులొల్కెడి తెల్లుసద్దియమ్ములు
గోరుముద్దలు గాగ బువ్వఁబెట్టి

పదముమోపుట నేర్చునదనులో పదునైన
    పద కవిత్వపుటూత పట్టానంగి
తరుణీత్వముదయించు తరుణాన
    అష్టభాషలు కంఠపాఠమ్ము సేయనేర్చి
కృతి శిశూదయవేళ ధృతకనకాభి
    షేకము పేరి పురిటి స్నానములుపోసి
విజయరాఘవు మత్రాణ విభుని
విభవ మంటపంబైన ఇందిరా మందిరమున
నధివసించెడు ననమభాగ్యమునొసంగి
అదరించిన వాగ్దేవతా! నమోస్తు.

(రంగాజీ కూర్చుంటుంది)

కల — భాషాగె తప్పువరాయరగండడు, కర్ణాటాంధ్ర క్షమానాధుడు సాహితీ సమరాంగణ సార్వభౌముడు సంగీత సాహిత్య శిల్ప చిత్రలేఖనాది కళాపోషకుడు, భువనవిజయ భద్రపీఠికావి రాజమానుడు అయిన శ్రీకృష్ణదేవరాయల కుమార్తె, రామరాయల ఇల్లాలు మోహనాంగి యను నామాంతరమున పిలువబడు తిరుమలాంబ దేవి! ఈమె మరిచీ పరిణయమును, వరదాంబికా పరిణయమును రచించినది

మోహనాంగి — సరస్వతీ నమస్తుభ్యమ్ వరదే కామ రూపిణి
పద్మపత్ర విశాలాక్షీమ్ పద్మ కేసర వర్ణినీమ్
నిత్యమ్ పద్మాలయాందేవి సామాంపాతు సరస్వతీ

(కూర్చుంటుంది.)

కల  శారదాంబా ! ఈమె ముద్దుపళని - నాయకరాజుల అనంతరము తంజావూరును పాలించిన ప్రతాపసింహుడు గారవించు ముద్దు పలుకులచిలుకల కొలికి, కావ్యములను అంకితము పుచ్చుకొనిన అదృష్టవతి, తను రచించిన రాధికాసాంత్వనమధుర కావ్యరససుధాధారలు చూరలిచ్చినది.

ముద్దుపళని -

సర్వజ్ఞతామ్ సదసి వాక్పటుతామ్ ప్రసూతే
దేవి త్వదంఘ్రి సరసీ రుహయోః ప్రణామః
కించ స్ఫురన్మకుట ముజ్జ్వల మాతపత్రమ్
ద్వేచామరేచ మహతీమ్ వసుధాందదాతి

కలభా  తిరుప్పావై రచించి ద్రవిడ దేశాన్ని మిక్కిలి ప్రభావితంచేసిన మహోత్తమ కన్యారత్నమూ, విశిష్ట, వైష్ణవ మధుర భక్తురాలూ అముక్తమాల్యద, చూడి కుడుత్త నాచ్చియార్, అండాళ్ అని పేరెన్నికగన్న గోదాదేవి సరస్వతీ ! నీ పదమ్మును పావనము చేయుచున్నదమ్మా (గోదాదేవి నమస్కరించి కూర్చుంటుంది).

కల  . కర్నాటక దేశాన అక్కమహాదేవి పేరు జగత్ప్రసిద్ధంగదా పలుకుల తల్లీ! పరమోత్తమ వీరశైవ దీక్షా పరతంత్ర వచన రచయిత్రి అక్కమహాదేవి వచ్చింది వరదాయినీ ! (అక్కదేవి అంజలిచ్చి కూర్చుంటుంది )

కలభా  . ఈమె పేరు విన్నంతనే భారత ప్రజలు మైమరచిపోదురమ్మా హంసవాహనా ! ధన్యజివి శ్రీకృష్ణ భక్త శిఖామణి తపస్విని మీరాబాయి నీ సదమ్మునలంకరించుచున్నది తల్లీ !

మీరాబాయి  (ప్రవేశించి చేతులు మొగిడ్చి తర్వాత కూర్చుంటుంది).

కలభా	ఆ వచ్చుచున్నవారిని గుర్తించివావా. జననీ ! ఆమె సరోజని, ఓ వంగ దేశపు కన్యాలలామమా! తెలుగింటి కోడలమ్మా! భారతదేశపు కవి కోకిలమ్మా, స్వతంత్ర సంగ్రామ శంఖారావమా! రావమ్మా సరోజనీనాయుడూ వాగీశ్వరీసేవకు.

సరోజని	గాడెస్ సరస్వతీ ! హరమేజెస్టీ. గ్రాంట్ అస్ ఆల్ ప్రెజన్స్ ఆఫ్ మైండ్ అండ్ ఫిల్ ఇట్ విత్ థాట్స్ ఆఫ్ యూనివర్సల్ బ్రదర్ హుడ్-

కల	భువనేశ్వరీ! జ్ఞానపీఠ గ్రహీత ఉత్తరప్రదేశ సంజనన విభాసిత మహాదేవివర్మ నిన్ను సేవించ వచ్చింది

మహాదేవివర్మ .	జ్ఞానదాత్రీ, గీర్వాణీ ప్రణామములు.

కల	ప్రఖ్యాత కన్నడ నవలా రచయిత్రి త్రివేణి నీ సభకి వచ్చింది మాతా! సరస్వతీ.

త్రివేణి	నవనవకథా వైలక్షణ్య చమత్కృతీ సరస్వతీ! నమస్సుమాంజలి.

కల	భారత మధ్యప్రదేశ వైడూర్య మణీసుభద్రాకుమారి చౌహాను ! రా తల్లీ వాణిసేవకి.

సుభద్రా	సౌభాగ్యదాయినీ ! నమో నమస్తే భగవతీ !

కల	కళా స్వరూపం సద్గుణరత్నం బెంగుళూరు నాగరత్నం నీ సదస్సుకి చనుదెంచింది భారతీదేవీ !

నాగరత్నం .	నన్నుగన్న తల్లీ! నా భాగ్యమా ! ధర్మాంబికా ప్రణతులు.

కల	మహారాష్ట్రమునకు చెందిన ప్రాచీన సంస్కృతీ సంవర్ధిత చరిత్ర ఇరావతి కార్వే శారదాదేవీ నీ సన్నిధికి చనుదెంచింది.

ఐరావతి — వాగ్దేవి ! నీకు పున. పున వందనములు. త్వదీయ సభా విరాజమానలై యావద్భారతమునకు విశేషించి స్త్రీ జాతికి గర్వకారణమైన రచనా విశారదలకు రమణీమణులకు అభివందనములు.

కల — కాశ్మీర కవయిత్రి లల్లాదేవి నీ పరిచర్యకై ఏతెంచింది దేవీ!

వరదాయినీ ! కాశ్మీర పురవాసినీ ! జ్ఞాన సరస్వతీ ప్రణతి - ప్రణతి

కల — గీర్వాణీ! సుందర కేరళ కవయిత్రి మనోరమా తంబురాట్టి అనురక్తితో నీ సేవకి ఏతెంచింది

మనోరమ — విరించి పత్నీ కమలాసనస్థితా ! సరస్వతీ ! నృత్యతువాచిమేసదా

కల — పురంధ్రీ మణులారా ! సదస్సును ఏ భాషతో ప్రారంభిస్తారు ప్రౌఢ సంస్కృతముతోనా ? కన్నడ కస్తూరితోనా ? తియ్యని తెనుగుతోనా? లేక. . . ..

సరోజిని — ఆంగ్లముననో, వంగముననో .

కల — పూర్తిచేయు వరకునూ తొందరేగదా మా సరోజినికి నీ మాటలు కాదంటినా ? సర్వభారత సమైక్యమును సాధించు సరస్వతీదేవి అపురూప అలంకారములు మీరందరూ, నీవు వంగ దేశమునుండి వచ్చి ఆంధ్రుణ్ణి పెట్టబట్టి ఆంగ్లభాషా రచయిత్రివైతివి అక్క దేవి కన్నడ దేశాన జన్మించి ఆంధ్రదేశాన శ్రీగిరి శిఖరాన నెలకొన్న చెన్న మల్లికార్జునుని సేవించి కడకు ఆ స్వామిలో లీనమైపోయినది.మీరాబాయి సౌరాష్ట్ర రాజస్థానములను తన జన్మముచే తనియించినది. మధురవాణి, రామభద్రాంబలు తెలుగింటపుట్టి సంస్కృతమున కవిత్వవ్యాసంగము నెరపిరి. గంగాదేవి తెలుగింటపుట్టి కర్ణాటక ర జ్యమును మెట్టి

విశాలభారతమునకు గర్వ కారణమైన గీర్వాణ భాషలో కవిత్వమును చెప్పినది ఉత్తమ సంస్కారముగల కవయిత్రుల ధ్యేయము విశ్వమానవ కల్యాణమే గాని ప్రాంత భేదమును పెంచుట కాదు గదా -

రంగా · నువ్వు చెప్పింది చాలా బాగుంది కానీ ఈమధ్య భూలోకం నుంచి వచ్చిన విశ్వనాథ సత్యనారాయణటమ్మా - ఆయన తెలుగు భాషని గురించి ఒక పద్యం చదివి సమకాలికుడైన శ్రీశ్రీకి వినిపిస్తుంటే నేనూ వినటం తటస్థించింది

కల ఔను ఎంత చక్కగా రాస్తాడమ్మా ఆయన - కానీ మధురవాణి ఏదో చెప్పబోతున్నట్లుంది - చెప్పవమ్మా!

మధు ఏది ఏమైనా జనని సంస్కృతంబు సకల భాషలకును అనగా వినలేదా అమ్మలారా!

రంగా నిజమే కాని మెచ్చుటాడుబిడ్డ అయిన తెలుగు మేలుగదా

మోహన దేశభాషలందు తెలుగులెస్స అనికూడా అందువా ఏమి? పుట్టి మునిగిపోతుంది సుమా

ముద్దుని ఓహో తుంగభద్రలో పుట్టి యా మోహనాంగి -

సరస్వతి మోహనాంగి మాటను మన్నించి ఈ సభను ఇప్పటికి తెలుగు కవిత్వముతో ప్రారంభించుచున్నాను మొల్లా!

కల అమ్మయ్య దేవియే తేల్చినది మొల్లమ్మాంబా! నీ మధుర కవిత్వమును విన్పించు -

గంగ అదేమమ్మా కలభాషిణీ! కవిత్వము మధురముగాక ఎట్లా వుంటుంది ప్రత్యేకించి మొల్ల వైశిష్ట్యమేమిటి?

కలభా : నిజమే గంగాదేవీ! మధురా విజయ కవయిత్రివి - సంస్కృత కవయిత్రివై తెలుగు తేనెల మాధుర్యమును గూర్చి ప్రశ్నించటంలో ఆశ్చర్యం లేదు.

గంగా : ఏమి వ్యంగ్యమమ్మా!

కలభా అమ్మవారి అత్తయే అదికదమ్మా - కాదుకాదు అమ్మవారి అలంకారముల అత్త -

ముద్దు ఆ కులుకులకర్థము చెప్పనా?

రామ కులుకులా? పలుకులా?

ముద్దు ఏదైనా ఒక్కటే చిలుకకే - అయిన నింతకీ కలభాషిణి పల్కుల గోల మీ కర్థముకాలేదా? కావ్యస్యాత్మా రసధ్వనిః కదా -

కల ఏమది? గోలా? ఛిరా! ఛిఠారా! ఎంత నెరజాణవు వశనీ! నన్నింతమాట యని భాషాయోష సభలో పరిభవిల్ల గలవనేనా!

సుభద్ర ఇంతకూ మొల్ల తేనెపద్యము ..

మొల్ల చెప్పన్నా వినవమ్మా సుభద్రాకుమారీ!

తేనెసొక నోరుకియన యగురీతి
తోడ నర్థమెల్ల దోచకుండ
గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము
మూగ చెవిటివారి ముచ్చటగును

మహ చక్కగా చెప్పావు కవిత్వ లక్షణాన్ని మొల్లా! కఠినమైన భాషలో కవిత్వం రాస్తే అయోమయంగా వుంటుంది. తేలిక మాటలతో చెప్పాలంటున్నావు.

మొళ్ల : అవును మహాదేవివర్యా!

కందువ మాటల సామెతలందముగా
గూర్చి చెప్పనవి తెలుగునకుం
బొందైె రుచియై వీనులవిందై మరి
కానిపించు విబుధుల కెల్లన్

సుభ · ఎట్లా చెప్తే తెలుగుభాష అందంగా వుంటుందో తెలియజెప్పావు మొల్లా! ఒకరకంగా ఏ భాషకైనా ఓజోగుణంకంటే లలితపదజాలమే మేలు అనిపిస్తుంది.

మధు : నిజమే కానీ మాకాలంలో కవిత్వ లక్షణం మారిపోయింది చెప్పగవలె విరిపొట్లము విప్పినగతి... అనే వాళ్ళు.

కలభా ఔను

లల్లాదేవి నువ్వు చెప్పిన కవిత్వ లక్షణం సార్థకంగా ఒక పద్యం చెప్తావా? మొల్లా ! దత్తపది ఇస్తాను -పూర్తి చెయ్యాలి.

మొల్ల తప్పక ప్రయత్నిస్తాను -ఏమిటో ఆ దత్తపది?

మనో బావుంది -మొల్లకి లల్ల దత్తపది ఇవ్వటం ఊ -కానీ లల్లా.

లల్ల గుమ్ము, బున్ను, రింగు, బొణుగు అనే వీనులవిందైన తేట మాటలు ప్రతి పాదంలో రావాలి గజేంద్రుణ్ణి కాపాడటానికి వస్తున్న మహావిష్ణువు స్వరూపం మాకు కనిపించినట్లుండాలి ఆయన అభయవాక్కులూ వినిపించాలి సుమా

మొల్ల సరస్వతీదేవి అనుగ్రహం వుంటే ఏదైనా సాధ్యమవుతుంది అల్లాంటప్పుడు ఈ దత్తపది సాధ్యంకాదా?

అని లాళిహాతి దక్షిణావర్త శంఖంబు
        గుంఫింతంబై కేలగుమ్ము రనగ
గొడగై తరచుగా బడగల్కొడ దట్టి
        భుజగాధిపతి మీద బుస్సురనగ
చరచి నిబ్బరముగా బరతెంచు ఖగరాజు
        రెక్కగాడ్పులు మింట రింగురనగ
దొంతి బ్రహ్మాండపంక్తులు బొజ్జలోనుండి
        బెణకి యొక్కొక్కమాటు బొణుగురనగ
కూకకనుచూపు మేరకు కోకవినరి
వెరవకు వెరవకు వెరవకు వెరవకనుచు
నుర్దవడి వచ్చి గజరాజు నొద్దవ్రాలె
నార్త రక్షణచణుడు నారాయణుండు -

సరో ఆహా! ఎంతబావుంది మొల్ల పూర్తిచేసిన దత్తపది - ఎన్ని చెప్పండి ఆడవాళ్ళ కవితలు ఆర్ద్రతకి పుట్టిళ్ళు

అంతా నిజమే - నిజమే - పురుషులు ప్రౌఢ గంభీరంగా రాస్తారు - మనం మృదు మధురంగా వ్రాస్తాం. సహజమైన చిత్తవృత్తి ఎక్కడ దాస్తాం?

మహా లల్లాదేవీ! నీ వాక్కులు కొన్ని చెప్పవా?

లల్ల శివుడికీ కేశవుడికీ బుద్ధుడికీ భేదంలేదని నా ఉద్దేశం మనిషికున్న సమస్యలు చాలకనా మతాల పేరిట కొట్టుకోవడం లల్లవాక్కులు విని బాగుపడితే బావుండు మానవుడు

సుభ బావుంది లల్లా! మతభేదాలతో కొట్టుమిట్టాడుతున్న జాతికి గొప్ప కనువిప్పు నీ మాట - ఏకేశ్వరోపాసన మన కర్తవ్యం గదా-

మహా : దేశభక్తిని గురించిన రచనలు చేసిన నువ్వు లల్ల మాటలకి ప్రతిస్పందించటం సహజంగా వుంది సుభద్రాకుమారీ!

సుభ : వేదనా మార్మికతలను నిగూఢంగా కవితలో అద్దిన మహాదేవి వర్మ ప్రశంసకి కృతజ్ఞురాలివి.

సరస్వతి : వేంకటేంద్రుని పుత్రి! వినుత సద్గుణధాత్రి
ఘన యశోరాజి ! రంగాజి ! వినుము
మాధుర్యమున మించుమన్నారు దాస
విలాస ప్రబంధంబు లలితఫణితి
గావించి మిగుల శృంగారంబు గన్పట్ట
పదములు మృదు రసాస్పదములగుచు
రాణింప రచియించి రామాయణంబును
భాగవతంబును భారతంబు
సంగ్రహంబున రచియించి సరసరీతి
మమ్ము మెప్పించితివి చాల నెమ్మిదనర
పరగ హరివంశమున నుషా పరిణయకథ
తెనుగుగావింపుమిక నీవు తేటగాగ
అని విజయరాఘవునిచే నడిగించుకున్నావు గద - నీ పాండిత్య ప్రకర్ష కొంత వినిపించు-

రంగాజీ మహాభాగ్యం జననీ !
వెలిదమ్ముల్ నెలరేలు మల్లెవిరులన్ చెంపారు ముత్యాలపే
రులు క్రొమ్మించులు మంచుపొంగులును నీ రూపంబుగా నెంచి క
న్నులలో వత్తిదుకొంచు నిన్ను గనుగొందున్ నీ పదాబ్జ తరే
ఖలు మత్పాలతమ్ముసోకి యెరుపెక్కన్ జక్క దీవింపవే

సరస్వతి : తథాస్తు.

కల అమ్మవారి పద్యము వలన కొన్ని తెలిసినవి. నీ రచనలేమేమి ని విశేషము లేమి? వివరముగా విననుత్సహించుచున్నాము.రంగాజీ!

మొల్ల . నీ ఆశ్వాసాంత గద్య చదివిన అర్థమగుననుకొందును.

రంగా అట్లే - శ్రీ రాజగోపాల కరుణాకటాక్ష వీక్షణానుక్షణ ప్రవర్ధమాన సార సారస్వతధురీణయు, విచిత్ర తరపత్రికా శతలిఖిత వాచికార్థావగాహన ప్రవీణయు, తత్ ప్రతి పత్రికా శతస్వహస్త లేఖన ప్రశస్త కీర్తియు, శృంగారస తరంగిత పదకవిత్వ మహనీయ మతిస్ఫూర్తియు, నతు లితాష్ట భాషా కవితా సర్వంకష మనీషా విశేష శారదయు, రాజనీతి విద్యా విశారదయు, విజయరాఘవ మహీపాల విరచిత కనకాభిషేకయు, విద్వత్కవి జనస్తవనీయయు మన్నారు దాసవిలాస ఉషాపరిణయ మహా ప్రబంధ నిబంధన కృతలక్షణయు, మహనీయ రామాయణ, భాగవత, భారత కథా సంగ్రహణ విచక్షణయు పసుపులేటి వేంకటాద్రి బహుజన్మ తపఃఫలంబును మంగమాంబా గర్భశుక్తి ముక్తా ఫలంబును రంగధ్వజ కదంబయునగు ఈ రంగాజమ్మ తన విషయములన్నియు విశదము చేసినట్లే గదా ?

వేంకమాంబ చక్కగా విశదము చేసితివి గాని రంగాజమ్మా? విజయరాఘవుని తలంచినంతనే నీ కనుల నా చెమ్మ ఏలనమ్మా?

రంగా ఆయన సామాన్యుడా మరి - అసామాన్యుడు- మాన్యులకు మాన్యుడు శారదా ధ్వజనిర్వాహకుడు షోడశ కళాపరిపూర్ణుడైన నిండు చంద్రుని వంటి వాడు. ఆయనకు వైష్ణవ మతముమీది భక్తి పెరిగి చివరకు నాయక సామ్రాజ్య పతనమునకు కారణమైనాడని గాని పరమత సహనమే యుండి యుండెనా?

। శారదా విజయం ।

విజయరాఘవునకేమమ్మా మధునా పంతుల సత్యనారాయణ శాస్త్రి గారలు ఇట్లా మెచ్చుకున్నారు

వాగ్గేయ సుకవితా స్వర్ణంబు బంధించు

క్షేత్రయ్య గాన మాక్తికము గ్రోలి

చిరుదైన గండ పెండెరముతో శారదా

ధ్వజముతో రామ సౌధమున మెరసి

యక్షగాన ప్రబంధాదుల రచనతో

సహృదయ హృదయ రంజనమొనర్చి

కనకాభిషేకమ్ము గొనిన రంగాజమ్మ

శృంగార కవిత నాశీర్వదించి

రాజగోపాల చరణ సరోజ రజము

నిలువున నలందుకొని భక్తి కలితమైన

రక్తిమై నిందిరా మందిరమ్మునేలె

రాఘవుండు కళావతీ రమణిసుతుడు

పళని ఔను ఆయన అట్టివాడే - కానీ పరమత సహనము నంద నాసక్తి వహించుట ఎంత నష్టదాయకమో చరిత్ర తెలియజెప్పు చున్నను ప్రజలు మత సహిష్ణత నేర్చుకొనుచుండిరా యనిపించు చుండును విశ్వ సృష్టి విధాత యైన భగవంతుని ఏ పేరున పిలిచిన నేమి ఏ రూపమున ధ్యానించిన నేమి వారి ఇష్టము వారికే పరిమితము కావలయును ఎదుటి వారిమీద రుద్దరాదు. నిరాకారత కూడ భగవంతుని యాకారమే గదా !

మీరాబాయి : నీ అభిప్రాయముతో నిర్ద్వంద్వముగా నందరము నేకీభవింతుము

ముద్దు : రణ భయముతో మారణకాండతో ప్రపంచము అల్లాడవలదు సుఖ శాంతులతో, సత్ప్రవర్తనతో కళకళలాడవలెను. ఔను రంగాజమ్మా ! క్షేత్రయ్య పదములలో గిరిధర గోపాలుని లీలా విలాసము లుండునని విన్నాను. ఆ నర్తనమొకసారి చూడగల్గితినా నేను ధన్యను

కల వాగ్దేవి కొలువున కొదువ ఏమి మీరాబాయి ?

నృత్యం మగువ తనకేళికా మందిరము వెడలెన్

నిదుర మబ్బుల తేలు వెడద కన్నులలోను

విడజారు గొజ్జంగి విరిదండ జడతోను

మగువ తన కేళికా మందిరము వెడలెన్

కడుచిక్కు పడిపెనగుకంట సరితోను

వగకాడ మా కంచి వరద తెలవారెననుచు

మగువ తన కేళికా మందిరము వెడలెన్

మోహ ఆహా !

మోహ (అందరూ పారశ్యమును భజింతురు )

కల అక్క మహాదేవీ ! మహత్తర శివభక్తురాలివి. నీ దీక్ష అనితరసాధ్యము నిన్ను కన్న కర్ణాటకము ధన్యమైనది ఏదీ పలుకుల తల్లికి నీ వచనములొండు రెండు విన్పింపుము

అక్కమహాదేవి : తల్లీ! నీ పాదములకివే నా వందనములు.

యోగానందకరీ ! రిపుక్షయకరీ ! నర్వైకనిష్ఠ కరీ

వీణా వాదన కేళిలోలా ! నా వచనములను వన్నింతును:

అవధారుజననీ ! కర్ణాంత వ్యాప్తనయనాం స్ఫురదిందీ వరప్రభామ్!

అయ్యా ! సదాచార సద్భక్తి, సత్క్రియ, సమ్యక్‌జ్ఞాన, సద్వర్తన, సగుణ నిర్గుణ, నిజగుణ సచ్చరిత, సద్భావ అక్రోధసత్యవ చనక్షమెదయె, భవిభక్త బోధ, సత్ పాత్ర ద్రవ్యార్పణ,గౌరవ బుద్ధిలింగలీయ జగమూను భావ, దశవిధ పాదోదక ఏకాదశ ప్రసాద షోడశభక్తినిర్వాహ ! త్రివిధ షడ్విధ నవవిధ లింగార్చనె త్రివిధ షడ్విధ నవవిధ జప, త్రివిధ షడ్విధ నవవిధ లింగార్పిత చిద్విభూతి స్నాన ధూళనెధారణ సర్వాంగ దల్లి చిద్రుద్రాక్షిధారణ తామాదువ సత్యకాయకె తాబేడువ సద్భక్తిభిక్షతా కొట్టు కొంబువ భేదతాసాచరి సువసత్యనడినుడితానింద నిర్వాణపద ఇంతి మూవత్తెరడు కలిగళసద్గురు ముఖదిందరిదె బసవ మొదలాద సమస్తప్రథమం గణంగళిల్లనిరాభారి వీరేశ్వర సన్మార్గవిడితా చరిసిదరు నోడా ఇంతు ప్రథమ గణంగళా చరిసిద సత్యాసత్య సన్మార్గవన రియదె మూఢ అధమరనెంతు శివశక్తి శివభక్తి శివజంగమ వెంబనయ్య చెన్న మల్లికార్జునా !

మీరా : తీవ్రాతి తీవ్రమైన నీమహాశివభక్తి మిగుల శ్లాఘనీయము అక్కమహాదేవీ,

రంగా : చెన్న మల్లికార్జున పద పద్మ బంభరాయమాణా! సర్వాంగదల్లి చిద్రు ద్రాక్షధారణా ! సత్యవచన నిరూపణా !

అక్కమహాదేవీ ! సదా కృతార్థురాలివి సుమా !

పళని ఆదినీవు వేరుగఁజెప్పనక్కరలేదు గదా రంగాజమ్మా. మహా వినయ మూర్తి, దివ్యభక్తిగల అక్కమహాదేవి అమ్మవారి ఓలగమున రివిగ నధి వసించ గల్గినదాయె

సరస్వతి . (మందహాస మొనర్చును )

అక్కదేవీ చక్కని వచనములను జెప్పితివి

అక్కదేవి అంతయు నీ అపార కరుణగాదా జననీ !

మోహ రంగాజమ్మా ! రాసిక్య చూడామణి లలిత కళల ప్రోవు నాయక రాజేంద్రుడు, విజయ భూపాల చంద్రుని కొలువున వెలసిన ఇంద్ర నీలమణివి నువ్వు

పళని ఔను మోహనాంగి! రంగాజీ వైదుష్యము లోకవిధితమే కానీ విజయరాఘవుని పట్టమహిషి రాజగోపాలాంబిక కాబోలు తన భర్తను తనవద్దకు పంపుమని ప్రార్థే యపడుచు నుత్తర మంపగా - అదేమట్లు సమాధానము పంపినది ?

సరోజని ఏమమ్మో ! ముద్దువళనీ ! భారతీ రమణిహారమున చెన్నొందు మరకతమణీ ! రంగాజమ్మపై విమర్శ బాణమును సంధించినావు?

పళని ఓహో ! రంగాజమ్మ ఇంద్రనీలమణియును నేను మరకత మణిని అన్నమాట

వెంక సరోజనిగారు బాణము అనుచున్నారు. అట్టివి రాజకీయ దౌరంధర్యమును నెరపు తమబోటి అధికారిణులకు తగునుగాని పళని వంటి విదుషీమణులకు తెలియునాయని ?

సరస్వతి అహో - భక్త వెంకమాంబ సైతము చమత్కరింప గలదన్నమాట

కల మరేమితల్లీ ! ఇదంతయు నీ లీలా విలాసమేగదా! అయినా ముద్దుపళనికి ఎన్ని బాణములు తెలియునో వెంకమాంబ ఎరుగనట్లున్నది దొరాదొరలచే బరాబరుల వెలయించుకొనును పళని -

మోహ ఇంతకును ఆ ప్రత్యుత్తరమేదో రంగాజమ్మను చెప్పనిందు -

రంగా ఒక విధముగా చూచినచో అర్థము వేరుగ తోచినను ప్రతి గృహిణి కంత చాకచక్యముండవలెననియే నా అభిప్రాయము అయినను అప్పుడా యుమ్మన్ను పీదనట్లు చెప్పితినిగాని తరువాత విచారించుకొనగా నాకును కష్టముగనే తోచినది. తరువాత విజయరాఘవుని తన మహారాణి కడకు పంపితిని గదా -

తిమ్మక్క గృహిణికుండ దగినచాకచక్యమా ? ఏమది రంగాజమ్మా !

రంగా ఇది

ఏ వనితల్ మముం దలప నేమిపనో ! తమరాడువారుగా

రో వలపించు నేర్పెరుగరో ? తమ కౌగిటిలోన నుండగా

రావది ఏమిరా ! విజయరామ ! యటంచిలు దూరిబల్కమై

తీవరకత్తెనై పెనగితీసుక వచ్చితినా తలోదరీ ?

(సభ్యులలో ఒకరిద్దరు ఆశ్చర్యార్థకముగా ముక్కుపై వేలుంచుకొందురు కొందరు ముసిముసి నవ్వులు - కొందరు చిరుకోపములు ప్రదర్శింతురు).

సరస్వతి బాగు - బాగు రంగాజీ - నిక్కచ్చిగా జెప్పితివే.

గోదా సరస్వతీదేవి క్షమించినచో నొకమాట యందునా ?

సరస్వతి . ఏమది గోదాదేవి ? నావద్దనా నీ సంశయము ?

గోదా సరి ఈ పద్యమును వినినప్పటి నుండియు తమ వదనము కొంత అందోళనమునకు గురియగుట గమనించినాను - చతురాస్యులైన బ్రహ్మదేవులవారు ఏమి చేయుచున్నారో కలభాషిణిని చూచిరమ్మని పెలవా?

సభలో అమాయకపు అండాళ్ అనుకొంటిమిగాని - అమ్మవారినే చమత్కారము చేయు స్థితికెదిగి అందరినీ మించినదే (సభలో గుసగుసలు - సన్నని కిలకిలలు సిగ్గులు).

సరస్వతి (చిరుసిగ్గుతో) అటులనే వంపింతము పనిలోపని రసజ్ఞ రాణ్మణియైన శ్రీరంగదేవుని విష్ణుమూర్తిని కూడ చూచి రమ్మనెదము.

అండాళ్ (సిగ్గుపడి తల ప్రక్కకు తిప్పును).

మొల్ల సర్వ వాఙ్మయాధ్యక్ష సంపూర్ణ స్వరూపిణీ! సకల చమత్కార సంశోభిని ! సరస్వతీమాతా ! నీకెవరు సమాధానము చెప్పగలరు? నీ దయచేత వర్ధిల్లి నాలుగు అక్షరము ముక్కలు నేర్చికొనిన వారము నీ బిడ్డలము మమ్ము పాలించుకొనుము జననీ.

సరస్వతి నీవింత చెప్పలెనా మొల్లా !

కలభా . ఇంతకును ముద్దుపళని అధిక్షేపమేమిటో

పళని 'స్పర్ధయావర్ధతే' అని కదటమ్మా ఆర్యోక్తి ! మనముకూడిన ఈ సభలో ఈమాత్రవు అధిక్షేపములు లేకపోయిననేమి యందముండును.....? పైగా ఈ బంగారు తల్లి - చదువుల సరస్వతి అనుగ్రహ పాత్రులము. ఆ దేవికొకింత వినోదమును సైతము కల్పింపవలెనని యట్లంటినిగాని.... ఎవరును అన్యధా

భావింపవలదని నా మనవి ఆటలో అరటిపండను మాట వింటివిగదా రంగాజమ్మా.

రంగాజీ ముద్దుపళనిని మనసార మెచ్చుకొనుచున్నాను. కవిత్వమునకు విమర్శ మిక్కిలి యవసరము. ఏదీ నా పద్యమును నిలదీయు నీ పద్యమును శారదామాతకు వినిపింపుము మరి.

పళని . అట్లే విన్పింతును కానీ ముందు నీ మన్నారుదాస విలాసము నుండి ఉషా పరిణయమునుండి చెరొక పద్యమైనను విన్పించుము.

రంగాజీ మన్నారు దాస విలాసము నుంచీ -

ధీరాజిల జనవీరా

వీరాయితకేళి నిన్ను వెలకు గొనేరా

నేరాలకేమి రారా

రారాపులు మాని విజయ రాఘవధీరా !

ముద్దుపళని రంగాజమ్మ భర్తను రారమ్మన్నట్లే వుంది ఇందాకటి పద్యంలో మాత్రం నేను రమ్మన్నానా - అంటోందిగాని,

రంగాజీ · (నవ్వుతూ) పళనికి బహుశ్రద్ధ కొన్ని సందర్భాలలో రాగొట్టుట బావుంటుంది]

పళని . అదేగా నేను అంటోందినూ -

రంగా . ఉషాపరిణయంలో శివకేశవ శక్తుల యుద్ధఘట్టంలో.

పక్షి కులాధ్యక్షుడు సం

ధుక్షిత నిజపక్ష తీక్ష్ణతుండాగ్రములన్

రక్షో నివహంబుల ముఖ
వక్షంబుల నడచి వ్రచ్చి వందరలాడెన్.

అక్కదేవి తెలుగు భాషకి ఆదికవి అయిన నన్నయ్యగారి శైలి ఈ పద్యము నందుద్యోతకమగుచున్నది సుమా రంగాజమ్మా

గోదాదేవి అక్కమహాదేవి ! రంగాజమ్మ వైష్ణవ పక్షపాతి యని నీ మనస్సున కినుక వొడమలేదుగదా అట్లైనచో క్షమింప వేడెదను -

అక్కదేవి ఎంతమాట గోదాదేవీ ! లల్లాదేవి చెప్పలేదా ? శివకేశవులొక్కటేనని - ఏ మతమైననేమి ? మానవత్వము కావలయును గాని -

ముద్దుపళని మానవత్వమునకేమిగాని మా గురువుగారు రాకొట్టుటలో నేర్పరి యని తెలిసినదిగదా

కృష్ణాజమ్మ ముద్దుపళనీ ! నీకు రంగాజమ్మ గురువెప్పుడైనది ?

ముద్దుపళని ఏకలవ్య శిష్యత్వములే కృష్ణాజమ్మా ! ఆవిడకంటె పద్యము బిగువుగా రాయాలని ప్రయత్నించాను అంతే

రంగా పొన్లే పళనీ, పంగనామాలు పెడితే పెట్టావుగాని - శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్ అనిపించావు నీ పద్యముల అందము లోకమెరుగునుగదా -

పళని పంగనామములు నేను పెట్టుటయేమిటి ? శ్రీవైష్ణవ శిఖామణులము మధుర భక్తి పారీణులము మనకు ముందే కలవు కదా

మధురవాణి నీతో వేగుట కష్టమే పళనీ ! వేలికేస్తే కాలికి కాలికేస్తే వేలికి వేస్తావు

పళని క్షమస్వత్వం క్షమస్వత్వం మధురవాణీ ! ఏదో చిన్నతనం

రామభద్ర  చిన్నదానివని వినయం ప్రకటిస్తున్నావు గాని పళని ! నీ సామర్థ్య మెవరెరుగనిది ?

ఘటియింప నేర్తువు కవనజాతులెరింగి

వలుకుల కల్కి వెల్వెలన బార

నీయగానేరుతు విలగోరిన వరాలు

నగరాజసుకుమారి నగము గాగ

జెల్లింపనేర్తువు చెప్పిన రీతిగా

గని ద్రౌపదీ సతి కానకేగ

నటియింపనేర్తువు నవరసంబులనంటి

తగు రంభయ నిమిషత్వము వహింప

కృష్ణాజమ్మ  పళనీ ! తెలుగు సాహితీ లోకమున చిరస్మరణీయురాలివైనావు మా కబ్బములకంటె మధురభక్తి తీవ్రతను ఏరులై పారించిన నీ రాధికా సాంత్వనము అఖండ కీర్తినందినది

రంగాజమ్మ  గోదాదేవి తిరుప్పావను ముప్పైపాశురాల్ని విరచించినదిగదా వాటిలో పది పాశురాల్ని తెనిగించింది పళని

పళని  ఏదో నా శక్తిమేరకు ప్రయత్నించాను అసలు ఈ తెలుగు పాశురాలు నేను రాయనేలేదు ఎవరి పాశురాలో నేను అవహరించానని వాదు కూడా వున్నది

కల  అమ్మవారికి తెలుసులేవోయి అసలు నిజం ఒక పాశురం పాడు విందాం. మన నర్తకీమణులు అభినయం చేస్తారు.

(ముగ్గురు నర్తకీ మణులూ నృత్యం చేస్తారు.)

ముద్దుని . వాడెవచ్చి పిలువ లేచివత్తమనుచుఁబందుకొన్న
చేడె నిదుర లేపగాను చెలులు వచ్చిరి
మణి విచిత్ర శిరమందు మంగళార్థమైన దీప
కణికలుల్ల సిల్గఁబొగలు గమ్ముమనగనూ
కులుకు తళుకుశయ్య నిద్ర గూరినట్టి మేనమామ
కూర్మిబిడ్డ ! గడియ తలుపు గొలునుమలుపవే
అత్త ! పూల గుత్తి నీదుముత్తియంపు బిడ్డ మెల్ల
నొత్తిగించి నిదుర లేవనెత్తరాదటో
మూగ చెవుడు గలదో లేక రాగనీక మత్తుగదుర
సాగితూగ నెవరు మందుచల్లి నారలో
మాధవుండు మాయలాడు వేధకైన బోధలేని
గాధవాని వేయి విధాల గణన చేతుమూ
అమ్మ ! తోడి కొమ్మలిరుగొ రమ్మనంగ దమ్మముద్దు
గుమ్మనీదు తళుకు గులుకు బొమ్మనిప్పుడూ -

సరస్వతి చక్కగా అనువాదం చేశావు ముద్దుపళనీ ! లకుమా, మాచలా, చంద్రరేఖల అభినయం కూడా నీ పాటకి చక్కగా అమిరింది

గోదా నా తమిళ పాటకి నీ తెలుగు సేత ఎంతో నచ్చిందమ్మా పళనీ ! భావానికి తగిన భాషతో ఈ గేయం మనోహరంగా వుంది

పళని . సప్తపదులను పేర నీ పాటలని తెలుగుచేశాను గోదాదేవి!నాకు ఇంత బాగా రాయటం రాదుట నా గురువుగారు రచియించి కవిత్వాన్ని నా పేర పెట్టారుట.

లకుమ . అజ్ఞాన తిమిరాంధకారులు ఎన్ని అయినా అనుకుంటారు అట్లాంటి మాటలు పట్టించుకోకూడదు మా పళని ధైర్యశాలి

గోదా · ఏదీ పళనీ ! నా పాశురాల్ని తెలుగు చేయ బూనుతూ నువ్వు చెప్పిన మాటలు ?

పళని : నా తెనిగింపు ఎట్లా వుంటుందో ఏమో - గోధాదేవికి కినుక రాకపోయిన చాలు చెప్పానుగదా అపవాదు సంగతి -

గోదా ఎంతమాట - కవిత్వము అందరికీ తెలియాలంటే ఇతర భాషల్లోకి అనువదింపబడట మొక్కటే మార్గం

ముద్దు కృతజ్ఞురాలిని 'మార్గళిత్తింగళ్' అనే పాశురాన్ని తెనిగిస్తూ నేను చెప్పుకొన్నమాటలివి మా గురువుగారు శ్రీనివాస తాతాచార్యులను తలచి కవనమును ప్రారంభింతును

శ్రీనివాస గురుని తలచి చిత్తమునను ముద్దుపళని

పూని చేయు ద్రవిడ పాటలోని భావమై

చెలగి తెలియవాణి తనదు జిహ్వకొనను నిలిచి యిటుల

బలికె తిరుప్పావు సప్తపది పటంబుగా -

త్రివేణి పళనీ ! ప్రాచీన సాహిత్యముతో నంతగా పరిచయంలేని మాబోటి వారికి సైతము చక్కగా అర్థమవుతోందే నీ కవిత్వం - అరిటిపండు వలిచి చేతిలో పెట్టటం అన్నంత హాయిగా రాయగల్గడం ఆడవాళ్ళ సొత్తే అనుకుంటాను

బెంగుళూరు నాగరత్నం కర్ణాటక వచన కథారచనా ధురంధరా ! త్రివేణీ ! సామాజిక స్పృహతో నవనాగరిక యువజనానికి ధైర్యంచెప్పు దారిచూపించావు నీ కథలతో - ఆ కొత్తపేరేమిటదీ ఆఁనవలలతో గాబోలు, లలితమైన కథన పద్ధతితో కాలానుగుణంగా సమస్యా

పరిష్కారాలు చేస్తూ, సంసార జీవిత మాధుర్యాల్ని విరజిమ్ముతూ రచించావు చూడు

త్రివేణి సంఘర్షణ, వసంతగానం - శరపంజర వాటి మాటేకాదూ మీరు చెప్పేది నాగరత్నంగారూ! అయినా మీ అభిమానంకొద్దీ అంటున్నారు గానీ నా ప్రతిభ ఎంత ? నేనెంత ? మీ ముందు? మీ పాండిత్యము లోక విదితము. మీ మహత్తర గానములోక విదితము మహారాజులు మిమ్మల్ని గౌరవించారు పండితులు వినుతించారు కవులు పద్యమాలికలతో అలంకరించారు మీరు కంఠమెత్తిన చాలు. ఆ రాగాలాపానికి కోయిలలు విస్తుపోతాయి. వీణలు వ్రేళ్ళ కరుస్తాయి. మీ పాట కోటి ధన మని పించుకున్నది. ముఖేముఖే సరస్వతీ ! ఒక జాతికి చెందినంత మాత్రాన కళలను కాదనునధికారమెవరికీ లేదు. మహాదేవి అయిన సరస్వతీ మాతకి జాతి మత ద్వేషములు లేవు. సుకృత పరిశీలనము తప్ప పక్షపాతానికామె చిత్తమున తావులేదు

కల త్రివేణి వాణి ప్రత్యక్షరసత్యం - రంగాజీ ! ముద్దుపళని కవిత్వాన్ని గురించి ఏమనుకుంటున్నావు ? చెప్పి సభని కాస్త రంజింపజేయవమ్మా !

కృష్ణాజమ్మ ఓహో ! రంజింపజేయవలసినచోటుల రంగాజమ్మగారు కావాలన్న మాట

రంగాజమ్మ కృష్ణాజమ్మా ! అమ్మవారి ఆదేశాన్ని అయినా మీరవచ్చేమో కానీ ఆవిడ చెలికత్తెఅయిన చిలకమ్మగారి ఆదేశాన్ని మీరితే మటుకు - ఇంకేమన్నా వుందా ?

కృష్ణాజమ్మ ఆఁ అట్లాగా రంగాజీ ! అయినా ఇదేం కొంటె చిలక దొరికిందమ్మా అమ్మవారికి -

కల : చూస్తున్నా-చూస్తున్నా - మీ కవిత్వాన్ని ఒక్క చిలకకొట్టుడు కొట్టానంటే ...

రంగా వద్దమ్మోయి - మా కవిత్వం మా పేరుతోనే వుండనీ - చిలక్కొట్టూ తెరువాట్లూ వద్దులే

గంగా నాగరత్నం త్యాగరాజ స్వామివారి సమాధిని అరవై సంవత్సరాల తర్వాత ఆయన ఆజ్ఞమేరకి సముద్ధరించిన మహాభక్త విదుషీమణి నేటికీ ముక్కోటి ఆంధ్రులకీ సమస్త గాయక లోకానికీ, సంగీతాభిమానులకీ నిత్యస్మరణీయమై సదా ఆరాధనీయమై వెలుగొందుతూతిరువైయూరు క్షేత్రమునందు స్వామివారి సమాధి సమీపముననే సమాధి చేయబడిన నాగరత్నం సుకృత మహిమ ఏమని కొనియాడవచ్చును ?

మాచలదేవి త్యాగరాజ సమాధి సందర్శనార్థం తిరువయ్యూరు వెళ్ళిన భక్తులకు సకలోపచారాలూ సలిపిన సేవాశీలి త్యాగరాజ సహస్ర నామాలు నిత్యం నాగరత్నం స్వయంగా పఠిస్తుండగా అర్చకస్వాములు పూజచేస్తుంటారు తన సమస్త ధన కనక వస్తు వాహనాల్ని తృణప్రాయంగా త్యాగరాజ స్వామి కైంకర్యానికి ధారపోసిన దానశీలి నాగరత్నం

లల్లాదేవి ఇట్లాంటి సద్గుణగరిష్ఠులయిన లలనామణులు ప్రభవించిన భారత మాత ధన్యురాలు, కానీ ఈ తెరువాట్లూ, తెగకొట్టడాలూ, చిలక కొట్టుడులూ ఏమిటి? అసహ్యంగా

పళని అదేగదా బాధ - ఆడవాళ్ళం పైకి రాకపోవడానికి ఈ పిచ్చి పిచ్చి స్పర్థలూ, అసూయలూ కారణం ఔను గంగాదేవీ! ముక్కోటి ఆంధ్రులు అంటున్నారు కాదుట ఇప్పుడు ఏడుకోట్ల ఆంధ్రులట సుమా ఈ మధ్యనే సత్యలోకానికి సభకొచ్చిన పెద్దమనిషి

ఒకాయన చెప్పారు. రాచకొండో చానో ఏదో పేరు. గుర్తులేదు

గంగా . ఆంధ్రులు ఏడు కోట్లు ఇప్పుడు ? అమ్మో నరేగాని -

నీ పద్యాలు వినిపించవా మరి పళనీ ! ముద్దుపళనిని కాస్త పరీక్షించమంటావు అంతేగా కలభాషిణీ ! సిద్ధమా ముద్దుపళనీ!

ముద్దుపళని ఎప్పుడో సిద్ధము

రంగాజీ ఆశుకవిత్వంబులల్లితేనే సరా ?

ముద్దుపళని చిత్ర ప్రబంధముల్ సేయవలదె !

రంగా గోటితోడను వీణె మీటితేనే సరా ?

ముద్దు కొంచక రాల్గరగించవలదె ?

రంగా పదవాళి రాగముల్ పాడితేనేసరా ?

ముద్దు హిత వొప్ప వర్ణంబు లెత్తవలదె ?

రంగా ముద్దుపళనీ ! నాట్యశిరోమణీ !

అలనాట్య భేదంబులాడితేనే సరా ?

ముద్ద రంగాజమ్మా !

నవరసంబుల నంటి నడువవలదె?

కృష్ణాజమ్మా అహా! కలభాషిణి ఆదేశించటం బాగుంది రంగాజీ ముద్దు పళనీ ఇద్దరూ చెరో సీస పద్యపాదంలో హెచ్చరించుకుని నిగ్గుదేల్చటం మరీ బావుంది

సరోజిని ఆ పద్యం ముద్దుపళనిది లాగే వుంది చూడండి

మధురవాణి బలేగా కనిపెట్టిందే సరోజిని

కలభా . రాజనీతి వేత్తంటే ఏమనుకున్నారు మరి ?

(అందరూ నవ్వుతారు)

చంద్రరేఖ మా విజయ రాఘవభూజాని ఆస్థాన విద్వాంసురాలైన కృష్ణాజమ్మ వలె కవిత చెప్పుట కష్టమంటారు కదా కలభాషిణీ !

కలభా కష్టమా ! కష్టమున్నరా ? సంస్కృత సమస్యలు పూర్తిచేసి అవి తెలుగులోకి అనువదించి, ఆశుకవిత్వం చెప్పి అదరగొట్టేసిన విదుషీమణి గదా కృష్ణాంబ

అక్కదేవి ఇరవయ్యారు ఛందస్సులూ ఎరుగునన్నారావిడ

రామభద్రాంబ అదేగదమ్మా ఆవిడ గొప్పతనం అసలు నేనూ కృష్ణాంబా చెంగల్వ కాళకవిగారి శిష్యులం

మీరా అట్లాగా ? కృష్ణాజమ్మా ! ఆ సంగతి వివరంగా చెప్పవమ్మా !

కృష్ణాజీ అభిమానమతిశయించి నన్నూ రామభద్రాంబనూ, ముద్దు చంద్రరేఖనూగురువుగారైన చెంగల్వ కాళకవిగారు పొగిడారు నా గొప్ప నేను చెప్పుకుంటే ఏం బావుంటుంది గానీ గురువుగారి పద్యమే చదువుతాను

ప్రస్తార సంఖ్యను పదమూడు కోటులు
 నలువది రెండు లక్షలు పదేడు
వేలునేఱ్నూరును వింశతియునునారు
 వృత్తంబులందు నీ వృత్తమునకు
నీ వర్ణన సమస్యనీవు గూర్పుమటన్న
 నా వృత్తమున సమస్యను రచించి
యందుకు శ్లోకంబులా శువుగాఁ జెప్పి
 యవి తెనుంగునను పద్యములు చేసి

యిరువదారును ఛందంబు లెరిగియిట్లు
కవిత జెప్పినవారలీ భువిని గలరె?
కీర్తనీయ గుణాంబ! కృష్ణమాంబ

మోహనాంగి : ఇట్లా విన్ను గూర్చి మీ గురువుగారు పొగిడారా కృష్ణాజమ్మా ! అదృష్టవంతురాలివి, అనుపమాన ప్రజ్ఞాధురీణవు నిన్ను మనసారా అభినందిస్తున్నాను ఇట్టి స్త్రీలోక మాణిక్యములకు శిరసువంచి నమస్కరిస్తున్నాను

మీరాబాయి : రాజకుమారివి మహారాణివి, పట్టమహిషివి అయినా మోహనాంగి నీకెంత వినయమమ్మా ?

గోదాదేవి : ఇంకొకమాట మర్చిపోయినావు వీటన్నిటికంటే కీర్తి తెచ్చేమాట - కవయిత్రి అని చెప్పట

సుభద్రా : అదే చెప్పబోతున్నట్లుంది. మీరాబాయి పైగా గోదాదేవీ ! నీకూ మోహనాంగికి ఏదో కవితా పరమైన అవినాభావ సంబంధం వున్నట్లుంది కదూ ?

మహాదేవి : అనుమానం దేనికమ్మా సుభద్రాకుమారీ ! రాజాధిరాజ వీరపరమేశ్వరార్థ దుర్గాన టేశ సాహితీ సమరాంగణ చక్రవర్తి అయిన కృష్ణదేవరాయలకి మోహనాంగి తనూజాత గోదాదేవి కావ్య తనూజాత వీళ్ళిద్దరూ ఆ రాజుగారికి కుమార్తెలే మరి ఇందాక అదేగా అనుకున్నాం

చంద్రరేఖ : అట్లా చెప్పండి ఒక విధంగా మధురవాణీ రామభద్రాంబలు కూడా అక్కచెల్లెళ్ళ వరసే - రఘునాధనాయకులవారి ప్రేమాస్థానాలు గదా -

గంగా : ప్రేమాస్థానాలంటే గుర్తొచ్చింది నువ్వు రంగాజి కూడా అంతేనేమో- రాజ గోపాల విలాసము ఆశ్వాసాంత పద్యాల్లోని రాజుగార్ని ముద్దు చంద్రరేఖానాధా! ముద్దు చంద్రరేఖా ప్రేమస్థేమాభిరామా!

ముద్దు చంద్రరేఖా మదనా ! అని పలుమారులు చెంగల్వ కాళయ్యగారు స్మరించారుగదా.

ముల్ల విజయరాఘవ నాయకుని కళాభినివేశానికి నట్టువగ్గాలు లేవనిపిస్తుంది. ముద్దు చంద్రరేఖ విదుషి . నాట్య విద్యలో ఊర్వశి - రంగాజమ్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. విద్వత్కవి జనస్తవనీయ రత్నహారీతు పార్థివః అన్నమాట ఆనాయక రాజేంద్రుని విషయంలో నిజమైంది

వెంగమాంబ . నాట్యకళకాదు సకల కళలూ విద్యలూ కూడా చంద్రరేఖకి కరతలామలకాలని వాళ్ళ గురువుగారైన చెంగల్వ కాళకవిగారి పద్యంవల్ల తెలుస్తోంది తనతోపాటు శిష్యులకీ కీర్తి తెచ్చుట ఆయన ఘనత.

సరస్వతి ఏదీ వెంగమాంబా ! కాళకవి పద్యం చదువు చంద్రరేఖా ప్రాశస్త్యం విందాము.

వెంగ అట్లాగే తల్లీ ! నువ్వు స్వయంగా నన్నడగటం నా భాగ్యం.

తీగె మెరుంగుల తీరున నిరుగడ
వరుసబంగారుపావడలు మెరయ
బరపుగా వలగొన్నభాను మండలముల
హరువున నపరంజ హరిగెలమర
మొగిలు మొత్తంబులు మోహరించిన రీతి
బ్రమ్ము సాంబ్రాణి ధూపమ్ములలర
విద్యా విశేషముల్ వేర్వేర వివరించు
హవణిక బిరుద వాద్యములు మొరయ
వీర వేంకట రాయపృథ్వీ మహేంద్ర
దత్త బహువిధ బిరుదముల్ దనరుచుండ

సమ్ముఖమ్మున నిల్చియా ముద్దు చంద్రరేఖ
వివిధ విద్యలు వినిపించె వింతయనగ

కల : వీర వేంకటరాయలు చంద్రరేఖ కనేక బిరుదు లిచ్చినాడట ఈమె ఆట నుండి విజయరఘువేంద్రు జేరినదన్నమాట తంజపురి వచ్చి ఆ వూరిలో తన విగ్రహాలను సైతము స్థాపించుకొన గలిగిన సమర్థురాలు మరి

పళని రంగాజమ్మా ! నీ ఉషాకన్యవలె వన విహారముగావిస్తూ పుష్పాపచయం చేద్దామా ?

తిమ్మక్క సరస్వతీదేవి సభ ఇంత అద్భుతంగా సాగుతుంటే మధ్యలో వెళ్ళి పూలు కోద్దామంటుందేమిటి ఈ అమ్మాయి ఎట్లా అయినా కాస్త తిక్కదిలాగే వుంది దేవి కోపగిస్తుందేమోనన్న భయమనలే దుస్మి

కలభా అమ్మా తిమ్మక్కా ! అత్త ఆడుబిడ్డలమధ్య సవతిసోదరితో కలిసి సంసారంలోని కష్ట సుఖాలనుభవించిన దానివి మడీదడీ వంటావార్పూ, పూజా పురస్కారం వీటితోటే సరిపోయింది నీకు సమష్టి కుటుంబాలు వుంటే సంఘ స్వరూపం కొంత ఒబ్బిడిగా వుంటుందనేమాట ఆధునిక శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకుంటున్నారుట కాని ఇంట్లోని ఆడవాళ్ళకి స్వాతంత్ర్యం తక్కువౌతుందనేమో చిన్న చిన్న కుటుంబాలు ఏర్పరచుకుంటున్నారట నవీనులు

మొల్ల అఁ పడుచుల కాపురము చితుకులమంట

సుభ కలభాషిణీ ! అసలు విషయం అవగతం కాలేదు

కల రంగాజమ్మ రచించిన ఉషా పరిణయంలోని 'వనవిహార రగడ' విన్పించమని ముద్దుపళని అడిగింది విందామా మరి ?

తిమ్మక్క ఎంత మెలికతిప్పి అడిగావమ్మాయి పళనీ! నేను విసుక్కున్నానని ఏమనుకోకేం -

గంగా ప్రథమాంధ్ర కవయిత్రి తిమ్మక్కగార్ని అన్యథా ఎలా అనుకుంటా రెవరైనానూ -

ముద్దు గంగాదేవి చెప్పింది నిజం తిమ్మక్కగారూ !

వెంక ఇంతకూ రంగాజమ్మ రగడ

రంగా మల్లెమొగ్గలు మీరె మరుని శరగోళ్లలన
నెల్లెదల దనచాయలై నయనిది గోలలన
బింబోష్ఠియేమె దగబెంచి తిటుసాలమును
డంబైన యట్టి నీడల నీరసాలమును
నెంతదూరము చనియె నిందుకే ఈ లేమ
కంతుపూజకు నన్నగనకములెయీా లేమ
వేడుకలు నించెనిట వెలది నారంగములు
నాడగా గుంపులై యలరె సారంగములు

మహా చక్కని అంత్యప్రాసలతో సాగినది రచన

త్రివేణి బాగా రాశారు రంగాజమ్మగారు - ఇది వింటుంటే నాకు బెంగుళూరి నాగరత్నముగారి పాట వినాలనిపిస్తున్నది

సుభ నాకు చంద్రరేఖ నృత్యాభినయం కూడా చూడాలనిపిస్తున్నది

కల . తక్షణమే మీ రెండు కోరికలు తీరగలవు. నాగరత్నం పాటకి చంద్రరేఖ నృత్యం చేస్తుంది చూడండి

మోహ కలభాషిణీ ! నువ్వు అన్యథా భావింపకపోతే -

కల ఎందుకు భావిస్తానమ్మా అన్యథా - నువ్వు ఏం అడగబోతున్నావో అర్థమైందిలే

నర నాగరత్నం మోహనాంగి కిష్టమైన పాట పాడతావా ? చంద్రరేఖా! ఆ పాటకి నాట్యం చేస్తావా ?

నాగ, చంద్ర తప్పకుండానమ్మా

రాజాధిరాజ వీరప్రతాప శ్రీకృష్ణరాయ భూపా !

(నృత్యమూ, పాటా అయినాక) -

ఉపచారములు చేకొనవయ్యా ఉరగరాజశయనా !

కపటనాటక సూత్రధారివై . (అనే త్యాగరాజ కృతి పాడుతుంది నాగరత్నం )-

అంతా బావుంది - బావుంది ఆటాపాటా బావున్నై త్యాగరాజస్వామి కృతి అద్భుతం -

మనో మోహనాంగీ ! పరవశించి పోయినావే నృత్యంచూసి -

మోహ ఔనమ్మా! మా జనకుల గొప్పదనాన్ని వింటుంటే నాకు పరవశంగా వుంటుంది ఎటువంటి మహానుభావుడి కడుపున పుట్టాను

'సప్త సంతానములలో ప్రశస్తిగాంచి

ఖిలముగాకుండునది ధాత్రికృతియె గాన'

నన్నుకూడా కావ్యాలు రచించమన్నాడాయన. గంగాదేవి తప్ప హంపీలో అంతవరకూ కావ్యాలు రచించిన స్త్రీలు లేరు ఆమాటే అంటే -

స్త్రీలలో ఎంతటి ప్రజ్ఞాధురీణలు లేరు ? పురుషులొక్కరే పుస్తకాలు రాయాలని ఎక్కడుంది తల్లీ ! నువ్వు తప్పకుండా కవిత్వం రాయాలని ప్రోత్సహించాడా ప్రభువు అల్లసాని పెద్దనగారి దగ్గిర ముద్దార నాకు విద్య నేర్పించాడు నా తండ్రిగారైన కృష్ణరాయల విక్రమం అనన్య సామాన్యంగదా. ఆయన పేరుచెప్తే శత్రురాజులకి వణుకు.

మొల్లా ! నీకు గుర్తుందా ?
ఇతడు గోపాలకుండితడు భూపాలకుం
  డెలమినా తనికన్ననితడు ఘనుడు
అతడు పాండవపక్షుడితడు పండితరక్షు
  డెలమినాతనికన్న నితడు ఘనుడు
అతడు కంసధ్వంసి ఇతడు కష్ట ధ్వంసి
  యెలమినాతని కన్ననితడు ఘనుడు
పల్లెకాతండు పట్టణ ప్రభువితండు
  స్త్రీలకాతండు పద్మినీస్త్రీల కితడు
సురలకాతండు తలప భూసురుల కితడు
  కృష్ణుడాతండు శ్రీ మహాకృష్ణుడితడు
అని మా తండ్రిగారైన కృష్ణదేవరాయల
  వారి గురించి పద్యం చెప్పావు

మొల్ల ఔను మోహనాంగీ ! రాయలవారన్న నాకంత గౌరవము

మోహ కొండవీడు జనులు కొండవీడుట మాని కావించిరచటనే కాపురంబు

విజయవాటికవారు విజయవాటికయిక తమ యూరుకాదని తల్లడిలిరి

రామ శ్రీకృష్ణరాయలు మూరురాయరగండడు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు. విద్వత్కవి తెలుగు భాష వున్నంతదాకా తెలుగు జాతి వున్నంతదాకా అయనకి నీరాజనాలు పడుతూనే వుంటారు క్రీడాభిరామంలో మొదట వల్లభామాత్యుడు 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని చెప్పాడు. కానీ అముక్తమాల్యదలో శ్రీకృష్ణ రాయలు 'దేశ భాషలందు తెలుగులెస్స' అంటే అమాటే

బలపడింది ఈమధ్య విశ్వనాథ సత్యనారాయణగారుట ఒక కవి కనపడి మాటలమధ్య ఈ తెలుగు పద్యం చెప్పాడు.

నర — ఆ తెలుగుపద్యమేమిటి? ఏదీ రామభద్రాంబా! విన్పించుదాన్ని

రామ — అట్లాగేనమ్మా :

ఒక్క సంగీతమేదో పాడునట్లు
భాషించునపుడు వినిపించు భాష
విస్పష్టముగ నెల్ల విన్పించునట్లు
స్పష్టోచ్చారణంబు ననొనరు భాష
రసభావముల సమర్పణ శక్తియందున
నమర భాషకును దీటైన భాష
జీవులలోనున్న చేవయంతయు చమత్కృతి
పల్కులన్ నమర్పించు భాష
భాషలొకపది తెలిసిన ప్రభువు చూచి
భాషయన నిద్దియని చెప్పబడిన భాష
తనర ఛందస్సులోని యందమ్ము నడక
తీర్చి చూపించినట్టిది తెలుగుభాష

కల — చక్కని పద్యం చదివావు రామభద్రాంబా! అమ్మవారు గీర్వాణి సంతు ష్టాంతరంగ అయింది

మనో — భాషలొకపది తెలిసిన ప్రభువు అంటే శ్రీకృష్ణదేవరాయలేనా? కల భాషిణీ ! ఇంకో భారతదేశ పరిపాలకుడు కాకూడదా?

త్రివేణి — పరిపాలకులకు బహుభాషలు వస్తే చాలా బావుంటుంది.

మొల్ల — అవునమ్మా మనోరమా ! ఆయనకి సంస్కృతంతో సహా ఎన్ని భాషలొచ్చు !

వెంగ ఎన్ని భాషల కవులను సమాదరించాడు తన సభా భవనమైన భువన విజయంలో -

మధుర ముద్దుపళనీ ! నీ ప్రసిద్ధ పద్యం చదువుతావా ?

ముద్దు ఆ పద్యం రానిదెవరికి మధురవాణి ! అయినా అడిగావుగనక చదువుతాను

సొమ్ములియ్యవచ్చు సమ్మంధమీవచ్చు
ఈయరాని ప్రాణమీయవచ్చు
తనదు విభుని వేరుతరుణి చేతికినిచ్చి
తాళవశమె ? యెట్టిదానికైన ?
ఇదేగదా -

వెంగ చక్కగా చెప్పావు పళనీ ! ఏదీ ఇంకొంచెం నీ మృదు పద్యములు వినదించు నమ్మోహనరవళి ?

ముద్దు నీ కిష్టంగదా వెంకమాంబా ! నా రాధికా సాంత్వనం లోని శ్రీకృష్ణుని వర్ణన చేస్తాను

బారను గొల్వగా మీరు వక్షమువాడు
తలచుట్టి వచ్చు నేత్రములవాడు
విడికెంపునణగింపు బింబాధరమువాడు
న్నతాజాను బాహువులవాడు
చిగురాకులనుగేరి నగుపాదములవాడు
డంబైన కంబుకంఠంబువాడు
చిక్కని పాల్గారు చెక్కులు గలవాడు
మెరుగు చామనచాయ మేనివాడు
నెమలిరెక్క తురాబూను నెరులవాడు
మొలకనవ్వులదగు ముద్దుమొగమువాడు

మదనకోటుల కొనగోట నదుమువాడు
చారుతరమూర్తి ! గోపాలచక్రవర్తి

మీరా : అహాఁ ఎంత చక్కగా గిరిధర గోపాల వర్ణనము చేసిందో ముద్దు పళని.

రంగాజీ : మహాభక్తురాలైన మీరాబాయికి గిరిధర సాక్షాత్కారమైనట్లున్నదికానీ

మనోరమ : కానీ - ఏమిటి రంగాజమ్మా

రంగాజీ : మణి ప్రవాళశైలీ యుత మళయాళభాషా మధుర కవయిత్రీ ! మనోరమా తంబురట్టీ నువ్వు గమనించటం కష్టమేలే

త్రివేణి : ఆవిడ మళయాళంలోగాక సంస్కృతంలో కవిత్వం రాసిందనుకుంటాను

తిమ్మక్క : అవునుట

కల : రంగాజమ్మా ! ముద్దుపళనిని గురించి నువ్వు చెప్తావా లేక నన్ను చెప్పమంటావా ?

రంగాజీ : ఏంలేదు - పళని పద్యాలు వింటుంటే నంది తిమ్మన్న గారి పద్యాలు గుర్తుకు రావడంలేదూ ?

పళని : ఈ విమర్శ తప్పదని ఎరుగుదును? ముక్కు తిమ్మనార్యుడు నాకు చాలా ఇష్టమైనకవి అయన పలుకుబళ్ళు నాకు ప్రాణప్రదాలు నా కావ్యం చూస్తే తెలుస్తుంది. ఆయన ధూర్తగోపాలుడని ప్రయోగం చేశారు పారిజాతాపహరణంలో నేనూ 'బాగయె ! ధూర్త గోపాలరాయ' అనీ ప్రయోగించాను ముచ్చటపడి అంతేకానీ సొంతంగా కవిత్వం రాయలేక కాదు సుమా !

గంగా : ఎంతమాట పళనీ ! నీకు కవిత్వం అల్లడం రాకపోవడమా?

మధుర ధారాశుద్ధిశోభితమైన ముద్దుపళని మధుర కవిత్వాన్ని ఇంకా వినాలని అందరం ఆరాట పడుతుంటేనూ?

కలభా ఒక సమస్య ఇద్దాం అయితే ఏమ్మా పళనీ !
'నాయమెనీకు ? చెంగలువ నాయుడ ! నా యెదనింత సేయగన్'

మధుర . మా చేమకూర వెంకటకవి పాదము వంటిదికూర్చి సమస్య ఇచ్చినదే కలభాషిణి

పళని నయం మధురవాణీ ! పద్యం కూడా చేమకూరవారిదే అనలేదు

గంగా పళని ఎందుకో అపవాదు గురించి భయపడుతోంది

పళని తోయధిరాజుకున్ పొడమితో యజవాసిని తోడబుట్టి యా
తో యరుహాప్త జంటగుచుతోయజ పత్రనేత్రునకున్ మరందిపై
త్రోయగరాని చీకటుల త్రోయుచు చల్లని తెల్విచెందియున్
నాయమె నీకు చెంగలువనాయుడ ? నా యెదనింత సేయగన్-

లంతా బావుంది బావుంది

పళని ఏమో - రంగాజమ్మగారేమన్నా విమర్శిస్తారో అనిపిస్తున్నది.

రంగాజీ నేనా ? అవ్వ ! నిన్ను ఏమర్శించగలదాననా పళనీ !
ఏనాతి నీరీతి నెంతొ భక్తి చెలంగ
వ్రాయించె జయధాటి రామకోటి
ఏవారి నీ దారి నెలమి విద్వచ్ఛ్రేణి
దనియించెనెఅమెచ్చి ధనములిచ్చి
యేకల్కి నీ పోల్కి నిలగీర్తిగైకొనె
గబ్బముల్ చేనంది ఘనత జెంది
యే బాల నీలీల నిటు దొరాదొరలచే
బొగడొందె గడిదేరి బొలుపు మీరి
తలపనే ధీర నీ మేర ద్రాతయ-ర్యు

పాదముల (వ్రాలెమదినెంచి (పస్తుతించి
కలరెనీ సాటి? ముత్యాలు కన్నమేటి ?
(పబలగుణ పేటి ! శ్రీ ముద్దుపళని బోటి !

వెంగమాంబ  ఇదీ పళని పద్యమే నుకుంటాను. నిజంగా ఆమె అంతటిదే

కృష్ణాజమ్మ: నీ గురించిన మిగిలిన విశేషాలు చెప్పవమ్మా రసధునీ! ముద్దుపళనీ!

పళని  నేను నా అశ్వాసాంత గద్యనే చదువుతానయితే మా గురువుగారిలాగా ..

శ్రీ చిన్నికృష్ణ కరుణా కటాక్ష వీక్షణ అనూన శృంగార రస(పధాన సంగీత సాహిత్య భరత శా(స్త్రాది విద్యాపారంగత

తిమ్మక్క  ఆహా! పళనీ! భరత శా(స్త్రాది విద్యాపారంగతవు కూడానా! ఏమి అదృష్టం "సంగీత మపి సాహిత్యం ఏకమాపాత మధురమ్ అన్యదా లోచనా మృతమ్" అంటారు మా ఇంట్లో సంగీత సాహిత్యాలూ భక్తీ ముప్పేటపడినయి వచ్చేపోయే చుట్టాలకి అంతులేదు భక్తులరాక తప్పదు. నిత్యమూ అతిథులకి మడిగట్టుకుని వండి వార్చి భోజనాలు అమర్చటం సరిపోయె - పొద్దున పని మధ్యాహ్నం పని అర్ధరా(తిదాకాపని మా వారు సంకీర్తనాచార్యులు గదా మా ఇంట్లో అంతా ..ంతో ఇంతో కవిత్వం రాయగలవారే 'చిన్నన్న ద్విపద కెరగును పన్నుగ పెద తిరుమలయ్య పదముల కెరగున్"

అనే మాట వినే వుంటారు కవి కర్ణ రసాయనం రాసిన సంకుసాల నృసింహ కవి గూడా మా పిల్లవాడే ఇంగువ కట్టిన గుడ్డకి వాసన అంటినట్లు వాళ్ళందరి మధ్య వుండటంతో నాకూ కవిత్వం చెప్పటం వచ్చింది మగవాళ్ళకేముందమ్మా అన్నీ ఆడవాళ్లు

అమర్చి పెడితే కమ్మగా తిని ఏ ఉయ్యాలమీదో కూచుని రాసుకుంటారు కానీ ఇంత ఇల్లూ సమర్థించుకుని నేను తెమిలి తాటాకూ గంటమూ చేతపుచ్చుకోవటం గగనమయ్యేది ఏ ముసలమ్మలో,పక్కింటి వాళ్ళో చూశారంటే అవ్వ సిగ్గులేకుండా తిమ్మక్క మగవాళ్ళకి మల్లే కవిత్వం రాస్తోంది. పిదపకాలం పిదపబుద్ధులూ అని విమర్శించేవాళ్ళు. ఎట్లాగో సుభద్రా కల్యాణం ఒక్కటీ రాసేటప్పటికి తలప్రాణం తోకకి వచ్చిందంటే నమ్మండి ఇంకా ఎన్నో పుస్తకాలు రాయాలని ప్రాణం కొట్టుకుపోయేది కానీ కుదిరితేనా ? మావారు కూడా జాలి పడేవారు ఎప్పుడూ పనితో సతమతమయ్యే నన్ను చూసి, ఆయనది కవి హృదయంకదా చుట్టాల బధపడలేక ఒకపాటకూడా రాశారు పాపం

గంగాదేవి అబ్బ ఎన్ని ఇబ్బందులెదుర్కొని రచించావు తిమ్మక్కా ! మేము రాజ స్త్రీలం పరిచారికలు అన్నీ అమర్చిపెట్టేవాళ్ళు పండితులు సలహాలిచ్చేవాళ్ళు లేఖకులు మా కావ్యాన్ని ప్రతులుగా వ్రాసే వాళ్ళు పరిశీలించటానికి కోరిన గ్రంథాలు సిద్ధంగా వుండేవి నాకూ మధురవాణికీ రామభద్రాంబకి రంగాజీ కృష్ణాజీలకీ ముద్దుపళనికీ కూడా అవకాశాలు పుష్కలంగా వుండేవి రాజుల అండదండలుండేవి మాకు పాండిత్యం లేదని కాదు, వున్న అవకాశాలను గురించి చెప్తున్నాను కవిత్వానికి, ఆ మాటకొస్తే ఏ కళకైనా ప్రోత్సాహం కావాలి ఒక్క చిన్న మెచ్చుకోలు మాటయినా కావాలి అదీలేకపోగా అమాయకత్వంకొద్దీ స్త్రీకి స్త్రీయే శత్రువు అన్నట్లు ప్రవర్తిస్తే ఇంకా మనం బాగుపడేది ఎప్పుడు?

సుభద్రా తిమ్మక్క కష్టాలను ఆధునిక కాలంలో చాలా అనుభవించాము గంగాదేవి' త్రివేణిగానీ మహాదేవివర్మగానీ మేమందరం ఆవిడ కోవలోకే వస్తాం సరోజినికూడా -

లల్ల మనోరమా నేనూ, మీరా, వెంగమాంబా, గోదా మొల్లా రకరకాలైన

విమర్శల్ని ఎదుర్కొన్నాం భగవంతుడు మాకు అంతగా వుండకపోతే ఏమైపోయేవాళ్ళమో ఏమో-

కృష్ణజ : తిమ్మక్కా సుభద్రాకల్యాణంలో అర్జున వర్ణన బాగా చేశావుగా విన్పించవా ?

తిమ్మక్క . ఏదో రాశాను కృష్ణజమ్మా మీకున్నంత పాండిత్య వైభవం వాకెక్కడిది ?

త్రివేణి : ఇందాకట్నించీ అదేగా అంటున్నాం. పునరుక్తి చేస్తున్నారు తిమ్మక్క గారు.

మనోరమ . కవిత్వం సహజంగా రావాలి ఏదీ నీ అర్జున వర్ణన.

తిమ్మక్క : ఎగుబుజమ్ములవాడు - మృగరాజమధ్యంబునడచి పుచ్చుకొను నెన్నడుముగలవాడు - చక్కనివాడు - కోదండగుణకిణాంబు లౌబాహులమరినవాడు- వెన్నున మచ్చగల విభవంబువాడు.

రంగా : మృదు లలితమైన నీ కవిత్వంలో స్త్రీ హృదయం సుమధురంగా ఆవిష్కరింపబడింది చూడు - అదే సుభద్రను అత్తవారింటికి పంపే ఘట్టం - అది చదువు.

తిమ్మక్క ప్రతి స్త్రీకి ఇదొక దుర్భర ఘట్టమే - కానీ తప్పదు ఎంతమంది కాళ్ళకి మ్రొక్కినా అత్తవారింటికి పొమ్మనే గదా దీవిస్తారు.

గంగా బాగుగా చెప్పితివి తిమ్మక్కా. కానీ నీ అప్పగింతలని -

తిమ్మక్క అప్పుడు కవ్వడి యా సుభద్రయును
హరి పాదపద్మముల్ హర్షమున మ్రొక్క
హరియు రుక్మిణి నూచి అప్పుడిట్లనిరి
అదలకేమిటొకొ మాయమ్మ సుభద్ర
అత్తయునీకు మేనత్తయుగాన
వింత వారెవ్వారు వీరి లోపలను
బావ మరుదులు చాల భక్తిగలవారు

మధుర : తిమ్మక్కా ! నీ రచనయొక్క ప్రభావము మా చేమకూర వేంకట కవిపై చాల యున్నట్లున్నదే.

రామ ఔను నిజమేనుమా -

తల్లిదండ్రులు గారాన తన్ను బెనుప

పదినెలన్నలు కడు గారవంబువెరప

అల్ల యూరంత బలగంబునందునుండి

ఒంటి నెద బాసిపోవనెట్లోర్చు మనను

మధుర అనియు, కుంతిదేవి నీకు మేనత్తగదా అత్తగారింటికి వెళ్ళడానికి దిగులుపడతావేమిటి? అని సుభద్రని మందలించెను చేమకూర కవి -

రంగా కుంతిదేవి మేనత్తయయినను -

అత్తవారింట సకల భాగ్యంబులున్న

మగని మీదట తనకెంత మక్కువున్న

ఆడుపుట్టువు పుట్టింటి కానపడును

గాన సుభద్ర యొకతీరుగాగ నుండె

అని జాలి కూడ పడినారుగద -

మోహనాంగి ఆడవారికి పుట్టింటిమీద మమకారము తప్పదు- జానపదకవులు ఇట్లా అన్నారు గదా - "మానెడూ బియ్యమ్ము- మంతెన్నకూరా- మహరాజు గోత్రంబు నే పుట్టినిల్లూ .

మొల్ల : ఓబులేసుని కొండ వెలిసుండవలెనూ

ఎప్పటికి పుట్టిల్లు కలిగుండవలెనూ.

తిమ్మక్క కలిమియ్యి బలిమియ్యి కదిరి నరసింహా!

నా చిన్నారి తమ్ములకు సిరిసంపదలియ్యవయ్య!

వెంక అరదాన్ని నేను అయిపుడితిగానీ

గంగ్రగొర్తలికింద కొమ్మనైనా చాలు -

మోహన ఆహా జానపదకవులు ధన్యులు- చేమకూర కవి పద్యమున కెంతటి వ్యాఖ్య లభించింది!

పళని అవునుమరి మనుషుల మనసులో దాగిన మహత్తర విషయములను వెలికి తీసుకొనివచ్చి కావ్యరచన చేయు ఋషితుల్యుల రచనలు సుశాశ్వతములుగ నిలిచియుండును

రంగా సత్యమే - తాళ్ళపాక తిమ్మక్క పాదములకు చేమకూర వేంకట కవి యిచ్చిన గౌరవము శ్లాఘనీయము -

రామభద్ర పాదములకా ?

రంగా అదేనమ్మా సుభద్రా కల్యాణ ద్విపద పద్యపాదములకు

పళని ఈ సందర్భమున తిమ్మక్కను అభినందించుచున్నాను. ఆమె చెప్పినట్లు గృహకృత్యములనుండి ఇంక కొంచెము తీరికచిక్కి మరిన్ని గ్రంథములను కూర్చగలిగినచో నెంత బాగుండెడిది! స్చ- అది పోనిండుగానీ ఇదేమమ్మా పెద్దలు మధురవాణీ రామభద్రాంబలు కూడ మా చేమకూర యనుచున్నారు

మధుర ఔను పళనీ! మా రఘునాథ భూపాలచంద్రుని అస్థాన క్షేత్రమున మా తంజవూరి యందు విరగబూచి కదా ఆ చేమకూర వెంకటకవి కవిత ప్రతి పద్యచమత్కృతితో ఆంధ్రదేశమునందంతటనూ కప్పురపు నెత్తావులెగజిమ్మి దివ్యపరిమళ భరితము చేసినది

పళని . ఈ ? చేమకూర ఘుమఘుమలాడు తాలింపులో రమ్యముగ నుండును గాని ఈ కర్పూరపు నెత్తావులేమిటి?

రంగా · పళనీ నీవూరుకొనుము నీతో వేగలేకపోవుచున్నాము నీ వన్న తాలింపునే తీసికొందుము పోనీ అందులోనే సుమధుర పద్య కవితల ఇంపుగలదు గదా.

పళని అమ్మయ్య, నీ కర్థమైనట్లున్నది మరి ఏరికో ?

మొల్ల ఏరికేమిటి ?

పళని అదే మా చేమకూర వేంకటకవి - మా తంజావూరు అనుచున్నారూ- ఒకరి సొంతమా అనీ

వెంక (నవ్వుతూ) అయిన నిప్పుడేమందువు ?

మొల్ల నిజముగా అది నీకు తెలియదా వెంకమాంబా !

రంగాజ ఓయమ్మ మొల్లమాంబా ! నాకు తెలియును చెప్పమందువా?

మధుర రామభద్రలు మాకు మటుకు తెలియదా ! రంగాజమ్మా ! ఉత్తపుణ్యమునకీ అల్లరి పళని నుడికించితిమి గానీ

పళని నన్నేమి యుడికించితిరి తల్లులారా ! ఉడికి కూర్చొనుటకు నేనేమి చేమ దుంపనా ? బంగాళాదుంపనా ? ఇందాక రంగాజమ్మగారు వేయించిరి మీరేమో ఉడికించితిమనుచుండిరి. (ఓరగా సరోజనివేపు చూచును) (సరోజని చిరు కోపముతో నవ్వుతూ చూచును)

గంగా బంగాళాదుంప అంటే ? సరోజనికి సంబంధించినట్లున్నదే - సోనార్ బంగ్లానా?

బెంగుళూరునాగరత్నం : ఓహో మీకు తెలీదు కదూ - సముద్రాలుదాటి వచ్చిన

విదేశీయులు బంగాళా దుంపలని రుచి చూపించారు మనకి -

తిమ్మక్క సరోజిని చిరు కోపానికి అర్థం తెలిసిందిలే నీతో చాలలేము పళని తల్లీ ! నీ చమత్కారమునకొక నమస్కారము

మోహనాంగి ఇంతకును పళని మాటలయర్థమేమనగా కవిత్వమునకు దేశ కాలముల భేదములేదు - సార్వత్రికమును సార్వజనీనమును శ్రేయోదాయకమును విశ్వశాంతి ప్రదాయకమును అయిన సుకవిత్వము ఎల్లెడలా సర్వులకూ శిరోధార్యము

సరస్వతి సత్యమును సర్వసభ్య సమ్మోహనకరముగా వక్కాణించినది మోహనాంగి

కలభా నీవు చెప్పినది వీరందరెరుగుదురమ్మా - ఈ పళని యుండి యుండక చమత్కారములతో చంపుచున్నది.

పళని ఏమి ? ఏమి ? సరస్వతీదేవి సమ్ముఖమున ఆ మాటలు

కలభా తప్పు. తప్పుగానేయంటివి అమ్మవారి శాపము వలన భూలోకములో ద్వారకానగరములోని మానవకాంతగా జన్మించినప్పటి నుండి యు ఈ అలవాటు అబ్బినది అదేమో తప్పించుకొనలేకున్నాను

మనోరమ అంతేనా? పింగళిసూరన్న గారి తెలుగుదనము వల్ల కాదా?

(అందరూ చిరునవ్వు హేలలు చిల్కుదురు).

గంగా : తిమ్మక్కా! నీ మృదు కవితకు నా అభినందనలందుకొమ్ము. ఒక్కసారి నీ భర్తగారి పదకవితను కూడ వినిపించమని కోరుచున్నాను

రామభద్రాంబ మధురవాణి - ఔనౌను - తప్పక విన్పింపవలసినదే.

తిమ్మక్క (చిరు సిగ్గుతో నవ్వి) అటులే మావారి కున్నంత గాత్రసౌలభ్యము నాకులేదు అయినను మీరు అడిగితిరి కనుక ప్రయత్నింతును

శారద గోదాదేవి ఏదియో ఆలోచించుచున్నది ద్రవిడ కన్యారత్నమా !
శ్రీ రంగేశ్వర భక్తి భాండారమా ! చూడికుడు త్తనాచ్చియార్ !
అలంకార ప్రియా బాలా తన్యతాః పుష్పమాలికా
జనకాజ్ఞాత వృత్తాంతా ! సాధమ్మిల్లే దధౌరహః
అని స్తుతింపబడినదానా !

కలభా స్వోచ్ఛిష్ట మాలికా బంధ గంధ బంధురజిష్ణవే
విష్ణుచిత్తతనూ జాయగోదాయై నిత్య మంగళమ్
అని మంగళా శాసనమొనర్పబడినదానా 'ఓ అండాళ్'
నీవు రచించిన పాశురమును వినిపింపుము.

మోహనాంగి అసలే ఆమె ముఖ సౌందర్య వైభవమును చంద్రుడపహరించినాడు కానీ చంద్రుని సౌందర్యమునే ఈమె అపహరించినదని లోకముచేత నీలాపనింద పొందినది - దిగులు పడదామరి

సరోజని ఏమేమి ? ఆంధ్ర భోజులవారి అడుబిడ్డ ఏమిటో చమత్కరించుచున్నదే - నాకు సరిగా నర్థముకాలేదు -

రామభద్రా హూణభాషా వైశారద్యమునూ వంగదేశ ప్రభావమునూ సైతము కలిగి యుండుటచేత సరోజనీనాయుడూ, నీకట్టి సందేహము కల్గుట సమంజసమే -

మధు అంతవరకెందుకు రామభద్రాంబా! కృష్ణదేవరాయల ప్రౌఢ పద్యములు మనవారికైన తొందరగా అర్థము కావుకదా. అందుండుంద్వయ నదృవదృవదనుండు... మొదలైన పద్యాలంటే -

మోహన   ఔను - ఆయన కవితా ప్రావీణ్య ఫణీశుడు

గంగా   తిరుమలాంబా ! అందాళ్ నీలాపనింద సంగతి ఏమి? నీ తండ్రి గోదాదేవి పేరుననే కావ్యము రచించెను గదా -

పళని   ఆ దీమాతోనేగదా తిరుమలాంబ కొంటెతనము వెలయించి ఊరించుచున్నది -

కలభా   పళనీ !

పళని   (తప్పున్నట్లు లీలగా లెంపలు వాయించుకొంటుంది)

కలభా   చెప్పు తిరుమలాంబా !

మోహన   అమ్మా ! హంసవాహనా !

చేర్పుక్కగా నిద్ద చిన్ని జాబిల్లిచే

సిందూర తిలకంబు చెమ్మగిల్ల

అవతంస కుసుమంబునందున్న యెలతేటి

రుతికించి దదంచిత శ్రుతులనీన

తరుణాంగుళిచ్ఛాయ దంతపు సరకట్టు

లింగి లీకపు వింత రంగులీన

ఉపనిషత్తులు బోటులై యోలగింప

పుండరీకాసనమున కూర్చుండి మదికి

నించు వేడుక వీణ వాయించు చెలువా !

నలువరాణీ ! అవధారు -

సైరంధ్రుల్ పైకెత్తికజ్జలము పక్ష్మశ్రేణికం దీర్పవా

లారుంగన్నులమీద జూమతరి ఫాలాంచచ్చతుర్థీనిశా

స్ఫారేందుంగనెవక్త్రమ - మక్కనుటగాక అత్మప్రభా

చోరుండుండగ తన్ను తద్గ తవిభాచోరం బనున్ లోకముల్

మధుర  ఆహా॰ అనన్య కృతి ప్రబంధమైన ఆముక్తమాల్యదాకర్త శ్రీకృష్ణ దేవరాయల చమత్కారము శ్లాఘనీయము ఆయన పుత్రికయైన తిరుమలాంబ తన తండ్రి కావ్యమున నాయికయైన ఆముక్తమాల్యదను ఆటపట్టించుట సొగసుగనేయున్నది.

రామభద్ర  తండ్రిగారి మహత్తర విద్యా వైదుష్యము తనయకు అబ్బుటలో నాశ్చర్యమేమున్నది కృష్ణరాయల ప్రోత్సాహమువలననే తిరుమలాంబ మరీచీ పరిణయము వరదాంబికా పరిణయము అను రెండు ప్రబంధములను కూర్చినదనుకొందును

గంగాదేవి  మధురవాణీ ! పండితపుత్ర : పరమశుంఠ : అన్నారు గదా-

పళని  ఔనౌను పండిత పుత్రిక విజ్ఞాన విశారద

కలభా  అమ్మవారి కొలువున ఈ [illegible]జనపక్షపాతముతప్పలేదే -

ఇరావతి  అమ్మవారి కొలువు - గనకనే [illegible]ప్పలేదు

మొల్ల  తిరుమలాంబ అన్యథా భావింపలేదుగదా -

రామభద్ర  లేదు లేదు. మృదుమనస్కులెన్నడును అన్యథా భావించరు

మోహనాంగి .  నా తండ్రియొక్క లోకోత్తర ప్రతాపమునకు, సునిశిత రాజ నీతిజ్ఞతకును, అత్యద్భుత కావ్యనిర్మాణ చాతుర్యమునకును నేనెప్పుడును ముగ్ధురాలనగుచుందును అష్టదిగ్గజకవులన్నట్లు నా తండ్రిగారు అవతార పురుషుడనిపించును.

ఇందీ వరంబులనీను క్రాల్గన్నుల

శరదిందుముఖులు చామరములు వీవ

పణినసూనుకణాదబాదరాయణ

సూత్రఫక్కి విద్వాంసులు పన్యసింప

మూరురాయర గండ పెండార మణి

మరీచిరింఛోలి గలయనావృతములగుచు

నం కపాళి నటద్దుకూలాంచలములు

చిత్రమాంజిష్ట విభ్రమశ్రీ వహింప

గనా తంత్రి సింహాసనము న ధిష్టించు

విధమునా కన్నులకు కట్టినట్లుండును

ఆ భువనేశ్వరదేవి శక్తిపీఠమును నెలకొల్పిన విద్యారణ్య శ్రీపాదుల పుణ్య దీక్షకు, శ్రీ విరూపాక్షస్వామి కనుతుదల ప్రసరించు చిరునవ్వు కాంతులకు నేను అబ్బుర పడుదును ! ఆ హంపీలో - హుఁ అదియొక స్వర్ణయుగము, అచటఁ బుట్టిన చిగురు కొమ్మైన చేవ - ముత్యాలముగ్గులూ, పూలతోరణాల ద్వారబంధాలూ, సూత్రపట్టినట్లూ వీధులూ, కేదారంపు కుల్యాంతరస్థలి నిద్రించు బాతువులూ, ఆ పుష్పలావికల వేళాకోళములు, రాజనాల బియ్యమూ, కృష్ణ బజారు, విరల బజారు మొదలైన బజార్లలో రానులుపోసి, కుంచాలతో నవరత్నాలు అమ్మిన వైనమూ - ఎన్నని చెప్పను ? విద్యానగరమునకు సంబంధించిన ఏ ఒక్క విషయమునూ నేను మరువలేకున్నాను.

గంగా	నీవేకాదు మోహన తిరుమలాంబ ! ఎవ్వరును మరువలేరు అందునా నీవా విద్యానగర చక్రవర్తి కుమార్తెవు - నేను ఆ నగరపు యువరాణిని నాకును హంపీని తలుచుకొన్నచో గుండె గొంతుకలోన కొట్టాడునో యమ్మా ! అయినను కాలపురుషుని లీలల కెవరు ఎదురునిలువగలరు ?

రంగాజమ్మ	ఏమైనను మీ ఇద్దరి అదృష్టమునకు నేను ఈర్ష్య చెందుచుందును

పళని	ఆఁ ఏమదృష్టములే! వారేమి కనకాభిషేకములు చేయించు కొనిరా?

రంగా	: కనకాభిషేకము మాట ఏమోగాని కృతులను మాత్రము అంకితము పుచ్చుకొనలేదు.

పళని	నేను కావ్యములను అంకితము పుచ్చుకొన్న మాటనిజమేగాని మహారాజుతో కలిసి నాటకములలో నటించలేదే ?

రంగా	ఎందుకు పళనీ నా వెనుకపడినావు ?

పళని	నేను వెనుకపడటమేమిటమ్మోయి ?

వెంగమాంబ	ముందే పడినదటలే రంగాజీ !

(చిన్న నవ్వులు) -

మొల్ల	ఎక్కడనట ? సాహిత్య సముద్రములోనా - మరి ఒడ్డుననా ?

రంగా	మొత్తముమీద గంగా తిరుమలాంబ లిరువురూ వదినా మరదళ్ళ వరుసయే

పలని	. చిత్రమేమనగా నిచట వదినామరదళ్ళ వరుసలు, అత్తకోడండ్ర వరుసలు, అప్పచెల్లెళ్ళ వరుసలు, తల్లీబిడ్డల వరుసలు, గురుశిష్యుల వరుసలు అన్నియు సమకూడినవి

గంగా గురుశిష్యుల వరుస ఎవరు పళనీ

పళని ఇంకెవరు రంగాజమ్మగారు గురువు నేను శిష్యురాలను కాదా?

రంగా ఆహా! వంగజామములు !

వెంగమాంబ నీకెంతసేపును రంగాజమ్మ మీదనే కన్ను
ఆ వరుసలేమో అర్థమగునట్లు చెప్పరాదా మాకు ?

పళని రఘునాథుని భార్యలుగా పరిగణింపబడు రామభద్రాంబా మధుర వాణులు రంగాజమ్మ కత్తెగార్లు కారా ?

వెంగమాంబ ఔనులేవమ్మా నీతో చాలలేమని ముందే చెప్పాముగదా

గోదా (11వ పాశురము చదువుతుంది)

మొల్ల గోదాదేవి ఈ పాశురమునకు అర్థము కూడ చెప్పినచో

గోదా దీని అర్థమిది
ఓ గోపబాలికా ! బంగారు తీగెవంటిదానా ! పుట్టలోనున్న సర్పము యొక్క పడగవంటి నితంబ ప్రదేశముకలదానా ! అడవిలో నున్న నెమలి వంటిదానా ! కన్నెలమందరము నీల మేఘశ్యాముడైన శ్రీకృష్ణుని గూర్చి పాడుచుండగా నీవు ఎంతకును నిద్రలేచి రావేమమ్మా ? అని

సరస్వతి (నవ్వు మొహంతో) - ఓహో చూడి కుడుత్త నాచ్చియార్ ! హృదయంగమంబైన పోలిక చెప్పినావు ? పుట్టలోనున్న సర్పము యొక్క పడగవంటి నితంబ ప్రదేశము కలకన్య అనియా ?

కలభా శ్రీ రంగ నాయకుల ఎన్నిక అయిన గోదాదేవి వర్ణనము సామాన్యమా దేవీ!

సరోజని — మనమిట్లు మాట్లాడుకొనుచునే యున్నాము మన ఎకసక్కెములకు వాగ్బాణపు విసురులకు ఏమాత్రము చలించక గిరిధర గోపాల ధ్యాన నిమగ్నమై యున్నదీ ఈ రాజస్థాన భూమండల ముక్తమణిస్థాయి మీరాబాయి, ఇప్పుడు తను రచించి పాడుకొన్న భజనలలో నొకదానిని పాడి - తోయజాత భవచిత్త వశీకరణై కవాణిని సేవించదా ఏమి ?

(మీరా పలకదు)

(ప్రక్క నున్న అక్కదేవి మృదువుగా మీరా భుజం తట్టును)

మీరా — (ఉలిక్కిపడి)- ఏమంటివి సరోజిని - ఆఁ [illegible]లనే భజించెదను (పాడుతుంది)

మొల్ల — మధురాతి మధురరసము ఒడ్డులొరసి మేరమీరి వెల్లువ అయి మాతో పాటు గీర్వాణిని సైతము ముంచివేసినదోయి మీరాబాయి

మధుర — వెంగమాంబా ! నీ కవిత్వము మాత్రము తక్కువ రసభరితమా?

సరస్వతి — ఊఁ సమస్యలివ్వమంటావా ? వెంగమాంబా !

వెంగ — అంతకంటేనా అమ్మా !

సరస్వతి — "నా రూపము చూచి లచ్చినగదె ఖగేంద్రా !"

వెంగ — ధారుణి నీటన్ మునిగిన

కారణమున దాని నెత్తు కార్యంబుననీ

ఘోరాకారము దాల్చితి

నా రూపము చూచి లచ్చినగదె ఖగేంద్రా

అంతా — భేష్ భేష్ బాగుంది.

సరస్వతి . (నవ్వుతూ) రెండవ సమస్య.

"శ్రీ విష్ణుండనగ నాకు సిగ్గగు గరుడా !"

మీరా ఆహా! ఏమి సమస్యలిచ్చుచున్నది దేవి - చిత్రముగానున్నవే

కలభా విష్ణుమూర్తి భయముతో పాటు వరాహవతారమున పొందిన సిగ్గును కూడ వివరించవలదా మరి ?

సుభద్రా నారీ నాదమువారు ఈ విషయమున ఏమందురో ?

మనోరమ పూర్తిచేయవమ్మా వెంగమాంబా !

వెంగ . ఆ వైకుంఠపురమ్మున కేవిధము
న వత్తు లక్ష్మి యొకసక్యముగా
నీవెవ్వడనుచు నడిగిన
శ్రీ విష్ణుండనగ నాకు సిగ్గగు గరుడా !

(అంతా ముసి ముసి నవ్వులతో గోదాదేవిని చూస్తారు ఆమె సిగ్గుపడుతుంది)

రంగా అమ్మరా ! ముద్దుల గుమ్మరా ! ముత్యాల సరమ ! రా ! శ్రీ కలాబిరుదుల చెలియ రావమ్మా?

లల్ల ఎవర్ని పిలుస్తున్నావు ? గోదాదేవి నా రంగాజి !

రంగాజి కాదు మన తిమ్మక్క నాయిక అయిన సుభద్రని పిలుస్తోంది

పళని అదమ్మా సంగతి సుభద్రా కల్యాణంలో వన్నమాట ఈ పిలుపులు ఆ! వేంగమాంబా ! మంచి మాటలు రెండు చెప్పు !

వెంగ ఏకాంత రాముడు వేంకటాచలాధీశుడై ఏడు కొండలపై నుండి కలియుగ ప్రజలను కాచుచున్నాడు కలౌ వేంకటనాయక :,

అన్నారు పెద్దలు శ్రీ వరాహ నరసింహస్వామియు ఆర్త రక్షణ పరాయణుడై భక్తులకు కొంగుబంగారమై వర్థిల్లుచున్నాడు వేదశిఖాధ్వనీన మరవింద సఖమ్ము అమరేంద్ర పూజితంబైన శ్రీనివాస దివ్య పాద యుగళమునకు మ్రొక్కి ప్రజానీకము ముక్తిపదమును పొందెదరు గాక -

అందరూ ఔను ఔను తరుణోపాయమును చక్కగా చెప్పితివి వేంకమాంబా!

కలభా అది సరే వారినీ వీరినీ కవిత్వము వినిపించుమనుచున్నదిగాని ఇదేమిటమ్మా ఈ సరోజనమ్మ తన కవితను వినిపించి అంబుజాసనురాణిని, భారతీమాతను అర్చించుట యెప్పుడట?

సరోజని ఎప్పుడని నన్ను ప్రశ్నించుచున్నావా కలభాషిణీ అయినచో నిప్పుడు మన ఇరువురకు పడినదే జగడము

కలభా (భయము నటించుచు) అమ్మయ్యో జగడమే? నేనెట్టులును ఓడిపోవుట ఖాయము అప్పుడు రాజనీతిజ్ఞవు ప్రపంచ ప్రఖ్యాత కవికోకిలవు అగ్రాసనముద్రాధికార పదవీ విలాసితవును అయిన నీవు వదలుదువా?

సరస్వతి (నవ్వుచు) - అయిన సరోజని నిన్ను కారాగారమున నుంచునా ఏమి కలభాషిణీ !

సరోజని అందనుమానమేమి దేవీ ! కలభాషిణిని తప్పక కరాగారమున నుంచవలసినదేగదా - నెరజాణయైన ఈ పెంపుడు రామచిలుకను నీవుగాని వదలితివి మహాదేవీ ! ఎవరైన నిట్లు, యధేచ్ఛగా విడిచిపెట్టుదురా ?

సరస్వతి ఔనౌను (నవ్వుతో) నీవు చెప్పినది నిజమే సరోజనీ !

కలభా జననీ ! నీవు ఎట్లర్థము చేసికొనినను నాకేమి భయము ?

ఎందుకనగా.

సరస్వతి . నా భుజాపంజరమే నీకు శ్రీరామరక్ష గనుక -

కలభా అట్లు చెప్పుము దేవీ ! (గర్వముగా చూచును)

సరోజని అమ్మయ్య కలభాషిణి కలకదిరినదిగదా - తల్లి భారతీ !

తటిల్లేఖా తన్వీమ్ తపనశశివైశ్వానరమయీం

విషణ్ణాం షణ్ణామప్యుపరి కమలానాం తవకళాం

మహాపద్మాటవ్యాం మృదితమలమాయేన మనసా

మహాంత : పశ్యంతో దధతి పరమాహ్లాద లహరీమ్

కలభా సరోజని! నీ బాంగిల్ సెల్లర్‌లో నుంచి రెండు పాదములు చదువుము

సరో Bangle Sellers are we
Who wear Our shining loads
To the temple fair
Who will buy these delicate bright
Rainbow colour circles of light?
Lustrous tokens of radiant lives
For happy daughters of happy wives

(అందరూ బావుందని తలలూపుతుంటారు)

2. Some are like fields of sunlit corn,
Meet for a bride on her bridal morn
Some like the flame of her marriage fire.
Or rich with the hue of her heart's desire.
Twinkling, luminous, tender and clear.
Like her bridal daughter and bridal tear

సరస్వతి (స్మితస్మేరముఖియై) - Sarojini, My Dear! I am proud of your excellent poetry.

(సరోజిని తల వంచి నమస్కరించి వెళ్ళి కూర్చుంటుంది)

గంగా మధురవాణీ ! సమరనిశ్శంకుడగు రఘునాధ నాయకుడు రచించిన రామాయణమును నీవు సంస్కృతములోనికి అనువదించితివి గదా ! అందలి శ్లోకములను చదువుము కనకాభిషేకమును గైకొనిన మొదటి స్త్రీవి నీవుగదా - నీ తదుపరి రంగాజమ్మయు పొందినదనుకొనుము. తండ్రీ కొడుకులైన రఘునాధ, విజయరాఘవులిరువురును మీ ఇరువురకు తమ తమ కాలములలో కనకాభిషేకము లొనర్చిన రసగ్రహణ పారీణులు

మోహనాంగి అవును తాను పాలించిన సువిశాలమైన రాజ్యముల కంటే ఖడ్గముతో జయించిన మహా విజయముకంటే ఏ చక్రవర్తియయినను తను పోషించిన లలిత కళల చేతను ముఖ్యముగా కావ్యముల నంకితము పుచ్చుకొనుట చేతను చిరకీర్తిని గడించును పృధ్విపైనా యా భాషలున్నంతవరకు సూర్య చంద్ర నక్షత్రములున్నంత వరకు వారి పేరు చిరస్థాయిగ నుండును.

కలభా నేనొక చిన్న సమస్య నిచ్చుచున్నాను పూరింపవమ్మా మధురవాణీ

మధుర అట్లే కానిమ్ము.

కలభా "కింతే సంతాన పాదపాయంతే" -

మధుర (నవ్వుచు) కతి కతి నక్షితి పతయః కింతే రఘునాధనాయకా యంతే, భువిబహవః కిలతరవః కింతే సంతాన పాదపాయంతే.

సభలో : బాగున్నది బాగున్నది.

వళని . ఆ ప్రాకృత సమస్యను గూడ పూర్తిచేయవమ్మా మధురవాణి!
అదే ఆ సమస్య - వర్ధ ఇవ రహుణాహరాయపాహోహి -

మధుర తెళ్ళోక్కొక్కసుహావహా - సుహాయరవి యయ రాహహంస
ఇణం దె ఇణి యతణూమం వర్ధయిరహుణా హరాయ పాహోహి-

మనోరమ ఈ ప్రాకృతము అర్థమగుట కష్టమే -

మధురవాణి . దీనినే సంస్కృతమున చదివెదనులెండు.
త్రైలోక్య సుఖావహా శుభకర విజయరాఘవ శశినం
దృష్ట్వా నిజతనూజం వర్థతే రఘునాథరాజ పాథోధిః

సరస్వతి చతురమధురవాణీం సమ్యగాకర్ణ్య యస్యాః
సదసి, మధురవాణీ వామదత్తంత్య యైవ
సరసకృతి విధాయాం సాధుమేధా విశేషా
స్వధిక పటుర శేషాః అంబుజాక్షీ సుసైషా

ఐరావతి వీణా వాదనమునందు అవధానములందు కూడ అశేష
ప్రజ్ఞాపాటవములు గల శేముషీధురీణవు గదా నీవు మధురవాణి!

చాతుర్యమేతి కవితాసుచతుర్విధాను
వీణాకలా ప్రకటనే భవతిప్రవీణా
ప్రజ్ఞామియం నిపుణమంచతి పాణినీయే
మేధాం వ్యవనక్తి బహుధా వివిధా వధానే

కల రామభద్రాంబా! ఇద్దరు రఘునాథులకూ అభేదం చెప్పు రాసిన
కవిత్వం విన్పించవమ్మా?

రామభద్రాంబ అట్లే కలభాషిణీ:

అధివేదితత్రమణి పీఠికాంతరే

హరినీలజాలరుచి హారిరోచిషమ్

కనకాంబరద్యుతి కటీ తటం

కరుణా రసోర్మిలకటాక్ష వీక్షణమ్

మృగనాభి చిత్రక మనోహరాననం

మణికుండ లాంచిత కపోలమండలం

అంతా (నవ్వుతారు ముసిముసిగా) -

లల్ల అహా! భర్తనీ భగవంతుణ్ణీ అభేదం చేసిరాసిందే రామ భద్రాంబ - అట్టి పురుషోత్తముడైన భర్తలభించటం ఎంత అదృష్టం -

కలభా రఘునాధాభ్యుదయమునించి ఇంకో శ్లోకం చదువుతావా?

రామభద్రా అట్లే

అధికశ్రియ మచ్యుతేంద్ర సూనుం
రఘునాధం రఘునాధ మేవసాక్షాత్

హృదయేకలయంతియే మహాంతః
పరమానంద భరాత్త ఏవధన్యా

ఆ రఘునాదుని ఆస్థానమున చోటుచేసుకొన గలుగుట నా అదృష్టము ఆయన లక్ష్మివిలాస భవనమున నెందరెందరు కవులకు సన్మానములు చేసెనో యెరుగరాదు మధురవాణికి కనకాభిషేకమును కూడ చేయించెనుగదా ఆ భూజాని.

మధురవాణి ఔను ఆ రాజసరసన వసియించిన కవిసమూహము యొక్క భాగ్యము చెప్పనలవికాదు

మాటలనేర్పులానరసమార్గము లాకొలువుండు రీతులా
పాటల గంధు లా కళల భాగ్యములా బహుదాన లీలలా
నాటకశాలలా యొకటనన్ వలదెన్నిట జూడనన్నిటన్
మేటియఖు కీర్తిలోలుడునుమీ రఘునాథనృపాలుడిమ్మహిన్

సరస్వతి ఏదీ - నీ సంస్కృత రామాయణము నుండి ఒక శ్లోకము చదువుము

మధుర చిత్తగించుము మాతా!

భవ్యం విహాయభరతో మణిముద్రికే త్వాం
సామ్రాజ్యపాలన మంజులతా ప్రకారే
పాదూద్వయం రఘుపతిం ప్రణయాద్వయాచే
కింనస్తునా మ్యహహ, తత్కవిలోపకారం

గంగాదేవి అష్టభాషా కవయిత్రీ! సంగీతకళాకుశలా! సాహిత్య సభా విరాజమానా! రామభద్రాంబా! నీవుకూడ రెండు సమస్యలైనను పూరించవలెను -

రామభద్ర కానిమ్ము గంగాదేవీ!

గంగా నీకిష్టమైన సమస్యయేలే

రా రాజని యచ్యుతేంద్రు రఘునాథనృపా!

రామభద్ర (సిగ్గుతో నవ్వుతో) - ఇది ఆనాడే సభలో పూరించితిని గదమ్మా

ఏరీ నీ సరిరాజులు -భూరమణులు నిన్ను చాల పొగడుదురుభళీ

స్వారాజనిరే రాజని రారాజని యచ్యుతేంద్రు రఘునాధనృపా

ముద్దుపళని బహుచక్కగ అతికినట్లు సరిపోయినదిలే గాని పాకృత సమస్యను మరల గుర్తుతెచ్చుకొనుమమ్మా

రామ - కానిమ్ము పళనీ! నేను సిద్ధము.

పళని : "రహుణాహుఖ్యతి చందిరో విహాఇ"

రామభద్ర ఇదీ పాతదేగదమ్మా!
పరిపుణ్ణ కళావొసోహమాణో, సేవాయిం సత్కుకణోచ్చ సెవ్వమాణి।
సహి ఎనచెంది -రహుణాహుఖ్యతి చందిరో విహాఇ

తిమ్మక్క . సంస్కృతమున కూడ -

రామభద్ర : పరిపూర్ణ కలాభిశోభమానః అభితః సత్కులనిత్య సేవ్యమాన
సఖిః యశ చంద్రికాఢ్యో - రఘువాధకీతి చంద్రో విభాతి

రంగాజీ శ్రీ రామభద్ర కరుణాకటాక్షలబ్ధ సారసారస్వత ప్రవర్ధమాన
శతలేఖినీ సమసమయ లేఖినీ యాష్టభాషా కల్పిత
చతుర్విధ కవితానుప్రాణిత సాహిత్య సామ్రాజ్య భద్రపీఠా
రూఢా! రామభద్రాంబా! బాగున్నదమ్మా!

కలభా మొల్లా! చమత్కారంగా వుంటుందే ఆ గుహుడి పద్యం - అదే
వాల్మీకంలో లేనిది రాశావు - దాన్ని విన్పించు

మొల్ల అట్లే
సుడిగొనిరా మపాదములుసోకిన ధూళివహించిరాయియే
ర్పడనొకకాంతయయ్యెనట పన్నుగనీతనిపాదరేణువి
య్యెడవడినోడ సోకనిదియేమగునో యని సంశయాత్ముడై
కడిగె గుహుండు రామపదకంజయుగంబు భయంబుపెంపునన్

మనోరమ చాలా చక్కగా వుందమ్మా మొల్లా ఈ పద్యం

సుభద్రా ఆంజనేయుడు శ్రీరాముణ్ణి వర్ణిస్తాడు చూడు ఆ
పద్యం

మొల్ల : వినాలనుందా సుభద్రాకుమారీ !ఇదుగో చదువుతున్నా ను

నీలమేఘచ్ఛాయబోలు దేహమువాడు

ధవళాబ్జ పత్ర నేత్రములవాడు

కంబుసన్నిభమైన కంఠంబు గలవాడు

బాగైనయట్టి గుల్ఫములవాడు

తిన్నని కనుపట్టు దీర్ఘబాహులవాడు

చక్కని పీనవక్షంబువాడు

పద్మరేఖలు గల్గు పదయుగంబులవాడు

ఘనమైన దుందుభి స్వనమువాడు

కపటమెరుగని సత్యవాక్యములవాడు

రమణి ! రాముండు శుభలక్షణములవాడు

ఇన్నిగుణముల రూపింపనెనగువాడు

వరుస సౌమిత్రి బంగారువన్నెవాడు

మహాదేవివర్మ : తేటతెనుగును చిన్ని చిన్ని సంస్కృతపదాలతో మేళవించి యెంతమధురంగా చెప్పావు మొల్లా !

మొల్ల : ధన్యురాలిని మహాదేవీ !

లల్లా : మొల్లా ! ఇందాక దత్తపది ఎంతబాగా పూరించావు

గోదా : మా కళ్ళముందు నారాయణమూర్తిని సాక్షాత్కరింపజేశావు మొల్లా !

అక్క : గోదాదేవికి ప్రీతిపాత్రమైన వర్ణన చేశావు.

మీరా : ఎందుకనో తెలీదు ఇంత అద్భుతంగా హృదయంగమంగా కవిత్వం రాయగల్గం. ఏ పనిచేసినా మనః పూర్వకంగా చేయగలం

కాని మన మీద అనుమానపు నీడ పడటం మానలేదు నన్ను ప్రజలెంత అనుమానించారో ఆ గిరిధర గోపాలునికే తెలుసు.

వెంగ — వాకూ నీ పరిస్థితే ఎదురయింది మీరాబాయి శ్రీకృష్ణదేవుడే సాక్షి ఆడపుట్టుక పుట్టడం కన్నా అడవిలో మానై పుట్టటం మేలేమో. మహాదేవివర్మ సైతం ఎంతబాధ పడింది. విమర్శలకి -

పళని — ప్రజల్లో సగభాగం వున్నమనం ఎందుకని సరిగా విద్యావంతులం కాలేదో నాకర్థం కాదు. తర్వాతైనా ఈ పరిస్థితి చక్కబడితే బావుండును.

సుభద్రా — ఆధునిక కాలంలో చక్కబడుతోందని విన్నాను

గంగ — తిమ్మక్క చెప్పిందిగా ఇంటిపనులతో సమయం దొరకటమే గగనమని.

రంగా — ఇంటిపనులు కావచ్చు బ్రతుకుతెరువు కావచ్చు తప్పదుకదా. వేద కాలంలోనే గొప్పగా చదువుకున్న వాళ్ళుండే వాళ్ళు గణితమూ, వేదమూ సరిసామర్థ్యంగా, నిర్వహించిన గార్గిమళ్ళీపుట్తే బావుండు - తర్వాత అభివృద్ధి చెందటం పోయి వెనకపడిపోయాం ఇది బాధాకరం ఆడపిల్లల్ని గర్భంలోనే హత్య చేస్తున్నారట ఈమధ్య ఇది మరీ బాధాకరం

గోదా — అన్నట్టు రంగాజీ ఈ సత్యలోకంలోనే ఆధునికుడైన ఒక కవి పేరు చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు అనుకుంటా ఎప్పుడూ ఒక పద్యం చెప్తుంటాడమ్మా

గోదా — చదువన్నేర్తురు పూరుషులుం బలెను శాస్త్రంబుల్ పఠింపించినన్

అదుమన్నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారముల్ నేర్పుచోన్

ఉదితోత్సాహము తోడ నేలగలరీ ఉర్విన్ ప్రతిష్ఠించుచో

ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్ - అని

అక్కదేవి ' అయన ఎంత చక్కగా చెప్పాడమ్మా. నిజానికి స్త్రీలు ఏ రంగంలోనూ వెనకపడరు పరికదా ముందుంటారు వాళ్ళకున్న శ్రద్ధాసక్తులు పురుషులకుంటయ్యా ? అంటారాయన. శారీరకంగా కొందరు స్త్రీలు బలంగా లేకపోవచ్చుగానీ వాళ్ళ మేధ అనన్యం

పళని అయ్యో అక్కమహాదేవీ నేర్పిస్తేనే కదాముద్దరాళ్ళు నేర్చుకునేది ఆ నేర్పించువాడే పురుషుడు శంఖంలో పోస్తేగానీ తీర్థం కాదన్నట్లు మనం ఎప్పుడూ ఆధారపడి బతికేవాళ్ళమే అవుతున్నాం ఆర్థిక స్వాతంత్ర్యం ఎంతవుందనీ సంఘంలో మనది రెండవ స్థానమే పైగా కుటుంబ బాధ్యతలూ పిల్లల్ని కనడం పెంచడం వీటితో సతమతమై పోతుంటిమి గదా సరే ఈ మాటలకేం గాని మళ్ళీ కవిత్వ చర్చలో పడదాం

మధుర రాజనిభాననా ! సరసురాలివె ? జబ్బుగనల్లినా వదే
మేజడ ?

రంగాజి ఇంతకంటె వలెనా ?

మధుర వలనొప్పిదిగించియల్లవే

ఓ జవరాల ! పనియున్నది దానితో

రంగాజి దోసము దోసమే మహా.

రాజగునట్టి యవ్విజయ రాఘవు మేన్ చిగురాకెమానినీ !

కలభా ఓహో ఏమి తంజపురి చమత్కారాలు తల్లి సరస్వతి చిరునవ్వు లొలికించుచున్నది

మనోరమ ఏదైన నాట్యప్రదర్శనము కూడ ఏర్పాటు చేయరాదా కలభాషిణీ! దేవి మరియును ఆనందించును

కలభా : దేవి పేరెందుకు ? నాట్యము చూడవలెనని యున్నదనరాదా తంబురాట్టీ! మళయాళదేశ నృత్యములైన కూడియాట్టం మోహినీ ఆట్టం మొదలగునవి ఇంకొకపరి తిలకించెదవుగాని ఇప్పుడు ఆంధ్రనాట్యమును చూడు- సిద్ధమా లకుమా ?

నరో · ఎవరమ్మా ఈ లకుమ ?

కలభా రెడ్డిరాజ్య కళారమణిహారమున చెన్నొందిన మణిపూస లకుమ.

భరతముని భోజదేవాది పండితోక్తు
ఎరసి యభినయ శాస్త్రంబుదరచి రచన
చేసె సుకృతి 'వసంత రాజీయ' మనగ
రాజ సుందరుడగు కుమారగిరిరెడ్డి

కుమారగిరిరెడ్డి లక్షణశాస్త్రం రాస్తే దానికి లక్ష్య ప్రాయంగా నృత్యం చేసేది లకుమ. కొండవీడులో గృహరాజు మేడపేరు వినగనే తలపునకు వచ్చునది లకుమాదేవి.

లకుమ · నా పరమాదృష్టము పండి రాజశిల్పి అయిన కుమారగిరిరెడ్డి కాలంలో పుట్టాను ఆయన అభినయ శాస్త్రానికి లక్ష్య ప్రాయనైవాను

"వేదానుద్ధరతే జగన్నివహతే భూగోళముద్బిభ్రతే దైత్యాన దారయతే
బలింఛలయతే. దశాకృతి కృతే కృష్ణాయతుభ్యంనమః
అనిపాడుతూనేనుదశావతారనృత్యంచేస్తే ముగ్ధుడయ్యేవాడాయన
అకలంకార్థ సహస్రధాభినయ విద్యాకౌశలీధామ ఈ
లకుమా దేవిహరి ప్రియా సదృశలీలా రూపనా స్థానలా
సికనా గాంచుచు నక్కు మారగిరి మత్రి నాట్యవేదార్థ సా
రకళా చర్వణ ధూర్వహత్వ మెనలారంగా వినోదించెదున్

చంద్రరేఖ : బాగు బాగు లకుమాదేవీ ! విజయరాఘవభూనాధ చంద్రుని ఆస్థానంలో నేనూ అట్లాగే నర్తించేదాన్నిలే మరి మా చక్రేవి గురించి చెప్పలేదే కలభాషిణి.

మాచల : 'నవలక్షధనుష్ధరాధినాథే పృథివీంశాసతి వీరరుద్ర దేవే 'అని ప్రశంసింప బడిన వీరాధి వీరుడైన ప్రతాపరుద్ర ప్రభువుకి కూర్చు నెచ్చెలిని. రాజనర్తకిని ఆంధ్ర దేశంలో ఆంధ్రనాట్యంలో నాతో సమంగా నర్తించే నర్తకీమణి అప్పట్లో లేదనేవారు కానీ - కానీ ఆ మహా సామ్రాజ్య పతనం నా కళ్ళతో చూశాను.గుండెలవిసేలా పరితపిల్లడంతప్ప ఏం చెయ్యగలిగాను ? ప్ప కాలోహిదురతి క్రమ :

(చంద్రరేఖ కూడా నిట్టూరుస్తుంది).

సరస్వతి : విద్యానాధ కవీంద్రుడైన అగస్త్యుడు చెప్పిన ఈ శ్లోకం నిత్య జాగృతమైంది గదా మాచలా !

యైర్దేశస్త్రిభిరేష యాతి మహతీం ఖ్యాతింత్రి లింగాఖ్యయా

తేషాం కాకతి రాజకీర్తి విభవై : కైలాస శైల : కృత :

తేదేవా : ప్రసరత్ప్ర సాదమధురాః శ్రీశైల కాళేశ్వర

ద్రాక్షారామ నివాసిన : ప్రతిదినం త్వచ్ఛేయ సేజాగ్రతు

మాచల : తల్లీ ! తల్లీ ! శారదా! కాకతి ప్రతాపరుద్రుడు ఎంత ధన్యుడు అగస్త్యుడని పేర్గాంచిన విద్యానాధుడు ఎంతధన్యుడు వారి చరిత్రని మళ్ళీ బతికించావు. నువ్వు బతుకమ్మవు. శరన్నవరాత్రుల్లో పూజలందుకునే దేవివి.

మోహనాంగి మా వాయనగారూ పెద్దనగారూ గుర్తుకొస్తున్నారు. వాళ్ళను చూస్తుంటే.

కలభా  విను మోహనాంగి ! అల్లసాని పెద్దనగారు దేవికి తాతగారు

ముద్దు  : దేవికి తాతగారా ? ఓహోహో ఆంధ్ర కవితా పితామహులు కదా- నిజమేలే, మనుచరిత్రం బందుకొను వేళపురమేగ పల్లకి తనకేలబట్టి యొత్తిన సహృదయశ్రేష్ఠుడు కవిరాజు శ్రీకృష్ణదేవరాయలు - ప్రాక్ప్రభువులు అభితః పరిమళిత యశః ప్రభవిష్ణులు, సుకవిజన సభాజన లీలారభటీ కాష్ఠానులు

కలభా  అట్టి ప్రభువులూ అట్టి కవులూ కలిసి మెలిసిన ఆ సుందర దృశ్యం అమ్మవారికెంతో ఇష్టం. కవిత్రయంవారికీ చాళుక్య, చోళ, కాకతి, రెడ్డిరాజులతో వున్న మహత్తర సంబంధం ఎట్లాంటిది తల్చుకుంటే ఒడలు పులకరిస్తుంది. సాహిత్య ప్రయోజనం ఏమిటంటే మనను రసార్ద్రం కావటం బ్రహ్మానంద సబ్రహ్మచారి అయిన ఆనందం కలగటం రసానందపూరితమైన మనస్సులోకి క్రూరపుటాలోచన రమ్మన్నా రాదు ఇందాక మోహనాంగి అన్నట్లు ద్రావిడ దేశస్థుడైన అప్పయ దీక్షితులు తెలుగుదనాన్ని ఎట్లా మెచ్చుకున్నాడో వింటే ఆశ్చర్యంగా వుంటుంది.

ఆంధ్రత్వమాంధ్ర భాషా చాప్యాంధ్ర దేశ

స్వజన్మభూః తత్రాపి యాజుషీశాఖానాల్పస్య

తపసః ఫలమ్ - ఎంత మంచి మెచ్చుకోలు తెలుగుకి

రంగాజమ్మ : అంతేకాదు తమిళకవి సుబ్రహ్మణ్య భారతి జాతీయ సమైక్య పద్ధతిగా ఎట్లా చెప్పాడో చూడు కలభాషిణీ.

"సింధునదికి ఇన్ని శైనిలివినిలే

శేరనన్నాట్టిళం పెర్గాకుడనే

సుందర తెలుంగినిల్ పాట్టిశైత్తు"

। శారదా విజయం ।

తిమ్మక్క : చక్కగా చెప్పాడు సుబ్రహ్మణ్యభారతి - భారతదేశంలోని కొన్ని ప్రాంతాల అందం స్ఫురింపజేసినాడు, సింధునది ప్రవాహాల్లో సహజ సౌందర్య భాసితలైన కేరళదేశ సుందరీమణులతో సుందరమైన సుమధురమైన తెలుగుపాట పాడుకుంటూ నౌకా విహారం చెయ్యటం - ఎంత చక్కని భావన.

లకుమ : పూర్వ కవులు ఎంత బాగా చెప్పారు !

పలుకు పలుకునఁ బ్రజలతో చెలిమిగలిపి

తెలుగుపై గల మమకార మలవరించి

మలపు మలపున దేశాభిమాన పరత

దేర్చి చూపిన నూత్న సందేశమద్ది

మాచల : బాగా చెప్పావు లకుమా! ప్రతాపరుద్రుణ్ణి తలచినంత మాత్రాన నా మనస్సు ఉప్పొంగి పోతుంది సుమా-

తెలుగు చరిత్రలో రసము దేరిచిచూచితిమేని జీవనా

ధుల నుబికించి ధైర్యపు ముడుల్ బిగియించి

బలమ్ము బెంచి యాం

ధ్రులమనిపించి ముందడుగు త్రోసెడి శక్తులు కాకతీశునం

దలవడి యాశతాబ్దపు మహత్తకనుంగవనొత్తియాడదే

గంగా ఔను మాచలదేవి! ప్రతాపరుద్రనరేశ్వరుని ఏలుబడిలో ఓరుగల్లు నందంతటా జాగరిత వైభవమేకదా - నేనూ ఆ మహారాజు పుత్రిక వంటి దానినే నా చిన్నప్పుడే ఢిల్లీ సేనలు ఓరుగల్లును ఆక్రమించుకున్నవట. అప్పుడు ఆంధ్ర దేశానికి జరిగిన అపకారం అంతా ఇంతా కాదు. ఒక భయావహమైన పరధర్మ ముద్భవించగా

అన్నయ మంత్రి పసిపిల్లగానున్న నన్ను తీసుకొని ఎట్లెట్లో వీదరు చేరెనట అక్కడ రహస్యముగా నాకు కవిత్వ చిత్రలేఖనాది విద్యలను నేర్పి కుమారకంపరాయల కందోయికి అమృతవర్తినిగా నన్ను మలచగలిగిరి నా భర్తను మధురా విజయము చేయు నట్లాదంబరజేసితిని నన్ను పెంచిన వారి ఋణమును కొంతైన తీర్చగల్గితిని

కలభా ఆనగా కాకతీయుల ఇంట పుట్టిన రాచనిసుగు హంపీనగరమున కంప రాయలకు రాణియైనదన్నమాట.

మాచల రెండు రాజవంశములకు అనుసంధానకారిణియన్న మాట గంగాదేవి

తనివారంజూలుకించెవాఙ్మయ సముద్రం బెవ్వడెవ్వండుపా
యని దీక్షన్ గవితా తపస్సు గొనె విద్యానాధుడా తండగ
స్త్యుని పేర్గన్న కవీంద్రుడున్ రసమురాసుల్వోసి శ్రీవీర రు
ద్రుని లోకోత్తరకీర్తిపాడుకొనలేదో భారతీగీతిగన్ -

సరస్వతి సమస్త భారతదేశమునకు,సర్వ ప్రపంచమునకు క్షేమము కలుగ వలెను మాచలా, లకుమా, చంద్రలేఖా ఏదీ మీ నృత్యము .. కృష్ణశాస్త్రి పాటతో జయము పలకండి.

ముగ్గురూ (జయ జయ జయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి అభినయిస్తారు).

రామభద్ర బావుంది విజయరాఘవుని జన్మమును గురించి రచించిన పద్యమును వినిపించు రంగాజీ.

రంగా : అట్లే

తీవి విజయాఢ్యు సుతుని వేడితిని గనుక
లీలమెయి రాఘవునిగ గొల్చితిని గనుక

| శారదా విజయం |

విజయ రాఘవ నామంబు వెలయదాల్చి
వెలగి వెయ్యేళ్ళు పుడమి రక్షింపుమందు
(అంటూ నిట్టూరుస్తుంది).

గోదా . ఏమైంది రంగాకు....

రంగా ఏం లేదమ్మా - ఎటువంటి తంజావూరు చివరికెట్లయింది అని నా బాధ.

రామభద్ర ఔను ! కృష్ణరాయ మహీశు నెడబాటు చీకట్లు
ముసరి దిక్కుల తోడ మసలువేళ
భూరి వాఙ్మయ లక్ష్మిదారి బత్తెముతోడ
తంజాపురము వంక తరలువేళ
వేంకట కవి తెన్గుపంకేరుహాక్షికి
శ్లేషోక్తులలవాటు సేయువేళ
మువ్వగోపాల దేవుని పూజసేయ
ఘనుడు క్షేత్రయ్య కలమందు కొనిన వేళ
అపరరాయలు రఘునాథ మనుజవిభుడు
కట్టుకొన్నాడు సత్కీర్తి కుట్టిమంబు - అంటారు జాషువా గారు

కలభా . కాల మహిమ ఎరుగని వారు కారుగదా కవయిత్రులారా ! ఊరడిల్లుడు

మధుర అంతే చిట్టచివరికి ఈ ఊరడింపే గదా మిగులునది. శమముస్థాయీ భావముగా శాంతము రసముగా పర్యవసానము, కలభాషిణీ రఘునాథుని నేనును కీర్తించవచ్చువా ?

కల . తప్పక - పాటలో కీర్తించరాదా .

లకుమ మేము నృత్యము చేస్తాము.

మధుర . రఘునాథ నృప కుంజరా ! స్వామి రతిరాజ సమసుందరా !
రసికావతంస ! నీ పేరు తలచినంత మేనంత పులకింతలొరా !
సంగీత సాహిత్య సమరాలన్నిటిలోన
నీ సాటి ఎవరురా ! వీరాధి వీరా !
నీ కొలువులో వెలుగుటొక వరము గాదా
రాజాధిరాజ ! అవధారుని వీరగాథా ! చోళగసంహార
నీకు తోపూరు నేపాలు జోహారు చేసెరా
జగ్గరాజుతో పోరు రాజ భక్తులతీరు
అభినవ రఘునాథ - అకళావతి నీ సీత
కవిజన మందార ! నీ కనుసన్న చేమకూర
విరియించినాడురా విజయ విలాసాలు
ఏ రాజు పోషించెరా ప్రభూ ! వనితలను సభలోన
నీకెంత ఋణపడినదో స్త్రీ జాతి తన ప్రతిభతోన
చంద్రరేఖా దేవి నాట్యవిలాసముతోడ
చెంగల్వ కాళయ్య చమత్కారము లొలుక
లక్ష్మీ విలాసమాయెరా ! నీ ఇందిరా మందిరము
ధన్య ధన్యమ్మాయెరా ప్రభూ ! మా మనో మందిరము
రఘునాథ మేళగా రూపొందినది వీణ నీవలన
రసరాజ్య మేలుకొన్నదీ మధురవాణి ప్రజ్ఞాధురీణ
కనకాభిషేకాన చెలువొంది నీ వలన
రఘునాథ నృపకుంజరా ! స్వామి ! రతిరాజ సమసుందరా !

నీ బాహుపురిలోన కులికినది తంజపురి
నాయక రాజన్య ! కవితా సౌజన్య !
రాజన్న నీవురా ! ప్రజలపాలింప
రాజన్న నీవురా విజయాలు పొంగింప
రాజన్న నీవురాకళల లోకాల వెలిగింప
రాజగోపాల దేవ చరణ కమలాలు సేవింప
రఘునాధ నృపకుంజరాస్వామి . ...

లల్ల మధురవాణీ నర్తకీమణులూ కూడా ధన్యులయ్యారు

నాగరత్నం రాణి గంగాదేవీ ! ప్రారంభించవా నీవా గమ్మత రఘురిని కాళిదాసుకి ప్రచ్ఛన్న శిష్యురాలివంటారు గదా నిన్ను

త్రివేణి విననౌకౌతూహలంబయ్యేడున్

గంగా ఏ శ్లోకం వినిపించను

నాగరత్నం నాగర్థావివ సంపృక్తౌ లాంటి శ్లోకాన్ని మారురూపంలో రాశావే దాన్ని వినిపించు.

గంగా స్రష్టుః స్త్రీపుంస నిర్మాణ మాతృకా రూప ధారిణౌ
ప్రపద్యే ప్రతిబోధాయ చిత్ప్రకాశాత్మకౌ శివౌ

సరోజిని మీ మామగార్ని గురించి రాశావే అవ్వి చదువు.

గంగా . మామగార్ని గురించా? తప్పక చదువుతాను.
ఆశీత్సమస్త సామన్తమస్త కన్యస్త శాసన :
బుక్కరాయ ఇతిఖ్యాతో రాజాహరిహరానుజః

తిగ్మాంశోరపి తేజస్వీ శీతాంశోరపి శీతల :

సాగరాదపి గంభీర : సుమేరోరపియ : స్థిర :

లల్లాదేవి — మామగారంటే ఎంత గౌరవమోకదూ నీకు గంగాదేవీ ! ఎంత అదృష్టం చేసుకుంటే అంతమంచి మామగారు లభిస్తారు.

మహాదేవివర్మ — అదే నేనూ అనబోతున్నాను సుమా లల్లాదేవీ !

సరోజిని — ఆమాట నేను మాటికి నూరుపాళ్ళు బలపరుస్తున్నాను

సుభద్రా — రాజకీయపు పరిభాషవచ్చిందండోయ్ చూశారా సరోజినీనాయుడు అధికారోహల.

సరోజిని — ఎంత ఆటపట్టించినా నేనేం జంకనమ్మోయి ! సరేగాని రామభద్రాంబా! చంద్రరేఖ నాట్యాన్ని గురించి నీ అభిప్రాయం చెప్పావుకాదు.

మధురవాణి — ఇందిరా మందిరంలో చంద్రరేఖ అభినయానికి మురిసిపోయి ఒక శ్లోకం చెప్పావుగా అశువుగా రామభద్రాంబా ! దాన్ని కాబోలు అడుగుతోందావిడ

రామభద్ర — అదే చదువుతున్నా

అదాహతాయాం ప్రతిసీరికాయా మాలక్ష్యమాణా హరిణాయతాక్షీ

సాంధ్య ప్రభాసంస్థగనే నసద్యః సాక్షాత్ప్రలోవాజని చంద్రరేఖా

మనోజ్ఞ ముక్తామణి కంకణ ప్రభాభరేణ సాకంప్ర సవాంజలింపురః

ఆదాత్తదా నాట్యకళాధి దేవతా మనోహరారూపవతీవమానినీ

లల్ల — రఘునాథాభ్యుదయం నించికూడా ఇంకో శ్లోకం విన్పించు రామభద్రాంబా !

రామభ   చినచెవ్వయభూప శేఖరేణ ప్రథితే
నాచ్యుత భూమి పాలకేన
మకుటాభరణా మమైవవంశ్యా
రఘునాధక్షితినాధ రక్షితాస్తే

మొల్ల   . తేనె సోకినంత తేలికగా అర్థమవుతున్నది రామభద్రాంబ కవిత్వం సంస్కృతంలోకూడా తెలుగులో లాగా యతిప్రాసలు పాటిస్తున్నావు బావుంది.

పళని   · కానీ గంగాదేవి సమస్య .

కలభా   . గంగాదేవికి సమస్యకూడా ఇచ్చి అవధానం చేయించమని కాబోలు పళని ఉద్దేశం.

రంగాజీ   రాణిగారికి ఆ మాత్రం పరీక్ష కావాల్సిందేగా

వెంగ   ఇందాకట్నుంచీ ఎద్దెమంటే తెడ్డెమన్నారు ఇప్పుడేమో తాన తందనానా అంటున్నారే ఈ గురుశిష్యులు.

త్రివేణి   (నవ్వి) కానీండమ్మా గంగాదేవి కవిత్వం విందాం.

పళని   నిర్దోషా హ్యగుణాఃవాణీ నవిద్వజ్జనరంజనీ

గంగ   పతివ్రతా హ్యరూపా స్త్రీ పరిణేత్రేనరోచతే

కృష్ణాజీ   రక్కుమని పూరించావు గానీ గంగాదేవి స్త్రీకి పాతివ్రత్యం కన్నా సౌందర్యం మిన్న అంటావా ఏమిటి ?

గంగా   తొందరగా పూర్తిచెయ్యాలని ఆ మాట అనేశానేకృష్ణాంబా ! అయినా మనం రస పిపాసువులం సౌందర్యాభిమానులం అవటం చేత పోనీలే ఏదో పొరబాటు.

మధుర కృష్ణాజీ అప్రస్తుత ప్రసంగం చేపట్టినట్లుంది వర్ణన నేను తీసుకుంటాను గంగా ! వసంత ఋతువుని వర్ణిస్తావా ? అందులో వనలతలు స్త్రీలు కావాలి సుమా -

గంగ అధిగతాధిన వార్తవ సంపద :
స్తబక సంజని తస్తన విభ్రమా :
భ్రమర కాముక సంవనన క్షమా :
వనలతా లలితాదధిరేదశామ్

పళని అహా! గంగా! వాణీ పాణి పరామృష్ట వీణానిక్వాణ హారిణి సుమా నీ వాగ్లహరి

గంగ పొగిడేస్తున్నావు పళనీ ! ఏమిటి సంగతి కానీ

పళని సమస్య....

గంగ ఇవ్వుమరి అలస్యం దేనికి?

పళని "శ్రుతి విషయాః పతితై : కరోతి మైత్రీమ్"
జలక్రీడా సమయాన్ని వర్ణించాలి

రంగాజీ సమస్యా పూరణంలో వర్ణ్య నిర్దేశాలేమిటో నాకు అర్థం కావటం లేదు ఇందాకట్నించి చూస్తున్నాను.

గంగ సామర్థ్యం మరింత ప్రకటితం కావటం వాంఛనీయమేగా
విహృతిరయ పరిచ్యుతాన్ వతం సా
నహి తదృశామను దధ్రుహి : ప్రవాహ :
నహిజడిమ సమన్వితో ఏకో పి
శ్రుతి విషయాత్ పతితై : కరోతి మైత్రీమ్ -

అసలు అవధాన కళానిపుణురాలు రంగాజీ అయితే ఏమిటో నాచేత అవధానం చేయించారు.

సరస్వతి . శ్లేషతో కూడా పూరించావా గంగా ! నీ ప్రతిభ శ్లాఘనీయం.

గంగ . ధన్యురాలిని తల్లీ !

మధురవాణి కవికుల తిలకుడైన కాళిదాసు శ్లోకాలకి ఎంత బాగా మెరుగులు దిద్దావు గంగాదేవీ !

రంగాజీ . కాళిదాసు పురుషుడై సరస్వతిని నేను కాలేక పోతినే అని స్త్రీ వేషంతో సాక్షాత్తు గంగఅయి శ్లోకాలని వ్రాసినాడన్నట్లుంది

గంగ ఏ గతి రచించిరేని సమకాలము వారలు మెచ్చరేకదా' అని చేమకూర వెంకటకవి అన్నారు. సమకాలము వారు కాక పోయినా సమసభాస్థాన తేజస్వినులు మీరంతా నా కవిత్వాన్ని ప్రశంసించారు. అది మీ సహృదయానికి నిదర్శనం

చంద్రరేఖ . ఒక విషయం కలభాషిణి అనుమతితో చెప్తాను ఇందాకట్నించీ వెంగమాంబని యోగినివి యోగినివి అంటున్నారు అందరూ, ఆవిడ శృంగార రసాధి దేవత అయిన శ్రీకృష్ణునికి భక్తురాలు, ఆయనే వచ్చి రాయించుకున్నాడంటూ వెంగమాంబ శృంగార వర్ణన చేసింది తెలుసునా.

వెంగ (నవ్వుతూ) ఔనమ్మా నిజం

శృంగారాకృతితోడ వచ్చి పదముల్ శృంగార సారంబుతో
దన్ గూఢంబున జెప్పనీవనిన నట్లే చెప్పలేనన్ననన్
ముంగోపంబున జూచియటనే మ్రొక్కంగ మన్నించి త
చ్ఛృంగారోక్తులుతా నెపల్కి కొనునా శ్రీకృష్ణు సేవించెదన్

కలభా : ఈసారి సభలో రంగాజీ అవధానమే - (నవ్వి) చంద్రరేఖ మా బాగా చెప్పింది. రాజస్థానమునకు మీరాబాయివలె ఆంధ్ర దేశమునకు ఆణిముత్యమువంటి దానివి దొరికినావనుట నిక్కము. శ్రీకృష్ణుడు నీతోమాట్లాడుతుంటే నీ వదినలు పరపురుషునితో మాట్లాడుతున్నావని నిందించటం తర్వాత నిజం తెలుసుకుని చెంపలు వేసుకోవడమూ తెలుసులే

మీరాబాయి : ఆధునికహిందీ శ్రేష్ఠకవయిత్రీ! మహాదేవివర్మా! నువ్వు ఛాయావాద కవయిత్రివిగదా ఏమేమి రచించినావో నీ సంగతి ఏమిటో చెప్పు.

మహాదేవివర్మ సరస్వతీ సభలో విరాజిల్లగలగడంనా పూర్వజన్మ సుకృతం అనుకుంటాను. కవయిత్రివని నువ్వే అన్నావుగదా మీరా నిబంధకారిణిని కూడా - చాలా వ్యాసాలు రాశాను రేఖా చిత్రకారిణినికూడా.

అక్కదేవి భారతదేశ ఉత్తర ప్రదేశం నిన్ను ప్రభవించి ధన్యమైంది మహాదేవి

గోదా నీ పుట్టినిల్లు గొప్ప పండిత వంశమని విన్నాను

అక్క . ఆఁ పండిత వంశమేకాదు వైష్ణవ వంశంకూడా గోదా ! నీకు పరమ ప్రీతిపాత్రమైన వైష్ణవం -

గోదా నన్ను వేళాకోళం చేస్తున్నదే అక్క మహాదేవి

ఇరావతీకార్వే మహాదేవి వర్మ పుట్టినిల్లు సంస్కృత వాతావరణంతో విలసిల్లేది సంస్కృతభాష అసంకల్పితంగానే మహాదేవికి సుసాధ్యమైంది. సంస్కృతంలో స్నాతకోత్తర తరగతుల్లో నిష్ణాత అయింది ఆమె. స్త్రీల కళాశాలకి అధ్యక్షపదవి ననుష్ఠించింది. ఎన్ని రచనలు చేసిందో చెప్పలేము తల్లి సరస్వతి అంశలు ఆమెను ఎన్ని చెందినయ్యో లెక్కలేదు భారత ప్రభుత్వం చేత ఎన్నో సాహిత్య

పరిషత్తుల గౌరవ పురస్కారాలను పొందింది 'విశిష్ట సాహిత్య సేవా పురస్కారంగా జ్ఞానపీఠ్ బహుమతిని పొందింది. అయినా లౌకిక సుఖజీవన వంచితురాలైన మహాదేవికి ఉపేక్షాభావమే ఆధ్యాత్మికతలో ఉన్నత శిఖరాల నధిరోహించింది ఈమె. నీర్ భరీ దుఃఖ్ కీ బదలీ మై అని రాసింది.

మొల్ల జ్ఞానపీఠమంటే ఏమిటనలూ ?

రంగా మన కనకాభిషేకం లాంటిదేమో.

రంగాజీ మహాదేవీ ! నీ కవిత్వం గురించి ఇంకొంత చెప్పుదువా ?

మహాదేవి రంగాజమ్మా ! మా పద్ధతి అంతా నవీనం కథా కథన పద్ధతి మీలాగా ప్రౌఢ దీర్ఘ ప్రబంధాలు రాయటం దాదాపుగా తగ్గించేశారు దైనందిన జీవితం నించీ ఒక సంచలనాత్మక సన్నివేశం తీసుకుని కేవలం వాడుకభాషలో కథగా రాస్తున్నారు. నేను గంభీర విషయాల్ని రాశాను. వేదనాత్మకంగానూ రాశాను ఉదాసీనవైఖరి నిర్లిప్త ధోరణి ఉటిపడతాయంటారు నా కవిత్వంలో.

కృష్ణాజీ అదే త్రివేణి చెప్పింది నవల అనే కొత్త పద్ధతి వచ్చిందని కథ కూడా అట్లాంటిదే. కొత్త ప్రక్రియ కాబోలు. పాండిత్యం ప్రదర్శించకూడదుట కదా .నవల రాసేటప్పుడు గ్రాంథిక భాషరాస్తే నవ్వుతారట పూర్వం వాడుకభాష రాయడం మహాపరాధంగా భావించేవాళ్ళు. కాలం మారుతుంటుంది గదామరి.

మహాదేవి నా కథలు నచ్చాయని నన్ను కలుసుకున్నారు ఇందాక మీరు చెప్పిన విశ్వనాథ సత్యనారాయణగారు అందుకు చాలా సంతోషించాను ఆంధ్రులకీ నా కథలు నచ్చినయ్యని

చంద్రరేఖ సుభద్రాకుమారి ! దేశభక్తి రచనలు చేశావని విన్నాను

సుభద్రా : ఔనమ్మా - విదేశీయుల పాలనలో మాతృభూమి తల్లడిల్లుతున్న వేళలో రచయితలము కవులమూ పూర్వ వీరగాథల్ని తవ్వి ప్రజల్ని ఉత్తేజ పరచడం ఒక లక్ష్యంగా పెట్టుకున్నాము. అన్ని రాష్ట్రాల రచయితలూ ఇందుకు తమ శక్త్యనుసారం దోహదం చేశారు.కొందరు మూఢాచారాల్ని నిర్మూలించి నవసమాజ స్థాపనే ఉద్యమంగా చేపట్టారు. ఇవన్నీ స్వాతంత్ర్య సముపార్జనలో భాగాలే. అందుకనే ఝాన్సీకీరాణి మొదలైన దేశభక్తి రచనలు చేశాను అమ్మవారిదయ ఎంతో అంతే రాయగల్గాను

బెంగుళూరు నాగరత్నం : ఏదమ్మా ! కవితలూ రాశావనుకుంటా ఒకటి చదువు తావా ?

సుభద్రా తప్పకుండా 'మేరా నయా బచపన్ చదువుతాను. నాకంటే మహా దేవివర్మ ప్రతిభ అనన్య సామాన్యం సుమా

కలభా ఔనమ్మా నవీన స్త్రీలోక గర్వకారణం మహాదేవి

సరో : మహాదేవివర్మా హాజ్‌బీన్ ట్రీటెడ్ యాజ్ యె ఫీమేల్ ట్రానింగ్ ఇన్ హిందీ లిటరేచర్.

త్రివేణి సుభద్రాకుమారీ చౌహాన్ ! పేరులోనే వీర స్త్రీత్వమున్నదే నీకు. ఠాకూర్ లక్ష్మణ్‌సింగ్‌గారి ధర్మపత్నివిగదా నీ సాహిత్య వ్యాసంగానికి మీవారి అండదండలుండేవా ?

సుభద్రా తప్పకవుండేవి. ఆయనా నేనూ ఇద్దరం కలిసి సత్యాగ్రహంలో పాల్గొన్నాం చెరసాలకి వెళ్ళాం. దేశ స్వాతంత్ర్యం కోసం అహరహం పరిశ్రమించాము ఝాన్సీకీ రాణి మొదలైన దేశభక్తి పూరిత వీరత్వ ప్రతిపాదక గ్రంథాలు రాయటం జరిగింది. అందుకే విప్లవాత్మక రచయిత్రి అన్నారు నన్ను

ఇరావతి : ఏదమ్మా ! సుభద్రాకుమారీ ! నీ ఝాన్సీకి రాణీ నించి రెండు పంక్తులు.

సుభద్రా రాజ్ వంశోవే భృకుటీ తానీథీ
ఖూబ్ లఢీమర్దానీ వహ్ తో
ఝాన్సీవాలీ రాణీ థీ

మహాదేవి మేరానయా బచ్‌పన్ అనే గీతం రాశానన్నావు కదా చాలా ప్రశస్తి పొందిందిటగదా- ఆ గీతం

సుభద్రా ఔను కొత్తబాల్యం మళ్ళీ మళ్ళీ రావాలనే నా ఆశ
బార్ బార్ ఆతీహై ముఝ్‌కో మధుర్ యాద్ తేరీ

సరస్వతి సుభద్రా కుమారీ! భారత్ స్త్రీకీ పూరీ
సమాజ్ ప్రతినిధీ ! సదా ధన్యహో

కలభా భారత మధ్య ప్రదేశ మకుటాన విరాజిల్లే కలికితురాయీ సుభద్రాకుమారీ నీ సేవ దేవికి నచ్చింది.

సరస్వతి ఇరావతీకార్వే! అన్నా సాహెబ్ మహర్షికి కోడలివై సంస్కృత భాష యొక్క అందచందాలను అలవోకగా హస్తగతం చేసుకున్నావు గదా

కలభా ఏం రాశావో చెప్పు.

ఇరావతి మహా భారతం గురించి రాశాను స్త్రీ శక్తి నిరూపణ చేశాను మహా భారత కథ జరగటానికి అంబకారణం గంగ కారణం ఇట్లా విశ్లేషించుకుంటూ వెళ్ళాను. మరాటీ సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణ కృషిలో నా వంతు నేను నిర్వర్తించాననుకుంటున్నాను సంఘ సంస్కర్తగానూ జనం నన్ను కీర్తించారు తల్లీ ! అంతా నీ కరుణ

సరస్వతి : మహారాష్ట్ర దేశ సాహిత్య సౌధానికి సుకుమార ముత్యాల జాలరులు సమకూర్చావు ఇరావతీ ।కాశ్మీరంతో సహితంగా సమస్త భారతదేశమంతటా విరాజిల్లే కళాస్వరూపులు నా బిడ్డలు వారి ప్రదర్శనంతో ఆనందం కలిగింది అన్నమయ్య పాటనింకొకసారి వినిపించు తిమ్మక్కా !

తిమ్మక్క రామచంద్రుడితడూ రఘువీరుడూ (పాడుతుంది)

(అన్నమయ్య పాటవిని అందరు పరవశింతురు )

కలభా శ్రీశైల చెన్నమల్లికార్జున పదపద్మబంభరాయమాణా ! భక్తశిఖామణీ మకుటాయమానా ! అక్క మహాదేవి ! నీ వచనములను కొన్నిటిని వినిపింపుము

అక్కదేవి చేటీ భవన్నిఖిలఖేటీకంబవనవాటీషు నా కవటలీ

కోటీరచారుతరకోటీ మణీకిరణకోటీ కరంజితపదా

పాటీరగంధి కుచశాటీ కవిత్వపరిపాటీ మగా ధిపనుతా !

ఘోటీకులావధిక ధాటీ ముదారముఖవీటీర సేన తనుతామ్

నేనేమి ప్రముఖ కవయిత్రినా కలభాషిణీ ! వచనములను రచించుటయు నొక గొప్ప యందువా ?

కలభా ఎంతమాట - "గద్యంకవీనాంనికషంవదంతి" వాక్యం -, రసాత్మకం కావ్యమ్ పద్యము వ్రాయుట కన్న వచనము రచించి మెప్పించుట కష్టము సుమా-

అక్కదేవి సరే నీ ఉత్సాహము నెందులకు కాదనవలె, తెలుగున కనువదించి చదివెదను

మావారు నాకు భస్మమలది యలంకరించి నన్ను నీకై పెండ్లి కూతునుచేసి మీదుకట్టిరి చెన్నమల్లికార్జునా !

నీవేనా నాథుడవు. భూలోకరాజు లెందరు నన్నువలచి బలవంతము చేసినను నీదాననైన నేను వారినెట్లు వివాహ మాడుదును చెన్నమల్లిఖార్జునా

గంధము చెక్కను, నరికికోసి అరుగదీసిన

నొచ్చితినని తన సువాసనను వదలునా ?

చొక్కపు బంగారమును ముక్కలుగా జేసి కాచిన

నొచ్చితివని నలుపు బట్టునా ?

చెరుకును తునకలు తునకలుగా నరికి

గానుగలో నలిపిపాకు చేసిన చక్కరయై

కనలితినని తనతియ్యదనమును విడుచువా ?

నే మున్నుజేసిన లోపములను దెచ్చి

నా ముందుంచిన హానియా నీకు తండ్రి

చెన్నమల్లికార్జున దేవా ! నీవు

నన్ను చంపినను శరణనుట మానను

కేదార స్యోదకేపితే వారాణస్యాం మృతేనతి

శ్రీశైలశిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే

ఉపమాతీతులు రుద్రగణములు

వారు నా బంధుబలగము

మా శ్రీశైల మల్లికార్జునుడు వలచిన
మరల నేనిటురానమ్మా తల్లీ !
రత్నపుసంకెళ్ళైననుబంధనముగాదా
ముత్యాలవలయైనను బంధనముగాదా
బంగారుఖడ్గమైన తలనరికినదావడా ?
లోకభజనయందు చిక్కుకొనిన
జనన మరణము తప్పునా చెన్నమల్లిఖార్జునా
అమాయకుండని నమ్మకుము
జగద్విఙ్ఞాని చతురుండతడు
బాణ, మయూర కాళిదాస ఓహిల
ఉద్భట మలహణులకిచ్చిన విధమే వేరు
ముక్తిని జూపి భక్తిని మరపించును
చెన్నమల్లికార్జునుడు.
జంగమము నా ప్రాణము జంగమము నా జీవము
జంగమము నా పుణ్యఫలము
జంగమము నా నిధి విధానము
జంగమము నా హర్షసీమ చెన్నమల్లికార్జునా !

వెంకమాంబ : ఓహ్! అక్కమహాదేవిభక్తి అనన్యసదృశము చిన్న చిన్న మాటలలో చక్కని వచనమును చెప్పినది

మొల్ల : ఆమె భక్తి బహుజన్మ తపః ఫలము.

రంగా : నశ్వరదేహమునందభిమానమును వదలిన ధన్యురాలు మహాయోగిని మహారాజు వలచి వచ్చి వివాహమాడుమని బ్రతిమాలినను త్రోసి రాజన్న మహాసౌందర్యవతి అక్కదేవి

పళని : ఇట్టి సద్గుణ శీలవైభవ సమన్వితులే దేశక్షేమమునకును జాతి గౌరవమునకు కారణములు.

తిమ్మక్క అధ్యాత్మిక సంపదకు అక్కదేవి వంటివారు తార్కాణములు

సరస్వతి అక్క మహాదేవీ ! నీవు పుణ్యపేటివి. ధన్యురాలవు.

లల్ల కలభాషిణీ ! నువ్వు కళాపూర్ణోదయంలో చదివిన గద్యం వినిపించవా?

కలభాషిణి అట్లే పింగళి సూరనగారు నా చేత వినిపింప జేసిన గద్యేగదా ! శ్రీ కామినీ కామితాకార సాకార కారుణ్యధారా ! (గద్య మొత్తం చదువుతుంది)

ఐరావతీకార్వే ఘటనాఘటోత్కట నవీన పాండిత్య
గరిమలు భళియనంగ
నోష్ఠ్యనిరోష్ఠ్యాధి కోద్దామరస
గర్భ సందర్భమౌనని సన్నుతింప
మా కందమంజరీ మధురుఖరీమాధుర్య
రచనా విశేష మౌరా యనంగ
పరిహృతేతర యుక్తి భాగ నూతన
కథా చాతుర్యధుర్యత పరిఢవిల్ల
కవిత్వం చెప్పేదానివిట కదూ రామభద్రాంబ !
జెంగల్వ కాళయ్య గురువుగారిచేత ఘనతచెప్పించుకున్నారు
నువ్వూ చంద్రరేఖా కృష్ణాజమ్మ కూడా -
అదృష్టవంతులు -

మాచలదేవి ఈమధ్యన ఎవరో ఒక కవిశ్రేష్ఠుడు అదేనమ్మా ఆయన పేరు ఆ విశ్వనాధ సత్యనారాయణట తనంత ఘనుడు శిష్యుడవటం నన్నయ తిక్కనాధులకి లేదు తన గురువుగారి కొక్కరికే ఆ అదృష్టం లభించింది అని స్తుతించాట్ట గురువుగార్ని

త్రివేణి ఏమిటీ అంత మాట అన్నారా ? ఎంత ధైర్యం ?

లకుమాదేవి బాగానేవుమ్మా చమత్కారం ఇందులో ఆకవి తనను పొగుడుకుంటూ గురువుగార్ని పొగిడాడన్నమాట

ఆయన అహంకారంకంటే సామర్థ్యమే ద్యోతకమవుతోంది ఇందులో -

ఇరావతి అహంకారం అంటే గుర్తుకొస్తోంది వెంగమాంబగారూ వినిపించరూ మీ వినయాన్ని

వెంగ వినరయ్య కవులార ! విద్వాంసులార
ఘనయతి ప్రాససంగతులు నేనెరుగ
వరుసనాక్షేపింపవలదు సత్కృపను

రంగాజీ నీ వినయం ఆశ్చర్యం గొలుపుతోంది వెంగమాంబా ! నీ గురువుగారెవరు ?

వెంగ నా చిన్ననాట ఓనమాలనైన అభ్యసించలేదు ఆ పరమసద్గురువు దయ వలననే విద్య సంప్రాప్తించినది అయినా నేనేమంత గొప్పగా రచించగలను? మధురపదార్థాలు వడ్డించిన విందులో కేవలం పచ్చడిలాంటిది నా కవిత్వం.

రంగాజీ పచ్చడిలేనిదే భోజనానికి రుచిఏముంటుంది? ష్ష్ ష్ష్

మొల్ల పచ్చడి అనంగానే అందరికీ చమత్కారాలు కలుగుతున్నైసుమా వెంగమాంబా !

ముద్దుపళని రంగాజమ్మగారికి కొత్త చింతకాయ పచ్చడి గుర్తుకొచ్చినట్లుంది

గంగాదేవి కందిపచ్చడో ఆవకాయోకాదా ? గోంగూ రాలేక ?

అక్కమహాదేవి ఇన్నిరకాల పచ్చళ్ళు చేసుకుంటారా ఆంధ్రదేశంలో మీరు?

ముద్దువళని . ఓ! అల్లంపచ్చడి, నువ్వులపచ్చడి, గోంగూర పచ్చడి బ్రహ్మాండంగా వుంటయ్యనుకో అక్కమహాదేవి, శ్రీశైల మల్లికార్జునస్వామివారు ఒక్క రోజూ తన సన్నిధిలో తెలుగు భోజనం రుచి చూపించలేదా నీకు అక్కమహాదేవి ? అయ్యో -

అక్కదేవి : ఆఁ వాతోకూడా పరిహాసమేనా వళనీ ! నాకు ఉపవాసాదాదులేతప్ప భోజనా లేమిటమ్మా? మావాళ్ళు మటుకు బిసి బెళహుళి అన్న చేస్తారు

మధురవాణి ఆఁ ఇంతకీ ఏమేం పచ్చళ్లు నూరావో అదే ఏమేం గ్రంథాలు రాశావో అమ్మవారికి వినిపించకూడదూ? వెంగమాంబా ?

సరస్వతి అయితే మధురవాణీ ! పచ్చళ్ళు రుచిగావుంటాయంటావా ? పద్యాలా? (చిరునవ్వుతో).

మధుర సరస్వతీ మహాదేవి చమత్కారానికి నేనునోచుకున్నాను మహాప్రసాదం. పచ్చళ్ళు వేడి వేడి అన్నంలో కాస్త నెయ్యో నూనో వేసుకుని కలుపుకుని తింటే ఆ కాసేపూ బావుంటాయి తల్లీ ! అందులో గుంటూరు గోంగూర పచ్చడి ఎంతబావుంటుందో చెప్పలేము - కానీ పద్యాలు శాశ్వతంగా బావుంటాయి ఆ చంద్రతారార్కమూ మంచి పద్యాలు వర్థిల్లుతాయి. ఒకోసారి తాళపత్ర గ్రంథం ఖిలమైనాసరే ప్రజలనోళ్ళమీద నాట్యమాడు తుంటాయి మంచిపద్యాలు.

మనోరమ మొత్తంమీద ప్రజలనోళ్ళల్లో నీరూరించేవేనన్నమాట పచ్చళ్ళూ పద్యాలూ? వెంగమాంబా ! ఇంతకీ...

వెంగ నారసింహాంకితశతకమట-

మీద నారసింహ విలాసకథయు

అటు రాజ యోగసారాఖ్యమౌద్విపద

అటు కృష్ణనాటకమదియునుగాక

అట పారిజాతాపహరణ సత్కృతియు

అట రమాపరిణయంబను పెండ్లిపాట

మరియు శ్రీకృష్ణ మంజరీ

యవల నిరుపమ శ్రీ రుక్మిణీ నాటకంబు

అటు చెంచునాటకంబదియును గాక

శ్రీకృష్ణనాటకంబను నొక్క కథయు

విరచించి రక్తితో వేంకటశైలపతికిచ్చితి నతిభక్తితోడ -

తిమ్మక్క అబ్బ- ఎన్ని భక్తిపూర్వకరచనలు చేశావు వెంగమాంబా ! ఎంత ధన్యురాలివి.

కృష్ణాజమ్మ -

అమ్మా ! సర్వమంగళ ప్రదాయినీ ! వరదాయినీ ! నేడు సభ తీరియున్న ఆంధ్రదేశమునకు పుట్టపర్తి నారాయణాచార్యులుగారి పద్యముతో శుభాశంసనములు పలికెదను - అనుజ్ఞ ఇమ్మ

సరస్వతి ఆంధ్రదేశమునకేకాదు యావద్భారతమునకే కాదు సకల ప్రపంచమునూ శాంతిసౌఖ్యములతో అలరారవలెననియే నా తలంపు - కానిమ్మ కృష్ణాజీ

కృష్ణాజమ్మ.

వేదాద్రి నరసింహవిపులవక్షస్స్పృత

కల్హారమాలికా గంధలహరి

## శారదా విజయం

ఏడుకొండలరాయ. దేవ. ఎకాపూట
భోగించు పచ్చకప్పురపు తంపు
శ్రీ కాళహస్తీశ శివతాతిరూప రేఖా
స్మిగ్ధనైగనిగ్యముల ముంపు
భ్రమరాంబికా సమర్చ్యాకుంకుమోన్మిశ
పుష్పచంద్రకితమ్ముబొలుచు చెలువు
కవితగా గానముగ చిత్రకళగ
నాట్యకళయుగా ప్రతియింట సాక్షాత్కరించి
ఆంధ్ర దేశంబు మన భాషనలవరించి
యెదుగుగావు తసంతతాభ్యుదయమహిమ

సరస్వతీ తథాస్తు చాలా బాగా జరిగింది నేటి సభ. నారీ శిరోమణులారా! కుల మతాలూ, వర్ణ వైరుధ్యాలూ, విద్యనూ, సహృదయాన్నీ నిర్దేశించలేవు. వర్ణ, వర్గ, జాతి వైషమ్యాలు నశించి, సుస్థిర సుఖ సమాజం ఏర్పడడానికి కవి సమూహమంతా కృషి చేయాలి. ప్రతి వ్యక్తిలోనూ పరమాత్మాంశ నిక్షిప్తమై ఉంటుంది. ఆ పరమాత్మకు ఏ భేదాలూ లేవు. సర్వేజనా స్సుఖినో భవంతు అని విద్యా వంతులు ఎలుగెత్తి చాటాలి స్వార్థం కలిగించే అనర్థాన్ని నిరూపించాలి - కావ్యం విశ్వశ్రేయోదాయకం కావాలి

(అందరూ లేచి నిలబడతారు)

జయజయోస్తు శారదాంబా !

మొల్ల . జననీ ! వాణీ ! ప్రజాసమూహముపై నీ అపూర్వ కరుణను ప్రసరించ వలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

సరో విభేదాలు సమసిపోయి విద్యా విజ్ఞానాలు వెల్లి విరిసి జనులందరూ సమైక్య దృష్టితో వర్ధిల్లేటట్లు అనుగ్రహించుతల్లీ ! వాగధిష్ఠాన దేవతా ! సకల కళాప్రపూర్ణ చంద్రవదనా !

సరస్వతి తథాస్తు

అంతా శ్వేతాబ్జ వాసినికి చిత్కళా రూపిణికి
శారదాదేవికిని నీరాజనమ్
ఆదర్శ పత్నికిని అర్ధనారీశ్వరికి
ఆనంద శ్రీ సతికి నీరాజనమ్
ఔపనిషదుషకును ఇందిరా సన్నుతకు
సంక్షేమ భారతికి నీరాజనమ్
సౌందర్య లహరికిని షట్చక్ర విహారిణికి
సంపూర్ణ కరుణకును నీరాజనమ్
సౌభాగ్య దాయినికి శాంతి సంస్థాపనకు
స్త్రీ మహాశక్తికిని నీరాజనమ్
స్త్రీ మహాశక్తికిని నీరాజనమ్
స్త్రీ మహాశక్తికిని నీరాజనమ్
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

సమాప్తం





జననం 21 జులై 1943

యాజలి గ్రామం, గుంటూరు జిల్లా

తల్లిదండ్రులు ఓగేటి అన్నపూర్ణ, చంద్రమౌళి

భర్త శ్రీ సత్యవాద వెంకట సుబ్బారావు

సంతానం శ్రీధర్, శాంతిప్రియ

## సత్యవాద (ఓగేటి) ఇందిరాదేవి

విద్య 1966లో ఉస్మానియా విశ్వవిద్యాలయం,
ఎం.ఏ (తెలుగు)
మాడపాటి హనుమంతరావు స్వర్ణపతక గ్రహీత

ఉద్యోగం ప్రభుత్వ సిటీ కాలేజిలో తెలుగు ప్రధానాచార్యులు.

రచనా వ్యాసంగం వసంతరాజీయం, (1966) యువమాస పత్రికలో మొదటి కథ, సుమారు 200 కథలు, అనేక వ్యాసాలు, ఉపన్యాసాలూ వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. "మధురానుబంధం", "ఆనందధార" మొదలయిన అయిదు నవలలు

రేడియో, టీవీ కార్యక్రమాల్లో పాల్గొనడం.

"శారదావిజయం" రూపకం అమెరికా తానావారి సభలలోనూ, యితరత్రానూ చాలాసార్లు ప్రదర్శింపబడింది

రాబోవు గ్రంథాలు "మా తెలుగు తల్లికి మల్లెపూదండ"
"ఇందిరా మందిరం" (సాహిత్య రూపకం),
"వ్యాసమంజరి"
కథా సంపుటాలు